www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 218 | సోమవారం 29-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

సమస్యల వల

విశాలాంధ్ర - విశాఖపట్నం:

విశాఖలోని ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణలో తీవ్ర జాప్యం రాష్ట్రం నుంచి మత్స్య ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం కొరవడటం, రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల కాకపోవడంతో హార్బర్ ఇంకా సమస్యల్లోనే కొట్టుమిట్టాడుతున్నది.

అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపింది. వైజాగ్ ఫిషింగ్ హార్బర్(వీఎఫ్‌హెచ్)

- అభివృద్ధికి నోచని విశాఖ ఫిషింగ్ హార్బర్
- ఇంకా విడుదల కాని రాష్ట్ర వాటా
- కేంద్ర, రాష్ట్రాల మధ్య కొరవడిన సమన్వయం
- త్వరలో పనులు ప్రారంభం : ఏపీ ప్రభుత్వం

ఆధునీకీకరణ వ్యయంలో 50 శాతం వాటాను పంచుకోవడానికి అంగీకరించింది. రాష్ట్రం నుంచి మత్స్య ఉత్పత్తులు చాలా వరకు యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2016-17 సంవత్సరంలో రూ.[illegible],871 కోట్ల జాతీయ స్థూల విలువలో ఆంధ్రప్రదేశ్ నుంచి మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు రూ.17 వేల కోట్లుగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేల్లగా విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణకు అవసరమైన రూ.40 కోట్ల తన వాటా(50 శాతం)ను విడుదల చేయలేకపోయింది. 1976లో 26 ఎకరాలకుపైగా స్థలంలో వీఎఫ్‌హెచ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ 11 జెట్టీలు, సుమారు 700 మెకనైజ్డ్ బోట్‌లను నిర్వహిస్తున్నారు. అయితే హార్బర్ ప్రాంతంలో దుర్గంధ పరిస్థితులు నెలకొన్నాయి. ఫిష్ ల్యాండింగ్ పాయింట్లతో సహా నీటి సౌకర్యం, రహదారుల అనుసంధానం, డ్రెయినేజీ సహా అన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. వీధి దీపాలు కూడా లేకపోవడం వంటి సమస్యలతో



వీహెచ్‌ఎఫ్ కొట్టుమిట్టాడుతోంది.

2004 సునామీ, 2014, అక్టోబర్‌లో హుదుద్ పెను తుపాను సమయాలలో హార్బర్ దెబ్బతింది. ఇదిలాఉండగా, జెట్టీలు, డ్రెయినేజీ, రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచడం, ఎగుమతి క్యూబిక్‌ల ఏర్పాటు కోసం రూ.40 కోట్ల వ్యయంతో వీఎఫ్‌హెచ్ ఆధునికీకరణ కోసం మత్స్య ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి మండలి ఒక సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారు చేసింది.

'ఎగుమతి పథకం కోసం వాణిజ్య సదుపాయం క్రింద రెండేళ్ల క్రితం వ్యయంలో 50 శాతాన్ని భరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులను విడుదల చేయడానికి బదులుగా మిగిలిన వాటా విషయమై విశాఖపట్టణం పోర్టు ట్రస్టు(వీపీటీ), జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు(ఎన్‌ఎఫ్‌డీబీ)ని సంప్రదించింది' అని ఈ ప్రణాళికకు సంబంధించిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఎన్‌ఎఫ్‌డీబీ తోసిపుచ్చగా, యూజర్ ఛార్జీలను గణనీయంగా పెంచే షరతుపై రూ.20 కోట్లు ఖర్చు చేసేందుకు వీపీటీ అంగీకరించింది. 'ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు'

- మిగతా 2 లో



ఆకలి తీర్చే అక్రోటు

అక్రోట్లు తిన్నప్పుడు కడుపు నిండిన భావన కలుగుతుందని చాలామంది చెబుతూనే ఉంటారు, అయితే దీని వెనకగల కారణమేంటో బయట పడటం ఆసక్తి కలిగిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు.

8 లో



క్యాన్సర్‌ను నివారించే మసాలా దినుసులు

మాంసాన్ని కొందరు పెద్ద మంట మీద, నిప్పుల మీద కాల్చి, వేయించి తింటుంటారు. ఇలా అత్యధిక ఉష్ణోగ్రతలో మాంసాన్ని వండితే హెటె రోసైక్లిక్ అమైన్లు (హెచ్‌సీ ఏలు) అనే క్యాన్సర్ కారకాలు ఉత్పత్తి అవుతాయి.

బీజేపీ ముందస్తు తాయిలం...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :

బీజేపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వజ్ర చతుర్భుజి' రైలు కారిడార్లకు రానున్న బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించనున్నట్లు సమాచారం. నాలుగేళ్ల

'వజ్ర చతుర్భుజి'కి నిధుల వెల్లువ

- 6 కారిడార్లతో మెట్రో నగరాల అనుసంధానం
- గతేడాది రెండు కారిడార్లకు కేటాయింపులు
- 4 కారిడార్ల అంచనా వ్యయం రూ. 4వేల కోట్లు
- తెలుగు రాష్ట్రాల మీదుగా మూడు కారిడార్లు

పాలనలో తన ప్రాభవం మసకబారుతున్న నేపథ్యంలో ఏడాది ముందుగానే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని మోడీ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తగ్గుతున్న ప్రజాదరణను పెంచుకునే క్రమంలో బడ్జెట్‌లో తాయిలాలు, పథకాలు ప్రకటించడం ద్వారా తిరిగి అధికారంలోకి రావడం కోసం ఇప్పటికే ప్రణాళికను రూపొందించినట్లు తెలుస్తోంది. వాజ్‌పేయి హయాంలో దేశంలోని ప్రధాన



మెట్రోనగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతాలను 'స్వర్ణ చతుర్భుజి' ప్రాజెక్టు ద్వారా జాతీయ రహదారులను అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. మోడీ ప్రధాని అయ్యాక 2014 జూన్ 9వ తేదీన అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 'వజ్ర చతుర్భుజి' పథకం ద్వారా నాలుగు ప్రధాన నగరాలను 6 రైలు కారిడార్లతో అనుసంధానం చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కారిడార్లలో హైస్పీడ్, బుల్లెట్ రైళ్లను నడపనున్నారు. కారిడార్ల నిర్మాణం పూర్తయితే ఆయా మార్గాల్లో సరాసరిగా గంటకు 160 కి.మీ. నుంచి గరిష్టంగా 200 కి.మీ. వేగంతో రైళ్లను నడుపుతారు. ఆయా మార్గాల్లో ప్రస్తుతమున్న ప్రయాణ సమయం సగానికి తగ్గిపోతుందని రైల్వేవర్గాలు పేర్కొంటున్నాయి. ఢిల్లీ-ముంబై కారిడార్ (1442కి.మీ.)కు రూ.

- మిగతా 2 లో

ప్రమాదంలో రాజ్యాంగం



మాట్లాడుతున్న జస్టిస్ చలమేశ్వర్

- పెరుగుతున్న అసమానతలు
- వ్యక్తి పూజ ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- వారసత్వ పాలన శ్రేయస్కరం కాదు
- జడ్జి కావటంతోనే రాజకీయాలకు దూరం
- రిటైర్డ్ అయ్యాక పదవుల కోసం పాకులాడను
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్

విశాలాంధ్రబ్యూరో - అమరావతి

అందరికీ సమానత్వాన్ని ప్రసాదించే రాజ్యాంగమే నేడు ప్రమాదంలో ఉందని, దేశంలో అన్ని విధాలుగా అసమానతలు పెరిగిపోతున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతికంగానూ అసమానతలు పెరుగుతున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యదేశానికి ఇది అంత శ్రేయస్కరంకాదని, ఈ నేపథ్యంలో పౌర సమాజం చైతన్యవంతమై రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. సీనియర్ న్యాయవాది కంఠంనేని రవీంద్రరావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రరావు తృతీయ వర్ధంతి కార్యక్రమం విజయవాడలోని సిద్ధార్థ అకాడమీలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాజ్యాంగవాదం - పౌర సమాజం అనే అంశంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ కీలకోపన్యాసం చేశారు. రాజ్యాంగం అనేది వ్యక్తికాదని, అది ఒక వ్యవస్థ అని చెప్పారు. విద్య, వైద్యం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి హక్కులను అదే ప్రజలకు కల్పించిందన్నారు. అలాంటి రాజ్యాంగమే నేడు ప్రమాదంలో పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అసమానతలు పెరిగినప్పటికీ, అది దేశంలోనే తీవ్రంగా ఉందని చెప్పారు. ఇందుకు అనేక చారిత్రక కారణాలు ఉన్నప్పటికీ, ఆర్టికల్ 14 నుంచి 18 నిబంధనల ప్రకారం

- మిగతా 2 లో

ట్రిపుల్ తలాక్‌పైనే తకరారు

ఏకాభిప్రాయం అవసరం : అఖిలపక్ష సమావేశంలో కేంద్రం



- ప్రతిపక్షం చేతిలో వర్తకుల దయనీయ స్థితి, రాజ్యాంగ సంస్థలపై దాడి, పెరుగుతున్న అత్యాచార సంఘటనలే అస్త్రాలు
- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ :

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలను విజయవంతమయ్యేందుకు రాజకీయ పక్షాల నేతలు సహకరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కోరారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత కుమార్ తెలిపారు. బడ్జెట్ సమావేశాలపై ఆదివారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం అనంతకుమార్ మాట్లాడుతూ ఈ సమావేశాల్లో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. బిల్లుపై ఏకాభిప్రాయం కోసం పార్టీలతో మాట్లాడతామని చెప్పారు.

జనవరి 28న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సమస్యలను, ప్రతిపాదిత చట్టాల గురించి చర్చించేందుకు పార్లమెంటరీ లైబ్రరీ భవనంలో ప్రభుత్వ ప్రతినిధులు, విపక్ష సభ్యులు సమావేశమయ్యారు. రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్న ట్రిపుల్ తలాక్ బిల్లుతోపాటు ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా మంజూరు కోరుతూ బిల్లును కూడా ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదిలాఉండగా, దేశంలో వర్తకుల దయనీయ స్థితి, రాజ్యాంగ సంస్థలపై దాడి, పెరుగుతున్న అత్యాచార సంఘటనలు వంటి విషయాలపై

- మిగతా 2 లో

'మహా' సంక్షోభం

- ఒంటరి పోరే : శివసేన ప్రకటన
- బీజేపీకి ముచ్చెమటలు
- చీలనున్న కాషాయ ఓట్లు?
- కాంగ్రెస్, ఎన్‌సీపీకి లబ్ధి?

- వివరాలు 9 లో

ఇదీ లోకం!





బెల్లం పొయ్యికి ఊపిరిలూదిందిక్కడే

- చెరకు పరిశోధనల్లో అగ్రగామి అనకాపల్లి
- నేడు కిసాన్‌మేళాకు ఉత్తరాంధ్ర రైతులు

విశాలాంధ్ర-అనకాపల్లి:

చెరకు పరిశోధనల్లో విశాఖ జిల్లా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అగ్రగామిగా నిలుస్తోంది. దేశం మొత్తంలోనే మొట్టమొదటి సారిగా బెల్లం పొయ్యి ఇక్కడ రూపొందించారు బెల్లం పొయ్యిల తయారీకి ఇక్కడ పొయ్యి నమూనానే తీసుకున్నారు. సోమవారం స్థానికంగా జరిగే కిసాన్‌మేళాలో విశాఖతోపాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల రైతులు పాల్గొంటారు. ఈ సందర్భంగా వంద సంవత్సరాలుగా చరిత్ర కలిగిన

- మిగతా 2 లో



మేడారం సందడి

- తరలివస్తున్న భక్తులు
- భక్తిశ్రద్ధలతో దర్శనం
- అసంపూర్తి ఏర్పాట్లతో తప్పని తిప్పలు
- సౌకర్యాలు, ఏర్పాట్లపై కడియం సమీక్ష
- త్వరితగతిన పనులు పూర్తికి ఆదేశం



విశాలాంధ్ర-మేడారం :

కుంభమేళ తరహాలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. సమ్మక్క-సారలమ్మలను భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు. తెల్లవారుజాము 2 గంటల నుంచే భక్తుల రాక మొదలవడంతో మేడారం జాతర సందడి సందడిగా మారింది. ఆదివారం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో పాటు మరికొందరు మంత్రులు

- మిగతా 2 లో

బక్కచిక్కుతున్న గిరిజన సంక్షేమం

- తగ్గిపోతున్న నిధులు
- బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు

9లో

అవినీతిపై పోరులో యువత సహకరించాలి

- ఎన్‌సీసీ ర్యాలీలో ప్రధాని మోదీ విజ్ఞప్తి
- పద్మ అవార్డుల ఎంపికలో పారదర్శకత

9లో

అనంతకు ప్రత్యేక ప్యాకేజీ కోసం కృషి

విశాలాంధ్ర ప్రతినిధి-అనంతపురము :

రానున్న బడ్జెట్ లో అనంతపురము జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకుని వస్తానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలిపారు. జిల్లాలో ఆయన చేపట్టిన కరవు యాత్ర రెండవ రోజులో భాగంగా కదిరి, పుట్టపర్తి లలో పర్యటన కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో

- సత్యసాయి జిల్లా కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- కదిరి, పుట్టపర్తి సభల్లో పవన్ కల్యాణ్

ప్రకృతి వ్యవసాయానికి అనుకూలంగా లేకపోవడం బాధ కలిగిస్తోందన్నారు. అయినప్పటికీ సమస్యలు వస్తున్నా వాటిని ఎదుర్కొనేలాగా ప్రతి ఒక్కరూ ఎదగాలన్నారు. మానవ మేధస్సు అత్యంత గొప్పదని, ప్రతి సమస్యకూ పరిష్కారం లభించేలా చేస్తుందన్నారు. జిల్లా నుంచి ఎక్కువ మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్నారని అయితే అక్కడ వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అందుకే గల్ఫ్ బాధితుల సహాయం కోసం తెలంగాణ తరహాలో విధి విధానాలను రూపొందించాలన్నారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతానన్నారు. అన్నా హజారేను ఆదర్శంగా తీసుకుని



జిల్లాలో సేవా, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలో గత తరం నాయకులైన తరిమెల నాగిరెడ్డి, యోగి వేమన, నీలం సంజీవరెడ్డి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ లను స్ఫూర్తిగా తీసుకుని తాను రాజకీయ, సేవా కార్యక్రమాలను నిర్వహించాలని అనుకుంటున్నట్లు తెలిపారు. అందుకే జిల్లాను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించానన్నారు. అంతకుముందు ఆయన కదిరి లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకుని ఎమ్మెల్యే అత్తర్ చాంద్‌భాషా ఇంటికి వెళ్లి వచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబ సభ్యులు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం కదిరి

- మిగతా 2 లో

ఎమెన్‌లో వేర్పాటువాదుల పైచేయి?



ఏడెన్ : ఎమెన్‌లో వేర్పాటువాదులు పైచేయి సాధించినట్టుగా కనిపిస్తోంది. దేశ రాజధాని ఎడెన్ నగరంలోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలను వేర్పాటువాదులు స్వాధీనం చేసుకున్నట్టుగా స్పుత్నిక్ విలేకరి ఆ వర్గాలు తెలిపాయి. హౌతి తీవ్రవాద గ్రూప్‌లు ఆధిపత్యం గల ఉత్తరప్రాంతం నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా అవతరించాలని వేర్పాటువాదులు ప్రయత్నిస్తూ దక్షిణ పరివర్తనా మండలిని ఏర్పాటు చేస్తున్నారు. దేశ అధ్యక్షుడు అబ్ద్రబు మన్సూర్ హాది తన మంత్రివర్గాన్ని రద్దు చేయాలని వేర్పాటువాదులు డిమాండు చేస్తున్నారు. ఇందుకోసం వేర్పాటువాదులు ప్రదర్శనలు జరిపారు. ప్రధానమంత్రి అహ్మద్ బిన్ దఘర్ ఇతర మంత్రులు అవినీతిలో కూరుకుపోయినందున వారిని తొలగించాలని అధ్యక్షుడిని డిమాండు చేశారు. ప్రస్తుతం ఈడెన్‌లో రెండు ప్రాంతాల గ్రూప్‌ల మధ్య ఘర్షణలు జరుగుతున్నట్టుగా వార్తలు అందుతున్నాయి.

ఫ్రాన్సు పర్వతారోహకుడిని రక్షించిన పోలెండ్ గ్రూప్

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లో గల నంగా పర్‌బర్త్ పర్వతంపై అత్యంత ఎత్తులో ఫ్రాన్స్ పర్వతారోహకుడిని ప్రమాదం నుంచి పోలెండ్ పర్వతారోహకుల గ్రూప్ రక్షించింది. నంగా పర్‌బర్త్ ప్రపంచంలో అత్యంత ఎత్తైన పర్వతాలలో ఒకటి. తప్పిపోయిన పర్వతారోహకుడి ఆచూకి కోసం వెతుకుతున్న ఫ్రాన్స్ గ్రూప్ తన ప్రయత్నాలను నిలిపివేసింది. పాకిస్థాన్ సైనిక సహాయంతో పోలెండ్ పర్వతారోహకుల గ్రూప్ నంగా పర్‌బర్త్‌పైన చిక్కుకుపోయిన ఫ్రాన్స్ పర్వతారోహకుడు ఎలిసబెర్త్ రివోల్‌ని రక్షించే కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం ప్రారంభించింది. నంగా పర్‌బర్త్‌కి కిల్లర్ మౌంటెయిన్ అనే పేరు కూడా ఉన్నది. పర్వతంపై వాతావరణం అనుకూలించకపోవడంతో ఆచూకీ తెలియని పర్వతరోహకుడి కోసం వెదికే కార్యక్రమాన్ని నిలిపివేసినట్టు తెలుస్తోంది. ఇది అత్యంత విచారకరమైన నిర్ణయమే అయినప్పటికీ దర్యాప్తు బృందం తీవ్రమైన ముప్పును ఎదుర్కొనే అవకాశం ఉన్నందున గాలింపు కార్యక్రమాన్ని నిలిపివేసినట్టు చెప్పారు. పాకిస్థాన్ సహాయంతో నలుగురు పోలెండ్ పర్వతారోహకులు పర్వతం దిగువ ప్రాంతం నుంచి పైకి విమానం ద్వారా చేరుకున్నారు. బేస్‌క్యాంప్ కే-2 కూడా ప్రపంచంలో అత్యంత ఎత్తైన అతిపెద్ద రెండవ శిఖరం.

విశాలాంధ్ర ప్రపంచం

జపాన్‌తో మళ్లీ సాధారణ సంబంధాలు

చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ వెల్లడి



బీజింగ్ : జపాన్‌తో మళ్లీ సాధారణ సంబంధాలు ఏర్పడగలవన్న ఆశాభావాన్ని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ వ్యక్తం చేశారు. జపాన్ విదేశాంగ మంత్రి తరో కానోతో వాంగ్ ఆదివారం సమావేశం అయిన అనంతరం పై విధంగా స్పందించారు. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు, ఆ తరువాత చైనా, జపాన్‌ల మధ్య అనేక అంశాలలో విభేదాలు ఏర్పడ్డాయి. అయితే, బాధాకరమైన చరిత్రను రెండు దేశాలు మరిచిపోయేందుకే ప్రయత్నించాయి. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు, ఆ తరువాత చైనాపైన జపాన్ దాడులు జరిపింది. ఇంకా పలు అంశాలలో విభేదాలున్నాయి. తూర్పు చైనా సముద్రం ప్రాంతాలు, సరిహద్దులపైన చాలా కాలంగా సమస్యలు పరిష్కారం కాకుండా ఉండిపోయాయి. అలాగే, జపాన్ ప్రధాని షింజో అబే దేశ ఫాసిస్టు రాజ్యాంగ సవరణ హామీపైన చైనా సందేహాలను వ్యక్తం చేసింది. సమస్యలు అలా ఉన్నప్పటికీ రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలకు కృషి చేయాలని గత నవంబరులో సమావేశమైన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, షింజో అబే నిర్ణయించారు. వియత్నాంలో జరిగిన ప్రాంతీయ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా వీరిరువురు సమావేశమయ్యారు. తరో కానో మాట్లాడుతూ, రెండు దేశాల మధ్య సహకారం పెంపొందించుకోవాలని కోరారు. ఉత్తర కొరియా అణ్వాయుధాల కార్యక్రమాన్ని నిలిపివేసేందుకు చైనా కృషి చేయాలని అన్నారు. దీర్ఘకాలికంగా స్తబ్దుగా ఉన్న రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నెలకొనగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తమకు సంబంధించిన సమస్యలపైనే కాక ప్రపంచ సమస్యలపై కూడా రెండు దేశాలు దృష్టిపెట్టగలవన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. సంబంధాలు మెరుగయ్యేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. చైనా, దక్షిణ కొరియా, జపాన్‌ల త్రైపాక్షిక సమావేశాన్ని నిర్వహించి ఉత్తరకొరియా అణుకార్యక్రమంతో పాటు ప్రాంతీయ సమస్యలను పరిష్కరించుకోవాలని జపాన్ కోరుతున్నది.

బాంబు దాడిపై కాబూల్‌లో ఆగ్రహం

ఐరాస ఖండన : నిర్ణయాత్మక చర్యకు ట్రంప్ పిలుపు



కాబూల్ : కాబూల్‌లో అంబులెన్స్ బాంబుదాడి జరిపి దాదాపు వందమందిని పొట్టనబెట్టుకుని మరో 190 మందిని గాయపరిచిన తాలిబన్ ముష్కరులపౌ నగర ప్రజలలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమౌతోంది. ప్రపంచంలోని అనేక దేశాలు ఈ దుర్ఘటనకు బాధ్యులైనవారిపైన కఠిన చర్య తీసుకోవాలని కోరుతున్నాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఈ దాడిని మతిమాలిన, పిరికిపంద చర్యగా అభివర్ణించింది. టెర్రరిస్టు ఘాతుకాలకు పాల్పడుతున్న వారిని పట్టుకుని విచారణ జరిపి తగిన విధంగా శిక్షించాలని భద్రతామండలి ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. వారం రోజులలోపు రెండోసారి బాంబుదాడి జరిపిన తాలిబన్ల ఘాతకంపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. శనివారం జరిగినీ బాంబు దాడిలో 95 మంది మృతిచెందగా, 191 మందికి గాయాలయ్యాయని ఆఫ్ఘనిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి వహీద్ మజ్‌రోహ్ ఆదివారం విలేకరులు తెలిపారు. సోషల్‌మీడియా ద్వారా దేశ ప్రజలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. వేగంగా దేశంలో భద్రత క్షీణించడంపై ప్రజలు ఆవేదనచెందుతున్నారు. ఇటీవల తాలిబన్లు, ఇసిస్ ఉగ్రవాద గ్రూప్‌లు తమ దాడులను పెంచాయి. తాము ఇళ్లలో వుండలేము, పనులకు వెళ్లలేం ఇలా వున్నది పరిస్థితి అని వారు ఆవేదన చెందుతున్నారు. స్నేహితులను కలవడానికి లేదు. కేవలం భ్రమలతో కూడిన ఆశలే ఉన్నాయి. కాబూల్‌లో ఒక్కరోజు కూడా భద్రమైన జీవితం ఉంటుందని చెప్పలేకుండున్నామని అనేక మంది ప్రజలు ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హక్కాని నెట్‌వర్క్ అనుబంధ తాలిబన్ ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడిన విషయం తెలిసిందే.

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో బుటెర్రస్ ఒక ప్రకటనలో పౌరులపైన విచక్షణారహితంగా దాడులు చేయడం మానవహక్కులు, అంతర్జాతీయ మానవీయ చట్టం ఉల్లంఘనలను ఎవరూ సమర్థించలేరని పేర్కొన్నారు.

కొలంబియా పోలీసులపై బాంబు దాడి

ఐదుగురి మృతి : 41 మందికి గాయాలు



బొగోట : కొలంబియా పోలీసులపైన మాదక ద్రవ్యాల వ్యాపారులు రిమోట్ కంట్రోల్‌తో బాంబు దాడి జరిపారని అధికారులు తెలిపారు. బరంక్విల్లా నగరంలోని ఉత్తర ప్రాంతంలో గల పోలీసు స్టేషన్‌పై ఈ బాంబు దాడి జరిగింది. కొలంబియాలో బరంక్విల్లా నగరం అత్యంత ముఖ్యమైనది. భద్రతా సిబ్బందిపైన జరిగిన అత్యంత తీవ్రమైన దాడుల్లో ఇదొకటి. దేశంలో గత 50 ఏళ్లుగా సాయుధ సంఘర్షణ జరుగుతోంది. ఈ సంఘర్షణకు ప్రధానంగా మాదక ద్రవ్య వ్యాపారులే నిధులను సమకూరుస్తున్నారు. దాడి జరిగిన నగరంలో వార్షిక వేడుకలను జరుపుకునేందుకు జరుగుతున్న ఏర్పాట్లపైన ఈ బాంబు దాడి తీవ్రప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఉదయం పూట డ్రిల్ కోసం పోలీసులు హాజరైన సందర్భంగా ఈ బాంబుదాడి జరిగిందని పోలీసు కమాండర్ తెలిపారు. దాడి సందర్భంగా 49 మంది అధికారులున్నారు. ఈ దాడిలో చనిపోయిన వారి వయస్సు 24-31 ఏళ్ల మధ్య ఉన్నది. బాంబు దాడికి కారకుడుగా అనుమానిస్తూ ఒక యువకుడిని అరెస్టు చేసినట్టు అటార్నీ జనరల్ నెస్టర్ మార్టినెజ్ తెలిపారు. దాడికి మాదకద్రవ్యాల వ్యాపారులే కారకులని నగర మేయర్ తెలిపారు. ఇది వారిపనే అని, ఈ విషయంలో తనకు సందేహం లేదని ఆయన అన్నారు. ప్రపంచంలోనే కొలంబియాలో అత్యధికంగా కొకైన్ ఉత్పత్తి అవుతున్నది. అనేక నేరస్థ గ్రూప్‌లు ప్రధానమైన నగరాలలో తిరుగుతూ మాదక ద్రవ్యాలను ఇతర దేశాలకు, ప్రాంతాలకు సరఫరా చేస్తుంటాయి. దాడికి కారకులైన వారి ఆచూకి తెలిపిన వారికి 17.8 మిలియన్ డాలర్ల బహుమతిని అందిస్తామని పోలీసు శాఖ తెలిపింది.

జైలు నుంచి విడుదలైన సౌదీ యువరాజు



రియాద్ : సౌదీ అరేబియా యువరాజు, అంతర్జాతీయ వాణిజ్యవేత్త, అత్యంత సంపన్నుడైన అల్వలీద్ బిన్ తలాల్ జైలు నుంచి శనివారం విడుదలయ్యారు. అవినీతి వ్యతిరేక పోరాటం సందర్భంగా రెండు నెలల క్రితం తలాల్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఆర్థిక పరిష్కార ఒప్పందం ద్వారా కస్టడీ నుంచి ఆయన విడుదలయ్యారు. రియాద్‌లో అత్యంత ఖరీదైన రిడ్జ్-కార్ల్టన్ హోటల్‌లో రాయిటర్స్‌తో ఆయన ఇంటర్వ్యూ ఇస్తూ కొన్ని రోజుల్లో తాను కస్టడీ నుంచి విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పిన కొన్ని గంటల్లోనే ఆయన బయటకు వచ్చారు. అటార్నీ జనరల్‌తో ఆర్థిక పరిష్కార ఒప్పందం కుదుర్చుకుని తలాల్ స్వేచ్ఛ పొందాడని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. శనివారం ఉదయమే ఈ ఒప్పందం కుదిరింది. ఉదయం 11 గంటల తరువాత విడుదలయ్యారని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. అయితే, ఒప్పందం వివరాలను వెల్లడించలేదు. తలాల్ విడదలతో పాటు ఇంకా అనేక మంది వాణిజ్యవేత్తలను కూడా విడుదల చేయాలని నిర్ణయించారు. అవినీతి వ్యతిరేక దాడుల సందర్భంగా దేశ వాణిజ్యవేత్తలు వణికిపోయారు. ఇప్పుడు అనేక మందిని విడుదల చేయాలని నిర్ణయించడంతో అవినీతి వ్యతిరేక పోరాటం నీరుగారినట్టే. తలాల్ రాయిటర్స్‌తో చెప్పారు. తాను అవినీతిపరుడిని కాదని, త్వరలో తన వాణిజ్యకార్యకలాపాలన్నింటిని పునరుద్ధరిస్తానని అన్నారు. పొరపాటు అవగాన కారణంగానే తనను అరెస్టు చేశారని చెప్పారు తన మీద ఎలాంటి అభియోగాలను నమోదు చేయలేదని అన్నారు.

మూడో శక్తివంతమైన దేశం చైనా

పెన్సిల్వేనియా : ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశాలలో చైనా మూడో స్థానంలో ఉందని 2018 ఉత్తమ దేశాల నివేదికలో అమెరికా న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్టు పేర్కొన్నది. పెన్సిల్వేనియా యూనివర్సిటి పరిధిలోని వార్టన్ స్కూల్ వై అండ్ ఆర్, డీఏవీ గ్రూప్‌లు ఈ సర్వే నిర్వహించాయి. దాదాపు 21వేల మందికి పైగా వాణిజ్యవేత్తలను, మేధావులను, సాధారణ పౌరులను ప్రశ్నించి సర్వే నివేదికను రూపొందించారు. అమెరికా, రష్యాలు ఈ జాబితాలో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉన్నాయి. చైనా తరువాత జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ ఉన్నాయి. మొత్తం మీద ఉత్తమ దేశాల ర్యాంక్‌లో చైనా 20వ స్థానాన్ని రెండో సంవత్సరం జరిగిన సర్వేలో కూడా కొనసాగిస్తోంది. కెనడా, జర్మనీ, బ్రిటన్, జపాన్ దేశాలు ఉత్తమ టాప్ ఐదు దేశాలలో స్థానం సంపాదించాయి.

తాయిలం...

(మొదటిపేజీ తరువాయి)

రూ.11,189 కోట్లు, ఢిల్లీ-హౌరా కారిడార్(1447కి.మీ.)కు రూ. 6,875 కోట్లను 2017-18 బడ్జెట్‌లో మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా జపాన్ సహకారంతో అహ్మదాబాద్-ముంబై మధ్య నిరుడు బుల్లెట్ రైలు మార్గం నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మిగిలిన నాలుగు కారిడార్లు... ఢిల్లీ-చెన్నై(2175 కి.మీ.), చెన్నై-హౌరా (1662 కి.మీ.), చెన్నై-ముంబై (1237 కి.మీ.), హౌరా-ముంబై (1967 కి.మీ.) మార్గాల నిర్మాణానికి నిధులు ప్రకటించే అవకాశాలున్నట్లు రైల్వే సీనియర్ అధికారి తెలిపారు. సుమారు రూ. 40వేల కోట్ల అంచనా వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టులకు నిధులను ఒకేసారి మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. వజ్ర చతుర్భుజిలో ప్రకటించిన ఆరు కారిడార్లలో మూడు కారిడార్లు తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లనున్నాయి. వీటిలో ఢిల్లీ-చెన్నై కారిడార్ నిజామాబాద్, హైదరాబాద్, విజయవాడ, ఒంగోలు, గూడూరు మీదుగా చెన్నై వెళ్లనుంది. కోల్‌కతా-చెన్నై కారిడార్ విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు మీదుగా చెన్నై చేరనుంది. ఇక ముంబై-చెన్నై కారిడార్‌ను గుంతకల్, కడప, తిరుపతి మీదుగా చెన్నైకు నిర్మిస్తారు. వజ్ర చతుర్భుజి ప్రాజెక్టులోని మొత్తం కారిడార్లను 2022 ఆగస్టు 15 నాటికి పూర్తి చేసి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు నిండిన సందర్భంగా నిర్వహించే వజ్రోత్సవాల్లో జాతికి అంకితం చేయాలనే దృఢ సంకల్పంతో బీజేపీ ఉన్నట్లు ఆ పార్టీకి చెందిన రాష్ట్ర నేతలు చెబుతున్నారు.

ట్రిపుల్ తలాక్‌పైనే తకరారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. 'ముఖ్యమైన సమస్యలను లేవనెత్తాలని మేము కోరుకుంటున్నాం. ఇందుకు ప్రభుత్వం సహకార వైఖరిని అవలంబించాలి. ఆ సమస్యలను లేవనెత్తేందుకు ప్రతిపక్షాన్ని అనుమతించాలి' అని అఖిలపక్ష సమావేశం నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారి తెలిపారు.

కాగా, సమావేశానికి ప్రభుత్వ ప్రతినిధులుగా ప్రధాన మంత్రి మోడీతోపాటు హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలు హాజరయ్యారు. విపక్షాల ప్రతినిధులుగా మల్లికార్జున ఖార్గే(కాంగ్రెస్), ములాయం సింగ్ యాదవ్(ఎస్పీ), డి.రాజా(సీపీఐ), కనిమొళి(డీఎంకె), డెరెక్ ఒబ్రెయిన్, సుదీప్ బందోపాధ్యాయ(తృణమూల్ కాంగ్రెస్), తారిక్ అన్వర్(ఎన్‌సీపీ)లు ఉన్నారు.

సమస్యల వల

(మొదటిపేజీ తరువాయి)



అని ఆ అధికారి వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వీఎఫ్‌హెచ్ ఆధునికీకరణ పథకం ప్రణాళిక ఉంది. రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించింది. కానీ ఈ విషయమై అధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయలేదు.

'రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు మాకు ఎటువంటి సమాచారం లేదు. ఒకవేళ సమాచారం అందినట్లయితే, సాగరమాల(పోర్టు భారీ ఆధునికీకరణ ప్రణాళిక) క్రింద ప్రాజెక్టును చేపడతాం' అని కేంద్ర నౌకయాన మంత్రిత్వ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. కాగా చాలా ఏళ్ల క్రితం యూరోపియన్ యూనియన్ నుంచి బృందాలు విశాఖపట్టణం పర్యటనకు వచ్చిన సమయంలో వీఎఫ్‌హెచ్ వద్ద అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితుల పట్ల ఆ బృందాల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది విశాఖపట్టణం పోర్టు ట్రస్టు చైర్మన్ ఎం.టి.కృష్ణబాబుతో రాష్ట్ర మంత్రుల గ్రూపు ఒకటి సమావేశం జరిపింది.

ఈ మేరకు హార్బర్ ఆధునికీకరణకు రూ.20 కోట్లు విడుదల చేసే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లేందుకు అంగీకరించింది. 'వీఎఫ్‌హెచ్ ఆధునికీకరణ వ్యయంలో 50 శాతం వాటాకు అంగీకరించాం. త్వరలో పనులను చేపడతాం' అని పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి తెలిపారు. టెండర్లు ఖరారయితే నాలుగైదు నెలల్లో పనులు పూర్తవుతాయని అన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ సమానత్వాన్ని పాటించి తీరాల్సిందేనన్నారు. ఎవరినీ తక్కువ చేసి చూడకూడదని, దీనివల్ల దేశానికి నష్టం వాటిల్లుతుందన్నారు. అయితే చాలా మంది రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, భవిష్యత్‌లో ఇది అంత మంచిదికాదని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో ఎక్కువ మంది మెచ్చిందే న్యాయంగా భావించటం కూడా ప్రమాదమేనని హెచ్చరించారు. కాని ఇదే విధానం నేడు అమలు జరుగుతోందని, అలాంటపుడు రాజ్యాంగం అవసరం ఏంటని ఆయన ప్రశ్నించారు.

ప్రజలలో అవగాహన పెరగాలి

రాజ్యాంగమంటే చట్ట సభలు, న్యాయస్థానాలు, న్యాయవాదులే కాదు అందులో ప్రజలు కూడా భాగస్వాములేనని జస్టిస్ చలమేశ్వర్ చెప్పారు. ఈ నేపథ్యంలో దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై పౌరసమాజం ప్రజలలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో విద్యావంతుల పాత్ర పెరగాలని సూచించారు. మహాత్మాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధి కోసం పని చేయాలనే సంకల్పం కావాలన్నారు. వ్యక్తి పూజకు ప్రాధాన్యం కల్పించటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. వ్యక్తుల గత జీవితాల, వ్యక్తి ఆరాధనలు వేరని, అయితే కుటుంబాల గతాన్ని బట్టి వ్యక్తులను ఆరాధించటం అంత మంచి సంస్కృతికాదని అభిప్రాయపడ్డారు. దేశంలో వారసత్వ రాజకీయాలు పెరగటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి సేవ చేస్తున్న వారికి పాలనాపగ్గాలు అప్పగించటంలో తప్పులేదుగానీ, గతంలో ఎపుడో వారి కుటుంబ సభ్యులు సేవ చేశారని, అందుకు ప్రతిగా కుటుంబ సభ్యులకు పాలనాపగ్గాలు అప్పగించటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కాని నేడు దేశంలో వారసత్వ పాలన ప్రబలంగా ఉందని, ఇది పెద్ద ప్రమాదకరమని హెచ్చరించారు. మరోవైపు ఎన్నికల్లో డబ్బు కీలకంగా మారిందని, వారసత్వ రాజకీయాలు, అవినీతి పెరగటం వల్ల ప్రజాస్వామ్యానికే ప్రమాదం ఏర్పడిందన్నారు.

స్వతంత్రమైన న్యాయ వ్యవస్థ ఉండాలి

దేశంలో న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా ఉండాని, దానికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం ఉండకూడదని చలమేశ్వర్ అన్నారు. ఈ విషయాన్ని తాను ఈశాన్య రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడే చెప్పానన్నారు. అందుకే తాను జడ్జిగా ఎంపికైన తర్వాత రాజకీయాలను పక్కనపెట్టానని, ఈ మేరకు అఫిడవిట్‌ను కూడా సమర్పించినట్లు చెప్పారు. న్యాయవ్యవస్థలో పౌరసమాజం కూడా భాగస్వామ్యం కావాలని లేనిపక్షంలో అది ప్రమాదంలో పడుతుందన్నారు. సమాజం గౌరవప్రదంగా బతకాలంటే పౌర సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మీడియా స్వేచ్ఛపై ఆయన మాట్లాడుతూ, తాను ఒక రాజకీయ పక్షపాతిగా సోషల్ మీడియా ప్రచారం జరిగిందని, అది పూర్తిగా అవాస్తమని పేర్కొన్నారు. విమర్శల్లోనూ హేతుబద్ధత ఉండాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు కార్పొరేట్ శక్తుల్లో ఉన్నందున అవి కొన్ని పరిమితులపై ఆధారపడి పని చేస్తున్నట్లు చెప్పారు. కాని ఇంటర్నెట్‌కు పరిమితులు లేవన్నారు.

తాను మరో నాలుగు నెలల్లో పదవీ విరమణ చేయనున్నానని, అయితే పదవుల కోసం ఏ రాజకీయ పార్టీ వద్దకు వెళ్లే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. రిటైర్డ్ అయిన తర్వాత కృష్ణాజిల్లాలోనే స్థిరపడతానని చలమేశ్వర్ వివరించారు. రిటైర్డ్ జిల్లా జడ్జి డీ సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, లా కాలేజీ ప్రిన్సిపాల్ దివాకర్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, కంఠమనేని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఊపిరిలూదిందిక్కడే

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం చరిత్రను తెలుసుకోవలసిన అవసరం ఉంది.

1913లో స్థాపించిన 2014లో శతదినోత్సవ వేడుకలను జరుపుకున్న చరిత్ర అనకాపల్లి పరిశోధన స్థానానిది. ద్విగుణీకృత ఉత్సాహంతో సంపూర్ణ చెరకు పరిశోధన, పరిపూర్ణ రైతు సేవలో మరిన్ని మైలు రాళ్ళు అధిగమించడానికి ముందుకు సాగుతుంది. 1920లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ మన రాష్ట్రంలో చక్కెర సంస్థను స్థాపించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించడానికి ఒక కమిటీని నియమించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో కొంత భాగాలు కలిసి ఏర్పడ్డ మద్రాస్ రాష్ట్రంలో చెరకు పంటకు నీరు పెట్టడం, నీరు తీయడం వంటి సదుపాయం సరిగాలేనందున భవిష్యత్తులో చెరకు సాగు విస్తీర్ణం పెరగడానికి అవకాశాలు లేవని చక్కెర పరిశ్రమ స్థాపించడానికి అవకాశం లేదని కమిటి తీర్మానించింది. అనకాపల్లి పరిశోధన స్థానంలో చెరకు నాటునప్పుడు మాత్రమే నీరు పెట్టడానికి అవకాశం ఉండేది. మిగిలిన పంట కాలంలో నీరు పెట్టడానికి అవకాశం ఉండేది కాదు. ఈ పరిస్థితుల్లో కొత్తగా విడుదలైన "కో" రకాలు ఇక్కడ సాగులో ఉండేవి. ఈ సమయంలో సాలీనా వర్షపాతం 1000 మి.మీ ఉండి సంవత్సరం పొడువునా సమానంగా పడడం విశేషం. వాతావరణ పరిస్థితులు ఈ విధంగా అనుకూలించడం వల్ల అప్పుడు విడుదలైన సివో 213, సివో 313 విశాఖ జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అనకాపల్లి పరిశోధన స్థానం నుండి నీటి ఎద్దడిని సమర్థవంతంగా తట్టుకునే కోయంబత్తూరు రకాలు విడుదల చేయడంతో చెరకు సాగు సులభతరమైంది. నీరు పెట్టే సదుపాయం లేనప్పటికీ చెరకు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో 1933లో స్వర్గీయ రావ్ బహద్దూర్ సీవీఎస్ నరసింహారాజు ఏటికొప్పాక గ్రామంలోను, 1935లో బొబ్బిలి రాజు అప్పటి ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు బొబ్బిలిలోనూ(విశాఖ జిల్లా ఏర్పడడానికి ముందు) చక్కెర కర్మాగారాలు స్థాపించారు. 1920లో కమిటి చేసిన సిఫార్సులను పక్కనపెట్టి అనకాపల్లి పరిశోధన స్థానం సివో 213, సివో 243 రకాలను వాణిజ్యపరంగా సాగు చేయడానికి కృష్ణాజిల్లాకు కూడా సరఫరా చేశారు. కమిటి సిఫార్సులను ధిక్కరించి చెరకు రకాలను సిఫార్సు చేయడానికి బ్రిటీష్ అధికారులు, శాస్త్రవేత్తలను ప్రశ్నించారని అనేవారు. కాని శాస్త్రవేత్తలు సూచించిన చెరకు రకాలు అధిక దిగుబడులిచ్చి తమ సత్తాను చాటుకున్నాయి. శాస్త్రవేత్తలు ఇచ్చిన సహకారంతో 1936లో వి.రామకృష్ణ(ఐసిఎస్) నాయకత్వంలో ఉయ్యూరులో కో-ఆపరేటివ్ సెక్టారు కింద కర్మాగారం స్థాపించారు. తరువాత 1943లో ఎం/ఎస్ కెసిపి లిమిటెడ్‌గా నామకరణం చేసి వీరి ఆధీనంలోకి తీసుకొని దినదినాభివృద్ధి చెందింది. రామకృష్ణ అనకాపల్లి శాస్త్రవేత్తల సహకారంతో అంత తెలివైన నిర్ణయం తీసుకొని ఉండలేకపోయినట్లయితే చెరకు కర్మాగారం స్థాపించడం తప్పనిసరిగా ఐదు నుండి 6 దశాబ్దాలు వెనుకబడి ఉండేదని చెప్పాలి. ప్రస్తుతం మన రాష్ట్రంలో 20 కర్మాగారాలు రోజుకు సుమారు 1.0 లక్షలు టన్నుల చెరకు గానుగడి సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఆంధ్రాలో 13 జిల్లాలో 1,20 హెక్టార్లలో చెరకు సాగుచేస్తున్నారు వంద లక్షల టన్నుల చెరకు ఉత్పత్తి అవుతున్నది. మద్రాస్ రాష్ట్రం విడిపోక ముందుగా ఈ విధంగా అనకాపల్లి పరిశోధనా స్థానం ద్వారా అందించిన సహకారంతో చక్కెర కర్మాగారం స్థాపనకు నాంది పలికింది. చక్కెర కర్మాగారాలు ఎక్కువ కాలం పనిచేయడానికి అధిక చెక్కెర దిగుబడులు కర్మాగారాల్లో పొందడానికి వివిధ కాల పరిమితులున్న రకాలను ఏ విధంగా సాగుచేసుకోవాలనే సాంకేతిక పరిజ్ఞానాన్ని అనకాపల్లి పరిశోధన నుండే మొదలైంది. 1895లో గోదావరి డెల్టాప్రాంతంలో ఎర్రకుళ్ళు తెగులు చెరకు రైతులకు అపార నష్టాన్ని కలిగించాయి. దీని కారణంగా 1902లో సామర్లకోటలో విత్తనోత్పత్తి చేసే పొలాల్లో పరిశోధన చేయడం ప్రారంభం కావడమే కాకుండా 1912లో కోయంబత్తూరులో చెరకు పరిశోధనా స్థానం ఏర్పాటు చేయడానికి పునాది వేసింది. అంతేకాక ఇక్కడ ఎర్రకుళ్ళు తెగుళ్లను తట్టుకునే సంకర రకాల తయారీకి శ్రీకారం చుట్టారు.

అనకాపల్లి పరిశోధనా స్థానం నుంచి విడుదలైన 17 రకాలు

కో-62175, కో-ఎ-71-1, కో.ఎ-7601, కో.ఎ-7602, కె.ఎ-7508, కో7706.కో.ఎ-8401, 85ఎ261(నీలోత్పల), 84ఎ125(మధు), 87ఎ298(విశ్వామిత్ర), 93ఎ145(శారద), 97ఎ85 (విశాఖ) 2001ఎ63(కనకమహాలక్ష్మీ),98ఎ163 (ఉత్తర), 2003ఎ255 (సింహాద్రి), 2000ఎ225 (రేవతి) వంటి రకాలను విడుదల చేశారు. అంతేకాక చెరకు గడలను వేరు చేయకుండా నేరుగా పొలంలోనే రసాన్ని తీసి పంట పక్వత నిర్ధారణకు ఉపకరించే పరికరాన్ని కూడా ఇక్కడే కనుగొన్నారు. అలాగే ఇంధనాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని రసాన్ని గాఢపరచి నాణ్యమైన బెల్లం తయారు చేయడానికి ఎంతో ఉపయుక్తంగా ఉండే బెల్లం పొయ్యిని రైతాంగానికి అందించిన ఘనత, దేశం మొత్తానికి బెల్లం పొయ్యిల తయారీకి నమూనా కూడా అనకాపల్లి పరిశోధనా స్థానానిదే. వివిధ చెరకు రకాల నుండి బెల్లం రికవరీ మోతాదును బెల్లం తయారు చేయకుండానే కనుగోనడానికి ఫార్ములాను రూపొందించారు. ప్రస్తుతం వాణిజ్యపరంగా బెల్లం తయారీలో లాభాలను తెచ్చిపెడుతున్న ముక్క, పొడి తేనె రూపంలో బెల్లం తయారీకి మూలం ఈ పరిశోధనా స్థానమే. చెరకు పంటను నిలబెట్టడానికి చెరకు పండించే దేశాలు అనుసరించే జడచుట్టు పద్ధతి రూపొందించిన ఘనత కూడా దీనికే దక్కుతుంది. బెల్లం పరిశోధనాల కారణంగా వాణిజ్య పరంగా బెల్లానికి ప్రసిద్ధిగాంచిన అనకాపల్లి కనకాపల్లిగా మారిందనడానికి అతిశయోక్తిలేదు. రానున్నకాలంలో బెల్లం వాణిజ్య ప్రాధాన్యత కారణంగా మరిన్ని అద్భుతమైన బెల్లం పరిశోధనా ఫలితాలు రైతుల ముంగిటకు చేరే కాలం దగ్గరలోనే ఉంది.

మేడారం సందడి

(మొదటిపేజీ తరువాయి)

సమ్మక్క-సారలమ్మను దర్శించుకొని భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 15కల్లా పూర్తి కావాల్సిన ఏర్పాట్లు ఇప్పటివరకు కాకపోవడం, జాతరకు మూడ్రోజులు మాత్రమే సమయం ఉండడంతో కడియం అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జంపన్నవాగు వద్దకు కాలినడకన వెళ్లిన ఆయన భక్తులతో మాట్లాడారు. అనంతరం జిల్లా నేతలిచ్చిన విందులో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీలు విశ్వేశ్వర రెడ్డి, బాల్క సుమన్, సీతారాం నాయక్, పసునూరి దయాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీబీ పాటిల్, ప్రభాకర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, పూట రవీందర్, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, కొండా మురళి, ఎమ్మెల్యే ఆరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, శంకర్ నాయక్, కొండా సురేఖ, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జడ్పీ చైర్మన్ గద్దల పద్మ, చైర్మన్లు గుండు సుధారాణి, రాజయ్య యాదవ్ ఉన్నారు. రాత్రిపూట ఏర్పాట్లు, భక్తుల కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కడియం అక్కడే బసచేశారు. కాగా, ప్రైవేటు, ఆర్టీసీ బస్సుల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. మేడారానికి దాదాపు 10కిమీల వరకు భక్తులు విడిదితో అటవీ ప్రాంతమంతా జనసందోహంగా మారిపోయింది. ఆర్టీసీ బస్సులను మేడారం వరకు, ప్రైవేటు వాహనాలను నార్లాపూర్ వరకు అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చిన వారంతా అక్కడి నుంచి ఆటోలు, బస్సులలో జంపన్నవాగు వద్దకు చేరుకొని వాగులో పుణ్యస్నానాలు ఆచరించి సారా చీర, పసుపు, కుంకుమలు, తలపై బంగారం (బెల్లం) పెట్టుకుని 'జై సమ్మక్క జై సారలమ్మ' అంటూ గద్దెల ప్రాంతానికి చేరుకొని మొక్కులు తీర్చుకొంటున్నారు. ఇంకా పనులు పూర్తికాకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల అనేక పనులు అసంపూర్తిగా ఉండడంతో అసహనానికి గురవుతున్నారు.

ప్యాకేజీ కోసం కృషి

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గంలోని మహిళలు ట్రాఫికర్స్ వలలో చిక్కుకుని గల్ఫ్ దేశాలలో ఎదుర్కొన్న సమస్యలను సైతం ఏకరవు పెట్టారు. ఇలా ఆయన మహిళలతో ఇష్టాగోష్టి నిర్వహించారు.

మంత్రి పరిటాల సునీతను కలిసిన పవన్ కళ్యాణ్ :

ఆయన రెండవ రోజు పర్యటనలో అనంతపురంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మాత్యులు పరిటాల సునీత ఇంటికి వెళ్లారు. అక్కడకు వెళ్లిన పవన్ కళ్యాణ్ ను ఆమె సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జిల్లాలోని కరవు సమస్యలపై ఇద్దరూ చర్చించుకున్నారు. పేరూరు,భైరవాని తిప్ప ప్రాజెక్టుల ఏర్పాటువల్ల చేకూరబోయే లాభాలను ఆమె పవన్ కళ్యాణ్‌కు వివరించారు.

పోలియోరహిత రాష్ట్రమే ధ్యేయం: చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రాన్ని పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ఏటా క్రమం తప్పకుండా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం జరిగిన సూర్యారాధన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రం ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా విలసిల్లాలంటే ఈ చిన్నారులే దిక్సూచిగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, వైద్యఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

11న ఏపీ రూరల్ వాటర్ సప్లై ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రూరల్ వాటర్ సప్లయ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘ ఎన్నికలను ఫిబ్రవరి 11వ తేదిన నిర్వహించేందుకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్నికల అధికారి, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నేత ఎ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ రూరల్ వాటర్ సప్లయ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘంలో 13 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకునేందుకు ఫిబ్రవరి 11వ తేదిన తిరుపతిలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికలకు సంబంధించి గొల్లపూడి వసుధా టవర్స్ సి బ్లాక్, మొదటి అంతస్థులోని అసోసియేషన్ హాలులో ఫిబ్రవరి 3, 4 తేదిలలో ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. అలాగే 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల పరిశీలించి జాబితాను ప్రకటిస్తామన్నారు. పోలింగ్ ఫిబ్రవరి 11వ తేదిన తిరుపతి పాత తిరుచానురురోడ్డులో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పూజిత ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటల తర్వాత ఓట్లను లెక్కించి గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తామని విద్యాసాగర్ తెలిపారు.

ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రంగా విజయవాడ

- ఆర్‌పీఓ పరిధిలో 8 జిల్లాలు
- గుంటూరు, చిత్తూరు, ఒంగోలు, అనంత, కృష్ణాలో పీఓపీఎస్‌కేలు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : విజయవాడ పాస్‌పోర్టు సేవా కేంద్రం (పీఎస్‌కే) త్వరలోనే పూర్తిస్థాయి ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంగా (ఆర్‌పీఓ) మారనుంది. ఈ ఏడాది మార్చి తర్వాత నుంచి ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలకు పాస్‌పోర్టు సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే విజయవాడ పీఎస్‌కేను పూర్తిస్థాయి ఆర్‌పీఓగా మార్చుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. విజయవాడ ఆర్‌పీఓ పరిధిలోని మూడు కియోస్కోలకు అదనంగా మరో ఐదింటిని ఏర్పాటు చేయనున్నారు. విదేశీ వ్యవహారాలశాఖ, పోస్టల్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకుని, హెడ్ పోస్టాఫీసులలో పాస్ సేవలను అందిస్తోంది. అందులో భాగంగానే విజయవాడ పాస్‌పోర్టు కేంద్రం పరిధిలో కడప, కర్నూలు, నెల్లూరులో పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీఓపీఎస్‌కే) పని చేస్తున్నారు. మారుమూల గ్రామాలకు సేతం సేవలందించే ఉద్దేశంతోనే దేశవ్యాప్తంగా 236 పోస్టాఫీసుల్లోనే పాస్‌పోర్టు సేవా కేంద్రాలను కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న మూడు కియోస్కోస్‌తోపాటు గుంటూరు, ఒంగోలు, చిత్తూరు, అనంతపురం, కృష్ణాజిల్లాల్లోనూ పోస్టల్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. విజయవాడ, తిరుపతిలో ప్రస్తుతం పాస్‌పోర్టు సేవా కేంద్రాలు పని చేస్తుండగా, రెండు నెలల్లో విజయవాడను పూర్తిస్థాయి ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రంగా మార్చే కసరత్తు దాదాపు పూర్తి కావచ్చింది.

మచిలీపట్నంలో పోస్టల్ పాస్‌పోర్టు సేవా కేంద్రం

కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పోస్టల్ పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పాస్‌పోర్టు విభాగం అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. తూర్పు కృష్ణాలోని మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ ప్రాంతాలకు మచిలీపట్నం అందుబాటులో ఉంటుంది. కొత్తగా ఏర్పాటు కానున్న విజయవాడ ఆర్‌పీఓ పరిధిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలను చేర్చనున్నారు. మరోవైపు విశాఖ కేంద్రంగా ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రం పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదా వరి, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నాయి. విజయవాడ కేంద్రంగా పూర్తిస్థాయి ఆర్‌పీఓ సేవలు ప్రారంభంకానున్న నేపథ్యంలో కృష్ణాజిల్లాలో పీఓపీఎస్‌కేను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తిరుపతిలో ఇప్పటికే పీఎస్‌కే ఉండగా, చిత్తూరు కేంద్రంగా పీఓపీఎస్‌కేను ఏర్పాటు చేయనున్నారు. అనంతపురం, గుంటూరు, ఒంగోలులోనూ పీఓపీఎస్‌కేలు ఏర్పాటైతే పాస్‌పోర్టు సేవ ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

పీఓపీఎస్‌కేలకు సిబ్బంది కొరత

ప్రజలకు పాస్‌పోర్టు సేవలందిస్తున్న పీఓపీఎస్‌కేలను సిబ్బంది కొరత వెంటాడుతోంది. పోస్టల్‌శాఖతో చేసుకున్న ఒప్పందం మేరకు హెడ్ పోస్టాఫీసులలో పాస్‌పోర్టు సేవలు అందుతున్నాయి. అయితే పోస్టాఫీసులలో పాస్‌పోర్టు సేవలపై అనుభవం ఉన్న సిబ్బంది అంతగా లేకపోవటంతో పాస్‌పోర్టు సేవల్లో జాప్యం జరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోస్తా, రాయలసీమల్లో విదేశాల్లో చదువుకునేందుకు, ఉద్యోగాలకోసం వెళ్లే వారి సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుండటంతో పాస్‌పోర్టు సేవలను మరింత వేగవంత చేయాల్సి ఉంది. పోలీసు దర్యాప్తు ఒక్కరోజులో పూర్తవుతుండగా పాస్‌పోర్టు మంజూరుకూడా వేగవంతం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.



జీఎస్టీ కోసం..వివిధ సంస్థలతో బోధ్‌ట్రీ భాగస్వామ్యం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: జీఎస్టీ సేవలను దేశవ్యాప్తంగా అందించేలా ఐటీ సేవల సంస్థ బోధ్‌ట్రీ కన్సల్టింగ్ లిమిటెడ్ సంస్థ పలు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. డేటా అనలిటిక్స్ సేవలను మరింత పారదర్శకం చేసేలా హైటెక్ హెల్త్‌కేర్ అండ్ లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యుటికల్స్, హెల్త్‌కేర్ ప్లేయర్స్, మ్యానుఫ్యాక్చరింగ్, ఎడ్యుకేషన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో సేవలందించేలా ఒప్పందాలు చేసుకున్నట్టు సంస్థ ఎండీ ఎల్ఎన్.రామకృష్ణ తెలిపారు. శోభన్ డిజిటల్, శిరూప్ కన్సల్టెన్సీ, ఫైన్ డే ఇంజనీరింగ్ ప్రై.లి., కాష్ ఐటీ, వీఆర్కే గ్లోబల్ బోధ్‌ట్రీ తదితర కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు.

ఏపీ అంబాసిడర్ 'సూర్యుడు'

- సూర్యకిరణాలతో డి-విటమిన్
- కర్నూలులో 1000 మెగా వాట్ల సోలార్ పార్కు
- 'సూర్యారాధన'లో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు సూర్యుడు అంబాసిడర్‌గా నిలుస్తారని సీఎం చంద్రబాబు అభివర్ణించారు.విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం సూర్యారాధనను నిర్వహించారు.దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చంద్రబాబు మాట్లాడుతూ, సూర్యారాధన సైన్సు అని, ఏ మతానికీ చెందబోదనీ స్పష్టంచేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వం తరపున ప్రకృతిని ఆరాధనకు శ్రీకారం చుట్టామన్నారు. సూర్యారాధనను మతాలు, కులాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఆచరించడం వల్ల ఆరోగ్యంగా వుంటారని సూచించారు.శరీర ధృఢత్వం పెరుగుతుందని, బైబిల్, ఖురాన్‌లలో సూర్యుడిపై వున్న ప్రస్తావన్ని సీఎం చదివి విన్పించారు. దేశంలో ఏపీ ఈస్ట్ కోస్ట్ మధ్యలో ఉండటంతో రాష్ట్రంలోనే మొదటిగా సూర్యుడు ఉదయిస్తాడని, తర్వాతే ఇతర రాష్ట్రాలకు సూర్యోదయం వస్తుందని ఆయన వివరించారు. దీంతో రాష్ట్రానికి సన్ రైజ్ ఏపీగా నామకరణం చేసి..సూర్యభగవానుడ్ని బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకున్నామని వివరించారు.

నీటి వనరులపై దృష్టి కేంద్రీకరించాం..: సీఎం

రాష్ట్రంలో నీరు ఎక్కువగా లభ్యమౌతుందని, దానిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నీరు-మీరు నిర్వహించి గోదావరి-కృష్ణా పుష్కరాల ఆసరాగా నదులను అనుసంధానం చేశామని, వనం-మనం ద్వారా చెట్లను పరిరక్షించుకునేలా ప్రజలలో అవగాహన కల్పించామన్నారు.అమ్మకు వందనం ద్వారా తల్లిని గౌరవించేందుకు అంకురార్పణ చేశామన్నారు. సూర్యరశ్మితో బ్రెస్ట్ క్యాన్సర్, బ్యాక్టీరియాలు నశిస్తాయని, కొలెస్ట్రాల్ తగ్గి, బీపీ కంట్రోల్‌లో వుంటుందని, డి-విటమిన్ లభిస్తుందన్నారు. సూర్యుడి నుంచి వచ్చే సోలార్ విద్యుత్ పర్యావరణానికి హాని కలిగించ దన్నారు. రాష్ట్ర విభజన తర్వాత..మూడున్నరేళ్లలో 5వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి కృషి చేశామని సీఎం చెప్పారు.సోలార్ విద్యుత్తు కోసం కర్నూలులోని ఓర్వకల్లులో సోలార్ పార్కును 1000 మెగా వాట్ల సామర్థ్యంతో ప్రపంచంలోనే మొదటిగా ఏర్పాటు చేస్తున్నామని, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రకృతితో మనం మమేకమవ్వాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, రామకృష్ణ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వరరావు, బోడే ప్రసాద్, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, అర్బన్ తహసీల్దార్ శివరావు పాల్గొన్నారు.సూర్యుడు ఉదయించే సమయంలో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల యోగా విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో సూర్యారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారంనాడు సైతం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లారు.సెలవు దినాల్లో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించడంపై ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విధులు ఇక్కడ...ఆదాయం అక్కడ...

- తెలంగాణ రెవెన్యూలో ఆంధ్రుల వాటా...
- నేటికీ హైదరాబాద్ వీడని ఉద్యోగులు..
- నీతి ఆయోగ్ వ్యాఖ్యలతో సంచలనం...
- పొరుగు రాష్ట్రం వీడి..నవ్యాంధ్రలో కొలువు దిరేనా...



విశాలాంధ్ర అమరావతి : రాష్ట్ర పాలన అంతా నవ్యాంధ్రలో సాగుతున్నా ఆదాయం అధిక శాతం తెలంగాణ రాష్ట్రానికే పరిమితమవుతున్నది. రాష్ట్ర విభజన తరువాత వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం ఏర్పాటు చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు తమదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉండగా పాలన అంతా హైదరాబాద్ నుంచి కొనసాగేది అయితే రాష్ట్రం నలుమూలల నుండి ఏ చిన్న పని కావాలన్న హైదరాబాద్ సచివాలయానికి వెళ్లాల్సి వచ్చేది.కాగా రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రలో పాలన సాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనలేని కృషి చేశారు. అందులో భాగంగానే తుళ్లూరు ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేయటం వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం నిర్మించడం చకచకా జరిగిపోయాయి. అదే సమయంలో రాజధానికి అమరావతి అనే నామకరణం చేసి సంస్కృతికి పెద్ద పీట వేశారు చంద్రబాబు. విడతల వారీగా పాలన ఆసాంతం నూతన రాజధానికి తరలించడం తన నివాసం సైతం నవ్యాంధ్రలో ఏర్పాటు చేసుకొని రాష్ట్ర ప్రజలకి భరోసాను కల్పించారు.ఎక్కడో పొరుగు రాష్ట్రంలో పాలన ఎందుకని హైదరాబాద్ లో ఉండేందుకు పది ఏళ్లు గడువున్నా వెలగపూడికి పాలన పట్టుకొచ్చేశారు. అన్ని శాఖలు ఒకేసారి రావటం కుదరకపోవటంతో విడతల వారీగా అటు విజయవాడ ,ఇటు గుంటూరు జిల్లాల్లో కొలువుదీరాయి. మెజారిటీ ఉద్యోగులు హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం ఒక్కసారిగా నవ్యాంధ్రకి తరలి రావటం తలనొప్పిగా మారడంతో ఉద్యోగులు మొదటిలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పిల్లల చదువులు మధ్యలో ఉండటం కూడా సమస్యగా మారింది. దీనితో చాలా మంది పరిపాలన విభాగపు ఉద్యోగులు హైదరాబాద్ వదిలి రాలేని పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో తమ ఇబ్బందులు ఉద్యోగ సంఘాల నేతలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.సానుకూలంగా స్పందించిన సీఎం వారికి కొంత సమయం ఇచ్చి హైదరాబాద్ వదిలి నవ్యాంధ్రకి తరలి రావాలని సూచించారు.కొంత సమయం పట్టినప్పటికి పాలన కొత్త రాష్ట్రానికి సరికొత్త వన్నె తెచ్చింది.ఉద్యోగులు అమరావతి రాజధానికి సమీపంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు.కాగా కుటుంబాలు హైదరాబాద్‌కే అంటే తెలంగాణ రాష్ట్రానికే పరిమితమయ్యాయి.

ఇక్కట్లు అలానే....

అమరావతిలో పాలన ప్రారంభించి సచివాలయం నుండి తనదైన శైలిలో ముందుకు వెళ్లటం ప్రజలలో కొంత ఆత్మస్థైర్యాన్ని పెంపొందిచింది. ఇదే సమయంలో రాష్ట్ర ఆదాయం పెంచాలన్న ఆకాంక్షతో ముఖ్యమంత్రి అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ ముందుకు సాగుతున్నారు.ఉద్యోగులు వారానికి ఐదు రోజుల పని దినాలు కావాలని కోరగా అంగీకారం తెలిపారు. ఇదే అలుసుగా తీసుకున్న సదరు ఉద్యోగులు వారానికి ఐదు రోజులు వెలగపూడి సచివాలయంతో పాటుగా , రాష్ట్ర కార్యాలయాలలో తమ విధులు నిర్వహించుకొని శుక్రవారం సాయంత్రానికి హైదరాబాద్ తిరుగు పయనమవుతున్నారు. శని ఆదివారాలు కుటుంబ సభ్యుల నడుమ గడిపి తిరిగి సోమవారం విధులకు హాజరవుతున్నారు. కుటుంబ సభ్యులు మొత్తం అక్కడే ఉండటం,పిల్లల విద్యా అక్కడే కొనసాగటం యథావిధిగా కొనసాగుతోంది.దీనితో పాలన నవ్యాంధ్రకి మారినప్పటికి ఆదాయం మాత్రం తెలంగాణలోనే ఉండిపోతోంది. రాష్ట్రంలో విధులు నిర్వహించే ఉద్యోగులు అధిక శాతం నేటికి తెలంగాణ రాష్ట్ర రాజధానికె పరిమితం కావడం,అక్కడి నివాసాలు వదిలి రాకపోవటం.విధులు అమరావతిలో నిర్వహించిన కుటుంబ వ్యవస్థ ,ఖర్చులు అన్ని పక్క రాష్ట్రంలోనే చేస్తున్నారు.దీనితో నవ్యాంధ్రలో పొందుతున్న వేతనాలు హైదరాబాద్ లో ఖర్చు చేసినట్లు అవుతుంది.

నీతి ఆయోగ్ గణాంకాలతో...

ఇటీవల నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవకుమార్ నవ్యాంధ్ర ఆదాయ గణాంకాల అంశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి వనగూరే ఆదాయంలో అధిక భాగం ఆంధ్ర ప్రజల నుంచి వస్తున్నదని చెప్పటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. 40 శాతం పైబడి ఇప్పటికి ఆంధ్ర వారి నుండి కేసీఆర్ సర్కారికి లబ్ది కలుగుతున్నదని సమాచారం అప్పుల్లో ఉన్న నవ్యాంధ్రకి బాధాకరమైన విషయం. ఏపీలో విధులు నిర్వహించే ఉద్యోగులు నేటికి స్థిర నివాసం ఇక్కడ ఏర్పాటు చేసుకోక పోవటం, స్థానికత ఏపీలో పొంది హైదరాబాద్ లోనే నివాసం ఉండటం మన ఖజానాకు గండిపడేలా చేస్తున్నది.ఉద్యోగులుగా ఉన్న వారి బంధువులు, కుటుంబ సభ్యులు చిన్న చితకా వ్యాపారాలు చేస్తుకాలం గడుపుతూ వచ్చినప్పటికీ ఆ వ్యాపారాలు సైతం నేటికి పొరుగు రాష్ట్రానికే పరిమితం కావడం నీతి ఆయోగ్ గణాంకాలకు మరింత బలాన్ని చేకూరుస్తుంది.

రైతుల పాటి ఉదారత లేని ఉద్యోగులు...

రాజధాని నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇవ్వగానే రైతులు 34 వేల ఎకరాలు భూములు రాజధానికి భూసమీకరణ కింద ఇచ్చి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఉద్యోగులు మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ఉద్యోగులతో సమానంగా ఆంధ్ర ఉద్యోగులకి లబ్ది చేకూరుస్తున్నా ఏ మాత్రం ఆలోచించలేని పరిస్థితిలో ఉండటం గమనర్హమైన అంశం. ఆంధ్రప్రదేశ్ పరిపాలన విభాగంలో 12వేల మంది ఉద్యోగుల ఉండగా వెలగపూడి సచివాలయంలో శాశ్వత ఉద్యోగులు 1,800 మంది ఉండగా ఔట్ సోర్సింగ్ , కాంట్రాక్టు ఉద్యోగులు మూడు వేల మంది వరకు ఉన్నారు. వీరిలో అధిక శాతం ఉద్యోగులు హైదరాబాద్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజాసాధికార సర్వే లో సైతం 4,34,80,410 మంది రాష్ట్రంలో ఉన్నట్లు నమోదు కాగా 54 లక్షల మందికి సంబంధించిన వివరాలలో నేటికి స్పష్టత రాకపోవటం కొసమెరుపు. వీరిలో కొందరు మృతి చెందినట్లు, వలసలు వెళ్లినట్లు, మరికొంతమంది చిరునామాలు తేలలేదని సర్వే నిర్వహించిన అధికార్లు చెప్తున్నారు.సంక్షేమ ఫలాలు నవ్యాంధ్రలో, ఖర్చులు అన్ని తెలంగాణలో చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధనకు తూట్లు పొడుస్తున్నారని బహిరంగ విమర్శలు వినపడుతున్నాయి. విద్యా వైద్య రంగాలతో పాటుగా ,మౌలిక సదుపాయాలను కల్పిస్తున్న తెలంగాణ రాష్ట్రం పైనే మక్కువ చూపటంపై సర్వత్రా విమర్శలు వినపడుతున్నాయి.సాక్షాత్తు నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడే ఆంధ్ర ఆదాయం తెలంగాణలో అని చెప్పటం మన రాష్ట్రం పట్ల మనవారికి ఉన్న ప్రేమను తెలియచేస్తున్నది. రైతులకు ఉన్నపాటి ప్రేమ , వయస్సుని సైతం లెక్కచేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు పడుతున్న కష్టం చూసైనా ఉద్యోగుల అందరూ నవ్యాంధ్రలో పూర్తిస్థాయి నివాసాలు ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచన చేస్తే రాష్ట్ర ఖజానాకు కొంత ఆదాయాన్ని అయినా చేకూర్చిన వారవుతారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి ఉద్యోగుల నిర్ణయం ఏ విధంగా ఉంటుందో వేచిచూడాలి.

30న జాతీయ సత్యాగ్రహాన్ని విజయవంతం చేయండి

ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరశిస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 30న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే జాతీయ సత్యాగ్రహాన్ని జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వదేశీ పేరుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం గత యూపీఏ ప్రభుత్వ ప్రైవేటీకరణ, కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలనే అవలంభిస్తోందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కూడా బడా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పనిచేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలపై పలుమార్లు ఉద్యమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వాలకు చలనం లేదన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, సామాజిక భద్రతకై సమగ్ర చట్టం చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్లను హక్కుగా కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేసేవారిని కార్మికులుగా గుర్తించాలని డిమాండు చేశారు. అదేవిధంగా కనీసవేతనాల సలహామండలిని తక్షణం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల విలీనాలను నిలిపివేయాలన్నారు. పై డిమాండ్లతోపాటు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ఆలోచనను ఉపసంహరించుకోవాలనే డిమాండ్లతో ఈ నెల 30న జరిగే జాతీయ సత్యాగ్రహం కార్యక్రమంలో వేలాది మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని రవీంద్రనాథ్ విజ్ఞప్తి చేశారు.



దిగజారుడు రాజకీయం!

- దళిత తేజం పేరుతో చంద్రబాబు దగా
- అందరినీ కలుపుకొని మోడీని నిలదీద్దాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విశాఖపట్నం : రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశం పార్టీలు రాజకీయాలను దిగజార్చుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. విశాఖ సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, టీడీపీలూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వాములుగా ఉంటూ వైసీపీ కార్యాలయంలో వారి ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీ శాసనసభా పక్షనేత విష్ణుకుమార్ రాజు విలేకరుల సమావేశం నిర్వహించడం రాజకీయ దిగజారుడుతనం కాదా అని ప్రశ్నించారు. అసలు ప్రభుత్వంలో ఉన్నారా.. లేరా.. మీరు ప్రభుత్వానికి వ్యతిరేకమా అంటూ బీజేపీ ఫ్లోర్‌లీడర్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని రామకృష్ణ అన్నారు. ఇన్ని చేసినా మళ్లీ బీజేపీతో చంద్రబాబు జతకడుతున్నారన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ముఖ్యమంత్రి సుప్రీంకోర్టుకు కాదుకదా కనీసం జిల్లా కోర్టుకు కూడా పోలేరని, మోడీని ఎదురించే దమ్ములేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలనుకుంటే తక్షణం కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి వైదొలగి, మంత్రి పదవులకు రాజీనామా చేయించాలని ఆయన డిమాండు చేశారు. మోడీని కలవడానికి చంద్రబాబుకు ఏడాది అయితే కాని ఇంటర్వ్యూ దొరక్కపోయినా కొనసాగుతున్నారని ఇది పజలకు అవమానమన్నారు. మోడీని నిలదీసేందుకు ఇకనైనా అందరిని కలుపుకొని వెళ్ళాలని, రామకృష్ణ అన్నారు. దళిత తేజం పేరుతో మరోసారి దళితులను మోసం చేసేందుకు టీడీపీ సర్కార్ కుట్రపన్నుతుందన్నారు. 44 నెలల పాలనలో ఒక్క దళిత కుటుంబానికి అయినా ఎకరా భూమి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. నిలిచిపోయిన ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, దళితులపై జరిగే దాడులను అరికట్టాలని ఆయన ఈ సందర్భంగా డిమాండు చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు జేవీ ప్రభాకర్, ఎ. విమల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిపై దాడికి పాల్పడిన..
వార్డెన్‌ను అరెస్టు చేయాలి

- హర్షిత్ డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగన్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యార్థిపై దాడికి పాల్పడిన విజయవాడ హర్షిత్ డిగ్రీ కళాశాల వార్డెన్‌ను అరెస్టు చేయాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న డిమాండు చేశారు. విజయవాడ నగర సమీపంలోని హర్షిత్ డిగ్రీ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యాన ఆదివారం ఆందోళన నిర్వహించారు. దీంతో కళాశాల ప్రాంగణంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఫీజుల పేరిట విద్యార్థి శివనాగరాజుపై దాడికి పాల్పడటం సిగ్గుచేటని, గుర్తింపులేకుండా కళాశాలలు నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు నినదించారు. పోలీసు అధికారులు, కళాశాల యాజమాన్యంతో రంగన్న, ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి చరణ్‌సాయి చర్చించారు. విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం రంగన్న మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. విద్యార్థుల్ని వేధింపులకు గురిచేస్తూ దాడులకు పాల్పడటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి గుర్తింపులేకుండా హర్షిత్ కళాశాలలను నడుపుతున్నారని వివరించారు. ఉత్తీర్ణత గ్యారంటీ పేరుతో రూ.50వేల నుంచి రూ.80వేల వరకూ బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్న శివనాగరాజుపై అకారణంగా దాడికి దిగారని వాపోయారు. ఈ దెబ్బలు తట్టుకోలేక భవనం నుంచి దూకడంతో కాలుకు తీవ్ర గాయమైందని చెప్పారు. ఈ సమాచారం బయటకు పొక్కకుండా కుటుంబ సభ్యులకు రూ.4వేలు ఇచ్చి ముఖం చాటేశారని తెలిపారు. ఇందుకు నిరసనగా కళాశాల ఎదుట ధర్నా చేశామన్నారు. గుర్తింపులేకుండా ఒకే కళాశాల పేరుతో అనేక బ్రాంచీలు నడుపుతున్న హర్షిత్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు.అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయి మౌనంగా వుంటున్నారని విమర్శించారు. ఈ ఆందోళనలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మల్లేష్, ప్రసన్న, గౌతమ్, నరేష్, గంగాధర్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహితి

రవీంద్రుని కథల్లో మానవతావాదం

డా.తక్కోలు మాచిరెడ్డి, ✆ : 80996 17667

'గీతాంజలి'కర్తగా, ఆసియాలోనే ప్రప్రథమ నోబెల్ బహుమతి గ్రహీతగా, మనలో చాలా మందికి రవీంద్రనాథ్ ఠాకుర్ తెలుసు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. కవియే కాదు, కథకుడు కూడాను. నాటకకర్త, నటుడు. రబీంద్ర సంగీత స్రష్ట, గాయకుడు, చిత్రకారుడు, నవలా కారుడు, వ్యాసకర్త, విద్యావేత్త. ఇపుడు మనం ఆయన రాసిన కొన్ని కథలను ప్రస్తావించుకుందాం.

బాంగ్లా సాహిత్యంలో ప్రప్రథమ కథా రచయిత ఆయనే. ఆయన కథలు ఇప్పటికీ ప్రాసంగికమే. అతిశయోక్తులకు, అతి భావుకత కు అవిదూరంగా ఉంటాయి. వాటిలో మానవతా వాదం వెల్లివిరుస్తుంటుంది. అసత్యం, అన్యా యాల ఖండన ఆయనకథల్లో మనం చూస్తాము. మనుష్యుల్ని ఆయన దేవతలుగా మలచలేదు. మనిషిని మనిషిగా చూస్తాము ఆయన కథల్లో. నిర్లక్ష్యం చేయ బడిన వారికి ఆయన చేదోడుగా ఉంటాడు. పాత్రలు సజీవంగా ఉంటాయి. పూర్తి ప్రతి నాయకులు గానీ, గొప్పగొప్ప పనులు చేసే నాయకులుగానీ ఆ కథల్లో కన్పించరు. నమూనాపాత్రలు తక్కువ. మూసబోసిన పాత్రలు అసలులేరు. పాత్రచిత్రణ వైచిత్ర్యంతో కూడుకొని ఉంటుంది. వైవిధ్యభరితమైన పాత్రలు దర్శన మిస్తాయి.

రవీంద్రుని కథల్లో అత్యంత ప్రసిద్ధమైన కథ 'కాబూలీవాలా'. ఇది అతని ఉత్తమ కథానికల్లో ఒకటి. అయిదు సంవత్సరాల మినీ అనే బాంగ్లాబాలిక కాబూలీ నుంచి వచ్చి పళ్లమ్ముకొని బతుకుతున్న రహమత్‌ను స్నేహితునిగా చేసు కుంటుంది. ఈ కాబూలీ వాలా రోజూ మినీ ఇంటి దగ్గర నుంచే వెళ్ళే వాడు. మినీ అతన్ని పిలిచి, పిలుచుకొని, అతనితో కబుర్లు మాట్లా డుతూ కాలం గడిపేది. ఇలా వాళ్ళిద్దరి మధ్యా సంబంధాలు ఎక్కువైనాయి. కాబూలీవాలా మినీని బాంగ్లా భాషలో నీవు అత్తారింటికి వెళ్ళవా అని అడిగేవాడు.

ఒక వ్యక్తి రామ్‌పురీ శాలువ కొనుక్కున్న దానికు కొంత బాకీ ఉన్నాడు రహమత్‌కు. అబద్ధంచెప్పివాడు బాకీ ఎగ్గొట్టాలని చూస్తాడు. మాటామాటా పెరిగి రహమత్ అతనిని కత్తితో పొడుస్తాడు. కొన్ని సంవత్సరాల జైలుశిక్ష పడు తుంది కాబూలీవాలాకు. మినీ అడుగుతుంది - నువ్వు అత్తారింటికి వెళుతున్నావా అని. కాబూలీ వాలా అంటాడు- ఆ.. అక్కడికే వెళుతున్నాను.

కాబూలీవాలా జైలునుంచి విడుదలై వచ్చే నాటికి మినీకి వివాహం జరుగుతుంటుంది. మొదట మినీతండ్రి అతనినిఇంట్లోకి రాని య్యడు. విషయమేమిటంటే, కాబూలీ వాలాకు దాదాపు మినీ ఈడుగల కూతురుంటుంది ఆఫ్ఘని స్తాన్‌లో. ఆ బాలిక చేతిముద్రలు గల, నలిగి పోయిన, కాగితపు మడతను ఎంతో ఇష్టంతో దాచుకుంటూ వచ్చిన ఆ మసి బారిన కాగితపు ముక్కను, మినీ తండ్రికి చూపిస్తాడు. అది చూసి తన హోదా, అంతస్థు అన్నీ మరచి పోతాడు ఆ తండ్రి. కాబూలీవాలా ఒక తండ్రే. తానూ ఒక తండ్రే. ఆ ఉద్వేగం వారిద్దరినీ దగ్గర చేస్తుంది. మినీ నాన్న ఓ కరెన్సీనోటు తీసి రహమత్‌కు ఇచ్చి, "రహమత్! దీంతో నీవు నీదేశం వెళ్ళి, నీ కూతుర్ని చూడు. మీ తండ్రికూతుళ్ల కలయిక లోని ఆనందానుభూతి మా అమ్మాయికి శుభాన్ని చేకూరుస్తుంది." అని అంటాడు./ఇందులో భావావేశాన్ని ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి బదిలీ చేశారు రచయిత./ దాన్నే "ట్రాన్స్‌ఫరెన్స్" అంటారు. అనుబంధాలు, మనస్తత్వాలు అన్ని దేశాల్లోనూ ఒక్కటే అని నిరూపిస్తుంది ఈ కథానిక. అంతర్జాతీయ సద్భావాన్ని సాహిత్యం ద్వారా వ్యక్తంచేసినట్లయింది విశ్వకవి- కథకుడు ఠాకుర్ మానసికతే అది.

మరో మంచికథానిక పోస్టుమాస్టర్/ కోల్ కతా నుంచి పల్లెటూరుకి బదిలీపై వచ్చిన పోస్ట్ మాస్టర్ రోగియై మంచాన పడినపుడు అతనికి శుశ్రూష చేస్తుంది రతన్ అనే ఓ అమ్మాయి. పోస్టుమాస్టర్ దగ్గర చనువుగా ఉండే రతన్, అతను ఉద్యోగానికి రాజీనామా చేసి వెడు తున్నానని చెప్పినపుడు అమ్మాయి రతన్ ఒకే మాట అంటుంది. "బాబుగారూ! నన్ను మీ ఇంటికి తీసుకెళ్ళరూ? అని. అది ఎలా సాధ్యం? అని పోస్టుమాస్టరు జవాబు. తరతమ భేదాలతో, హెచ్చుతగ్గుల దొంతరసమాజంలో రతన్‌కు ఇంత కంటే మంచిజవాబు ఎలా దొరుకుతుంది?

కాని, ఠాకుర్ అలా ముగించడు/ పోస్టు మాస్టర్ తన మనసులో ఇలా అనుకుంటూ పడవలో పయనిస్తున్నాడు/ "తిరిగి వెడతా- జగతి ఒడి నుంచి జారిపోయిన ఆ అనాధను వెంటబెట్టుకు తిరిగి వస్తా" అని మరీమరీ అన్పించింది అతనికి/ కాని, "జీవితంలో ఇలాంటి ఎన్ని విచ్ఛేదాలు, ఎన్ని మృత్యువులు న్నాయో, తిరిగి వెళ్లటం, వల్ల లాభమేమిటి? పృథివిలో ఎవరికి ఎవరు?" అన్న వైరాగ్యం అతనిలో ఉద యిస్తుంది. ఎంతోవాస్తవికంగా ఉంది ఈ కథానిక/ పాత్రలు నమూనా పాత్రలు కాదు/ సజీవ వ్యక్తులు.

ఠాకుర్ మలిదశలో రాసిన కథ 'స్త్రీర్ పత్ర'- 'భార్య రాసిన లేఖ' చాలా సంవేదనాభరితమైన కథ. ఉత్తమ పురుష శైలిలో లేఖ రూపంలో రాసిన కథ ఇది. చాలా వాక్యాలు కావ్యాత్మకంగా ఉన్నాయి. బాంగ్లా గృహిణి మృణాల కథ ఇది. ఆమె తాను కవితలు రాస్తానని చెప్పుకుంది. భర్తకు రాసిన లేఖలో తెలిపినట్లు, భర్తకు ఏది చెబితే ఏమవుతుందోనని, భయపడుతూ, భయ పడుతూ బతికేది. అందుకనే తాను కవిత్వం రాస్తానని ఎపుడూ భర్తకు చెప్పలేదు. ఆమె ఇంకా సగర్వంగా అంటుంది. నాకు జ్ఞానం ఉంది. అన్నీ అర్థం చేసుకోగలను. జ్ఞానంతో మీకు పనిలేదు. ఆడవాళ్ళకు జ్ఞానం అనవసరమైనది అని వ్యంగ్యంగా రాస్తుంది. స్త్రీ జీవితానికి వివాహం, భార్యాత్వం మాత్రమే పరమావధి కాదు. ఆమెకూ పురుషునికిలాగ విశాల ప్రపంచం ఉంది. విశాల ప్రపంచంలో జీవించ డమే జీవితం. మీనుంచి బయటపడి ఇప్పుడు బతికాను నేను అని రాస్తుంది.

మృణాల పెద్ద తోడికోడలు చెల్లెలు బిందుకు, ఇంట్లో ఆశ్రయమిచ్చినందుకు, భర్త, మామ అభ్యంతరం చెబుతూ, 'ఇదెక్కడి బెడద' అనుకుంటారు. బెడద తొలగించుకోవటానికై బిందును ఓ పిచ్చివానికిచ్చి పెళ్ళి చేస్తారు. బిందు పెళ్ళి చేసుకోనంటుంది. మృణాలమ్మను వదలిపో నంటుంది. కానీ పోక తప్పలేదు. పిచ్చివానితో వేగలేక, నిర్వేదంతో ఒక అనాథగా, ఆఖరికి ఆత్మహత్య చేసుకుంటుంది పాపం బిందు.

ఈ విషాదాంత కథ చదివి మనం కన్నీటి పర్యంతమవుతాము. లేఖరూపంలో కథ రాయడం ఆనాటికి అంటే 1913 నాటికి ప్రయో గమే. చాలా రక్తి కట్టించేదిగా సన్నివేశాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించే 'కవయిత్రి' కరుణ గాను ఇది బిందులాంటి అనాథలూ, మృణాల లాంటి గృహిణులూ మన సమాజంలో ఎంతో మంది ఉన్నారు. స్త్రీ మనస్తత్వాన్ని ఆవిష్కరించిన అద్భుత కథ ఇది.

భూతప్రేతాలు లేవనే దృక్పథంతో 1892లో రవీంద్రుడు రాసిన కథ 'జీవిత మరణాలు'. దీని కథాంశం ఇది.

కాదంబినికి ఎవరూలేరు. భర్తలేడు. అత్త మామలు లేరు. అమ్మానాన్నలు లేరు. కొడుకులూ, కూతుర్లూ లేరు. బావగారి కొడుకు చిన్నవాడు ఒకడున్నాడు. వాణ్ణి ఆమె అల్లారు ముద్దుగా చూసుకునేది. ఒకరోజు ఆమె హఠాత్తుగా మరణించిందని పాడెకట్టి, శ్మశానం లోని కుటీరంలో ఉంచుతారు. పాడెమోసిన నలుగురిలో ఇద్దరు కట్టెలకని పోతారు. మిగతా ఇద్దరు 'శవం' కదలడం చూసి, భయపడిపోయి పరుగెత్తిపోతారు. కాదంబిని పూర్తిగా మరణించ లేదు. ఆమె మెల్లగా లేచి, నడచి తన చిన్ననాటి స్నేహితురాలు యోగమాయ ఇంటికి చేరుతుంది. యోగమాయ భర్త సందేహిస్తాడు. కాదంబిని వూరికిపోయి ఆమె చనిపోయిందని నిర్ధారణ చేసుకొని తిరిగి వస్తాడు. యోగమాయ అయో మయంలో పడిపోతుంది. కాదంబిని బతికే ఉందని నమ్మలేక ఆమెను ప్రేతమని భావించి యోగమాయ, మరో ఆమె నిర్ఘాంతపోయి, మూర్ఛపోతారు. కాదంబిని ఎలాగో తన ఇంటిని చేరుకుంటుంది. తను బతికే ఉన్నానని ఎవరినీ నమ్మించలేక, కాదంబిని వర్షంలో ఇంటి వెనుక ఉన్న దొరువులో పడి చనిపోతుంది. నిజంగానే తాను చనిపోయి, చనిపోకముందు తాను ప్రేతం కాదు, మనిషినే అని నిరూపిస్తుంది కాదంబిని.

భూతప్రేతాలు లేవనీ, దయ్యాలు భ్రమ అనీ వాస్తవాలు తెలుసుకోవాలనీ, రవీంద్రుడు ఈ కథ ద్వారా చెప్పినట్లయింది. ఇప్పటికీ మూఢ నమ్మకాలు మన ప్రాంతంలో అబలల్నీ, పిల్లల్నీ బలి తీసుకుంటున్నాయి. అది చాతబడి కావచ్చు, లేదా గుప్తధనం కోసం పిల్లల్నీ, మహిళల్నీ బలి ఇవ్వడం కావచ్చు. ఈ మానసికతను పోగొట్టే ప్రయత్నమే ఈ 'జీవితమరణాలు' కథ.

ఇక 1898లో రవీంద్రుడు రాసిన 'దురాశ' అనే కథ గురించి కొంత తెలుసుకుందాం. సిపాయిల తిరగుబాటును కార్ల్‌మార్క్స్ ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామమన్నాడు. దానిపై ఓ గ్రంథమే రాశాడు. ఆ సంగ్రామంలోని ఒక ఘట్టాన్ని ఆధారం చేసుకొని అల్లిన కథే 'దురాశ'.

కాషాయరంగు చీర కట్టుకొని, సన్యాసిని వేషంలో డార్జిలింగ్‌లో ఒకామె రోదిస్తూ కూర్చొని ఉంది. ఆమె స్మృతుల కథనమే ఈ కథ. ఆమె బద్రావున్ నవాబ్ గులాం ఖాదిర్‌ఖాన్ కూతురు. ఆమె పితృవంశంలో ఢిల్లీ సమ్రాట్టుల వంశ రక్తం ప్రవహిస్తోంది.

కేశర్‌లాల్ ఖడ్గహస్తుడై ఆమె తండ్రి దగ్గరకు వచ్చి, మీరు మాతో రావాలి/ రాకుంటే యుద్ధం జరిగేంతవరకు మిమ్మల్ని ఖైదుచేసి ఉంచుతాను. ఆమె తండ్రి, తానూ వస్తానని పైపైకి అంటాడు. ఆమె తండ్రికి తెలియకుండా, ఒంటిమీదున్న నగలన్నీ తీసి, రహస్యంగా దాసికిచ్చి, అవి కేశర్‌లాల్‌కు అందేట్లు చేస్తుంది. ఆమె తండ్రి తెల్లోళ్లకు తిరుగుబాటుదార్లను గూర్చిన సమాచారమిస్తాడు. ఇది సహించని ఆమె ఇల్లు విడిచి మారువేషంలో బయటికి వచ్చి వెళు తుంది. కేశర్‌లాల్ ఒక పడవలో ఎక్కడికో వెళతాడు. తాంతియాతోపే దళంలో చేరి, పలుచోట్ల తెల్లోళ్ళతో పోరాటం చేస్తాడు. అజ్ఞాతంలోకి వెడతాడు. ఎంత వెదికినా దొరకడు. కాని, ఓ వార్త వస్తుంది. తెల్లోళ్ళ రాజదండన తప్పించుకొని, కేశర్‌లాల్ నేపాల్ వెళ్ళాడనీ, అక్కడి నుంచీ మరెక్కడికో వెళ్ళాడనీ.

ఒకసారి, అనుకోకుండా కేశర్‌లాల్‌నూ, అతని కుటుంబాన్నీ చూస్తుంది ఈ నవాబు పుత్రిక. కలుస్తుంది. అతనిని పలకరిస్తుంది. తర్వాత తాను డార్జిలింగ్‌లో ఉండిపోతుంది సన్యాసినిగా.

ఒక నవాబుపుత్రిక బ్రాహ్మణుని ప్రేమిం చడం, ఆ బ్రాహ్మణుడు స్వాతంత్ర్య సమర యోధుడుకావడం, చివరికిఆమే ఒక సన్యాసినిగా మారడం, కల్పనేనేమో కథంతా రాసి, కథ చెప్పే పాత్రలో ఏమో ఇదంతా కల్పితమేనేమో అన్పిస్తాడు రచయిత. ఇదో కథా కథనశైలి అనుకుంటాను. రవీంద్రుని మరో కథ 'అపరిచిత'. 1918లో రాసిన కథ. ఉత్తమ పురుషలో ఉంది.



నేను(కథానాయకుడు)ఎమ్.ఏ పాసయ్యాను. అస్తి ఉంది. అంతస్తు ఉంది. ఒకరోజు ఓ స్నేహితుడు వచ్చి, పిల్ల కావాలంటే, ఓ మంచి అమ్మాయిఉందిచూడమంటావా? అని అంటాడు. మామయ్యతో మాట్లాడు అన్నాను నేను. మధ్యతరగతి అమ్మాయి ఒక్కతే కూతురు అట.

ఆడపెళ్ళివారు కోల్‌కతా వస్తారు. వివాహా నికి ముందే కట్నంగురించి ఒప్పందం కుది రింది. పెళ్ళికూతురు నగలన్నీ తూకం వేయించి, ఖరీదుకట్టించి చూస్తామంటారు మామగారు. నువ్వేమంటావ్? అని పెళ్ళి కూతురు నాన్న శంభునాథ్‌బాబు పెళ్ళి కొడుకును, అంటే నన్ను అడుగుతాడు. నేను జవాబు చెప్పకముందే, వాడేమంటాడు? నేనెంత చెబితే అంత అంటాడు పెళ్ళికొడుకు నాన్న అంటే, మా నాన్న.

నగలను మరలా తూకం వేయించటంతో నొచ్చుకొని శంభునాథ్‌బాబు ఖరాఖండీగా అనే స్తాడు. నా బిడ్డ నగలను నేను దొంగిలిస్తాను అని అనుకునేవారి చేతుల్లో నా బిడ్డను పెట్టలేను అని.

తర్వాత ఆ అమ్మాయికి మంచి సంబంధం వచ్చిందనీ, "వివాహం చేసుకోను నేను" అని ఆమె శపథం చేసిందనీ విన్నాను. మరికొన్ని రోజుల తర్వాత అమ్మా నేనూ తీర్థయాత్రకని రైలులో వెళ్తున్నాము/ రైలు మారిన తర్వాత, ఓ అమ్మాయి (ఆ పెళ్ళికూతురు, కల్యాణి) మా పెట్టెలో ఎక్కుతుంది. అమ్మ అడిగింది. నీ పేరేమి టమ్మా-అని. కల్యాణి అంది ఆ అమ్మాయి. మీ నాన్నగారు? శంభునాథ్‌సేన్- కాన్పూర్ వచ్చింది. ఆమె అక్కడ దిగింది. తర్వాత నేను కొన్నాళ్ళకు కాన్పూర్ వెళ్ళాను.

కల్యాణినీ, ఆమె తండ్రినీ కలిశాను. "నేను వివాహం చేసుకోను అంది కల్యాణి. ఎందుకు? అని అడిగితే, 'మాతృఆజ్ఞ' అంది. అంటే, మాతృ భూమి పిలిచింది అని అర్థం. కల్యాణి ఎంత పట్టుదల మనిషో మనకు తెలుస్తుంది.

మన పెళ్ళిళ్ళు ఎంతగా వ్యాపారంగా మారాయో ఠాకుర్ ఈ కథ ద్వారా చూపించాడు. రవీంద్రుని కథలన్నీ హుందాగా ఉంటాయి. ✪



ఆచార్య జి.ఎన్.రెడ్డి పీఠికలు-సాహిత్య దీపికలు

ఆచార్య జి.ఎన్.రెడ్డి సుప్రసిద్ధ భాషావేత్త. ప్రముఖ పరి శోధకులు. నిశిత విమర్శకులు. ఆయన రాసిన వైవిధ్యభరితమైన 61పీఠికలను ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఎంతో శ్రమించిసేకరించి తనతో ఎం.ఏ చదివిన (1970-72) సహాధ్యాయుల సహకారంతో ముద్రించి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆవిష్కరించారు.

పీఠికా సంప్రదాయం ప్రపంచ వ్యాప్తంగా ఉంది. ప్రాచీన కవుల అవతారికలు స్వీయపీఠికల వంటివే. ఒక రచయిత మరో రచయిత తోనో, విమర్శకునితోనో పీఠిక రాయించుకోవడం ఆధునిక పద్ధతి. ఆంగ్లంలో ఇంట్రడక్షన్, ప్రిఫేస్, ఫోర్వర్డ్ వంటి మాటలు పీఠికకు సమానార్థకాలు. తెలుగులో ముందుమాట, ఉపోద్ఘాతం, పరిచయం వంటి పర్యాయ పదాలున్నాయని పీఠికల ముందు మాటలో రాచపాళెం వారు సముచితంగా పేర్కొన్నారు.

పుస్తకానికీ, పాఠకునికీ మధ్య అనుసంధానం పీఠిక. ఇతర భారతీయ భాషల్లోలాగా తెలుగులోకూడా పీఠిక ఒక ప్రత్యేకమైన ప్రక్రియగా రూపొం దింది. తెలుగులో తొలితరం పీఠికారచయిత లు కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వేటూరి ప్రభాకర శాస్త్రి వంటివారు ఎన్నో ప్రసిద్ధ గ్రంథాలకు విమర్శనాత్మక పీఠికలు రాశారు. మలితరం పీఠికా రచయితల్లో విశ్వనాథ, చలం, కుందుర్తి, శ్రీశ్రీ ప్రముఖులు. తరువాతతరం పీఠికా రచయితల్లో జి.ఎన్.రెడ్డి, సి.నారాయణరెడ్డి, జి.వి.సుబ్రహ్మణ్యం, కె.కె.రంగనాథా చార్యులు పుంఖానుపుంఖంగా పీఠికలు రాశారు. ఆధునికుల్లో ఆ తరువాత వరవరరావు, కె.శివారెడ్డి, అద్దేపల్లి రామ మోహనరావు వంటివారు తమ పీఠికలతో ఎందరో రచయిత లకు స్ఫూర్తినిచ్చారు. ఆచార్య జి.ఎన్.రెడ్డి 1978లో "తెలుగు విమర్శ వాఙ్మయంలో పీఠికా సాహిత్యానికి ఇంతవరకు గుర్తింపురాలేదు. నిజానికి సాహిత్యవిమర్శలో ఒకశాఖగా గుర్తించవలసిన రచనావ్యాసంగం ఇది. ఇంకా ప్రముఖుల పీఠికలను సంకలనాలుగా చేసి ప్రచురించ వలసిన అవసరం ఉంది"అన్నారు. ఆయనచెప్పినట్లు ప్రముఖ పీఠికా రచయితల పీఠికలన్నీ సంపుటాలుగా వచ్చాయి.



"జి.ఎన్.రెడ్డిగారు తెలుగులో పీఠికా రచనను సీరియస్‌గా కళా రూపంగా దానిని సుసంపన్నం చేశారు." అన్న రాచపాళెం వారి అభిప్రాయం సమంజసంగా ఉంది. జి.ఎన్.రెడ్డి తన ముందుతరం ప్రముఖ పీఠికా రచయితల పీఠికలను నిశితంగా పరిశీలించారు. ఆంగ్ల విమర్శకులు ఫ్రాన్సిస్ బేకన్ చెప్పిన "సంక్షిప్తత, సమగ్రత ఏ రచనకైనా అవసరం. సంక్షిప్తత కోసం స్పష్టతను పరిత్యజించరాదన్న" రచనా నైపుణ్యాన్ని దృష్టిలోఉంచుకొని పీఠికలను సంక్షిప్తంగా, సమగ్రత లోపించ కుండా శైలీసౌందర్యంతో రాశారు. ఆయనచేత పీఠికలు రాయించుకున్న వారిలో ఎక్కువమంది రాయలసీమ ప్రాంతానికిచెందిన ఆయన శిష్యులూ, పరిశోధక విద్యార్థులున్నారు. బయటి వారు రవ్వా శ్రీహరి, జొన్నలగడ్డ మృత్యుంజయరావు, నేతి అనంతరామశాస్త్రి వంటి వారు కొద్దిమంది మాత్రమే. పీఠికారచనలో గ్రంథ విస్తృత ప్రయోజనా లను దృష్టిలో ఉంచుకొని 9మంది ఆంగ్ల గ్రంథాలకు ఆంగ్ల పీఠికలు రాశారు. వాటిలో ఆయన ఆంగ్లంలోరాసిన సిద్ధాంతగ్రంథాలు రెండు. 'తెలుగు సాహిత్యంపై ఆంగ్లభాషాప్రభావం' (1800-1950), (1957), తెలుగు లో అర్థపరిణామం (1962) సి.పి.బ్రౌన్‌పై ఐం.గో.రె.రాసిన గ్రంథానికి ప్రధాన సంపాదకులుగా అమూల్యమైన ఆంగ్ల పీఠికను రాశారు. వ్యాసభారతం-నన్నయపరిష్కారం, ఆంధ్ర గీర్వాణచ్ఛందం, కర్ణాటక ఆంధ్ర సాహిత్యచరిత్ర, తెలుగు ఇలక్కియం- ఒరి అరియుగం (తెలుగుసాహిత్యం- ఒకపరిచయం) అనే తమిళ గ్రంథానికి ఆంగ్ల పీఠికలురాశారు. దాక్షిణాత్య సాహిత్యసమీక్ష (డా.జి.నాగయ్య) దాక్షిణాత్య దేశీఛందోరీతులు (డా.సర్వోత్తమరావు) గ్రంథా లకు పీఠికలు రాస్తూ వాటిని ఇతర దాక్షిణాత్యభాషల్లోకి అనువదిస్తే ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటుందని సూచన చేశారు.

ఆయన పీఠికలను పరిశీలిస్తే ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపై ఆయనకు సమదృష్టి ఉన్నట్లు స్పష్టమవుతుంది. కొన్ని పీఠికలు ముఖ్యంగా 'రాళ్ళపల్లి పీఠికలు' తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల భగవద్గీత, జాషువా కృతుల సమాలోచనవంటి గ్రంథాల పీఠికారచనలో ఉద్విగ్నతకులోనైనట్లు తెలుస్తుంది. కొన్ని పీఠికలు ఆత్మీయంగా, అభినివేశంతో చమత్కారస్ఫోరకంగా రాశారు. డా.జి భాస్కర్‌చౌదరి జాషువా కృతుల సమాలోచన గ్రంథానికి పీఠిక రాస్తూ "తొలి తరం ఆధునికకవుల్లో అన్ని విధాలా ప్రసన్నమయ్యే మహ నీయమూర్తి జాషువా. జాషువాది రాపిడివడ్డ జీవితం. రాపిడిలో రాణించిన ప్రతిభ. ప్రతిభతో గుబాళించిన కవిత" అంటారు. రాచపాళెం శిల్పి ప్రభావతి గ్రంథాన్ని ఏడు అధ్యాయాలుగా వర్గీకరించారు. జి.ఎన్.రెడ్డిగారు పీఠికలో "ప్రబంధం-కళ-శిల్పము, ఈ మూడింటి స్వరూపతత్వానికి సంబంధించి చక్కని పునాది ఏర్పరచుకొని, ఆ పునాది మీద ఏడంతస్తుల మేడ అన్నట్లు ఏడు ప్రకరణాల్లో ప్రభావతీ ప్రద్యుమ్న శిల్పి వైభవాన్ని చక్కగా ప్రదర్శించాడు" అని చమత్కరించారు. (పుట:106)

గల్లా చలపతి 'కవికర్ణ రసాయనం- విశిష్టాద్వైతం' గ్రంథ పీఠికలో "సంకుసాల నృసింహకవి శృంగార, వైరాగ్య వర్ణనలు సవ్యసాచిలా నడిపారని, కవిత్వ వేదాంతాలను అద్వైతంగా దర్శించిన భావుకుడని గొప్పగా విశ్లేషించారు. (పుట: 140). ఈ పీఠికలన్నింటిలో ఒక్కటి మాత్రమే సృజనాత్మక కవితా సంపుటి అడిగోపుల వెంకటరత్నంగారి జీవన పోరాటం. ఈ పీఠికలో "వెంకట రత్నంగారిది ఆవేశంలో కన్నా ఆలోచనలోపుట్టిన కవిత. ధ్వనిశిల్పమున్నకవిత" అంటారు (పుట:177). రాచపాళెంవారు జి.ఎన్.రెడ్డిగారి సాహిత్య అధ్యయన పద్ధతులను మూడింటిని గుర్తించారు. 1. విడిగా ఒక రచనను చదివి దాని స్వార స్యాన్ని గుర్తించడం. 2. చారిత్రకపద్ధతి. ఒక భాషాసాహిత్యాన్ని కాలక్రమ దృష్టితో పరిణామ స్వరూపాన్ని అధ్యయనం చేయడం. 3. తులనాత్మక పద్ధతిగా పేర్కొన్నారు. ఈ అధ్యయన పద్ధతులు తనను గొప్పగా ప్రభావితం చేశాయం టారు. రాచపాళెంవారు ఈ పీఠికలన్నింటినీ చారిత్రక పద్ధతిలో కూర్పు చేశారు. ఈ పీఠికల్లో జి.ఎన్.రెడ్డిగారు సి.వేణు కథా సంపుటి 'నవ్విన ధాన్యరాశి' (1965) పీఠికను చేరిస్తే బావుండేది. రాచపాళెంవారు ఎంతో శ్రమించి ఈ పీఠికలను ప్రామాణికమైన ప్రయోజనాత్మకమైన పీఠికతో ముద్రించారు. సాహితీప్రియులూ, విమర్శకులూ, పరిశోధకులూ విధిగా చదువదగిన ప్రామాణిక గ్రంథం 'జి.ఎన్.రెడ్డి పీఠికలు'.

-డా॥ పి.వి. సుబ్బారావు, ✆ : 9849177594

జి.ఎన్.రెడ్డి పీఠికలు, వెల:రు.175/-.పుటలు:216, ప్రచురణ-ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, బ్రాంచీలన్నింటిలో లభించును.

చాసో కవిత్వం- సార్వజనీనత

(గతవారం తరువాయి)

ఇదే పరికరాలంకారం అంటే
'విగత ప్రాణులౌ/విభులపైబడి
వెఱ్ఱెత్తిన/యువిదల'

అనటంలోని వకార పునరుక్తి ఒక సొంపైన వృత్త్యనుప్రాసాలంకారం. ఇది చదివేటప్పుడు వకార ఉచ్చారణ కవితా పఠనంలో ఒక 'ఊపు (మొమెంటమ్)'ను ఇస్తుంది. ఇది ఈ అలంకార ప్రయోజనం. ఈ అలంకారం అన్ని భాషల్లోనూ అందగిస్తుంది. ఆకర్షకంగా ఉంటుంది. "Where the head is held high" అంటూ (హ్ర) పునరుక్తి ఠాగూర్ (Where the mind is without fear అంటూ ప్రారంభమయ్యే ఒక పద్యంలో(గీతాంజలికావ్యంలో) ఈ Alliteration (హల్లుల పునరుక్తి) ఆకర్షణను చూపిస్తాడు. 'దదబరోం! దదబరోం'లోని రకారం, 'హఁహోం హఁహోం' లోని శకట రేఫ (ఱ) ధ్వనులు, రెండు పదాలలోని హ్రస్వ ధ్వనులు, రెండు పంక్తుల చివరలలోని అనునాసికధ్వని-అన్నీ కలసి మరఫిరంగుల మ్రోతను ధ్వనిస్తాయి - కవితా పఠన ధ్వనిలో కొంత పాజ్ (Pause), ఒకింత పోజ్ (Pose) లతో ఆ పదాలను ఉచ్చరిస్తుంటే, ఇది ఒక శబ్ద చమత్కారం. పై పది - పన్నెండు పేరాగ్రాఫ్‌లలోని వివరణ అంతా 'రీతి' అనే ఒక క్రమ కావ్యలక్షణ వస్తువు క్రిందికి వస్తుంది. ప్రసిద్ధ ఆలంకారికుడైన వామనుడు 'రీతి రాత్మా కావ్యస్య' ('రీతి' అనేది కావ్యానికి ఆత్మ) అని సిద్ధాంతీకరించాడు. 'రీతి'అంటే విశిష్ట పదాలను పొహళిస్తూ రచన చేయటం. రీతి అనే దానిని Synchronism of Words (Terms) and Meanings) అని ఆంగ్లంలోకి అనువదించు కోవచ్చు. కవిత్వానికి రీతే ఆయువుపట్టు అనే ఈ సిద్ధాంత భావాన్ని (concept ను) పాశ్చాత్య పండితుడైన జేమ్స్ కజిన్స్ గూడా వెలిబుచ్చాడు. "A word in itself, above all, a word well chosen and transfigured in poetry is the most universal of all artistic symbols (కేవలం ఒక పదం - ఆదీనూ సందర్భోచిత పదం - కవిత్వంలో పొహళింపబడితే ఆ పదం ఎప్పటికీ సార్వజనీన కళాత్మికతా సంకేతంగాను, శక్తిమంతంగాను నిలచిపోతుంది)" అంటూ.

'విహాయసానికి మొత్తంగా' అనటంగూడా ఒక గంభీర భావ ప్రకటన. ఆకాశం బోర్లించిన బొచ్చెలాగా-అంటే-బోర్లించిన అర్ధగోళాకారంలో కనిపిస్తుంది. దానికి భూమి యొక్క వ్యాసం మొత్తం నేలబారులో 1800 సరళరేఖా కోణంలో ఉంటుంది. ' మొత్తంగా ' భూవ్యాసం పొడవునా పూర్తిగాను, ఆకాశం అంతాను ఆ రోదనలు, ఆ రక్తపు తడి (ఆర్ద్రతా దీనతలు) వ్యాపించాయి అని అర్థం. అంటే ఆ రెండవ ప్రపంచ యుద్ధపు దుష్ఫలితాలకు, కరాళనృత్య బీభత్సానికి బలికాని దేశమే లేదు అనే భీతావహ భావం.

యుద్ధంలో నిహతులవుతున్న సైనికులు, విలపిస్తున్న భార్యలు 'హఁరోం హఁరోం' అనటం లో దేముడో, రాముడో (Oh! My God!) అంటున్నారని భావం. 'సోహం సోహం' (నేనే ఆయన, ఆయనే నేను, ఆయన కాదు నేను చచ్చి పోయాను)అని భర్తృవిహీనులైన వారి ఏడుపులు, పెడబొబ్బలు) ఇలా అల్పాక్షరాలలో అనల్పార్థం నిబిడించటం బాగుంది. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. చాసో నాస్తిక, ప్రాచీన సంప్ర దాయ వ్యతిరేక భావవాది అయినప్పటికీ వారు జన్మించిందీ, వారి సమీప బంధువర్గందీ - అంతా సంప్రదాయ శైవకుటుంబ వాతావరణమే. అందుచేత అప్రయత్నంగానే ఈ కవితలో 'హరోం', 'సోహం' పద, వాక్యాలు చోటు చేసు కున్నాయి. ఎవరి రచనలోనైనా వారి వారి కుటుంబ, గ్రామ, ప్రాంత, సంఘ నేపథ్య మూలాలు, పలుకుబడులు అంత తేలిగ్గా అదృశ్యమైపోవు అని చాలామంది చెప్పే ఒక సార్వకాలీన సార్వజనీనసత్యానికి ఈ పదాలు ఉదాహరణలు. 'రాత్రి' కవితలో ఉపమాలంకారాలు సమర్థనీయ సాదృశ్య సుందరంగా అమరి అందగించాయి.

"భవిష్యత్తులా/అగమ్య గోచరంగా
ఆకాశం" అంటాడు కవి.

నిజమే ప్రతి మనిషికీ భావి అగమ్య గోచరమే. కడుపు నిండిన వాడికి డొక్కలెండిన వాడికి, పాలకుడికీ, పాలితుడికీ, కులీనుడికీ, కూలీకి, దొరకు,దొంగకు - ఏ ప్రాణికీ భవిష్యత్తు మీద భరోసా ఉండదు. రోదసికవతల రోచిస్సు ఉందో తమస్సుఉందో! 'నేను నెత్తిమీద ఆకాశం లోకి పోయే అవకాశం ఉందా? నా పుత్రుడు కాళ్ళ కింది క్యాలిఫోర్నియాకు పోయే అదృష్టం ఉందా?" ఏమిటో అంతా అర్థం కాని భవిష్యం, అంతు చిక్కని ఆకాశం' । ఇంత విచికిత్స ఉంది ఈ మూడు పంక్తుల్లో.'అక్కడక్క/డాశల్లా/చుక్కలు' - ఇక్కడ మఱీ గంభీర ఉపమానం.

చుక్కలెప్పుడూఆశల్లా అందగిస్తూ ఊరిస్తూనే ఉంటాయి. ఒకనాడు కనిపించిన తారకే మఱో నాడు కనిపించదు. ఒకనాడున్న ఆశ మఱోనాడు నశించిపోతుంది. ముఖ్యంగా సగటు మానవుడికి ఆశ నెరవేరుదు ఎప్పుడూ దూరంగానే ఉంటుంది. తారక అందుడూ అంటే ఎవరో ఆర్మ్‌స్ట్రాంగ్ లాంటి అదృష్టవంత అమెరికన్‌కు తప్ప. చంద్రుడు లేకపోయినా చుక్కలుంటాయి. ఆశ తీర్చేవాడు లేకపోయినా ఆశలుంటాయి. చుక్కలు అనేకాలు. ఆశలూ అసంఖ్యాకాలు. ఇదీ ఇక్కడి గంభీర భావ సౌందర్యం.

'రాత్రి' కవిత జనాన్ని, జనపదాన్ని మఱచి, వెఱ్ఱి ముదిరిన ఊహాలోకాల్లో విహరించే ఆనాటి భావ కవిత్వాన్ని నర్మగర్భంగా నిరసించే రచన. ఇది భావకవిత్వం మీద తిరుగుబాటు ప్రకటన పరోక్షంగా. కవిత ద్వితీయార్థంలో ఈ ధోరణి కనిపిస్తుంది. కడుపునిండినవాడు తేన్చితే కులాసే వేనాబ్రదర్? అంటూ గుడ్లగూబ పలకరించిం దట. పాశ్చాత్యపు రొమాంటిక్ (కాల్పనిక) పొయెట్రీ యొక్క దుష్ప్రభావంతో భావ కవులు ఊహల్లో విహరిస్తుంటే అభ్యుదయపు వెలుతురు చూడలేని 'గుడిసేటి' (ఇది ఒక తిట్టు) సాహితీ పరులు కొందఱు అభినందించారట అని భావం. ఎంతఘాటుగా విప్లవీకరించారు చాసో తన అభ్యుదయకవిత్వపుబాటలో! భావకవుల బాణీలో ఉదాత్త ఉపమానాలువేస్తూనే అంతలోనే వాళ్ళ కవిత్వాన్ని నేలకేసికొట్టారు ఒక నీచోపమతో.

'అక్షయ పాత్రలా/అర్థ చంద్రుడు
బూజెక్కి గూడు కట్టాడు' అంటారు.

ఇక్కడ అర్థచంద్రుడు అంటే దాదాపు దశమి నాటి శశి. ఆ శశాంకుడు తన వెన్నెల అనే వెన్నలాంటి ఆహ్లాదకర ఆహారాన్ని ఏ కొందఱికో మాత్రమేకాదు. అనుభవించేవారందఱికీ ఇస్తాడు అక్షయపాత్ర అడిగినవారికల్లా అన్నం అందజేసేటట్టు.

'బూజెక్కి గూడుకట్టాడు' అనటం కూడా ఒక నైసర్గిక ఉపమాన వాక్యం. - నెలరాజు చుట్టూ వలయాకారంగా కనిపించే తేజశ్చక్రం తెల్లని బూజులాగానే ఉంటుంది. అయితే ఇక్కడ బూజు అనే నీచోపమను చెప్పటంలో చాసో ఒక ప్రయోజనం సాధించారు. చంద్రుడు, చంద్రిక మొదలైన వస్తువులు ప్రాచీన ప్రబంధ, సంప్రదాయ కవుల పాతచింతకాయ పచ్చడి భావనాసామాగ్రి. ఆ సామాగ్రినే పట్టుకొని భావ కవులు వేలాడారు. మానవతావాదమే ఆధునిక కవిత్వానికి ఆలంబనం కావాలి అని నమ్మిన చాసో తేజశ్చక్రాన్ని బూజు అన్నారు. చంద్రుడు అనే సంప్రదాయ పాత్ర సంప్రదాయం అనే చట్రం (గూడు)లోతనను తాను కట్టేసుకుందట. ఇక్కడగూడు అనేది ఉపమేయం. సంప్రదాయం అనేది ఊహించాల్సిన ఉపమానం. దీనిని లుప్తోపమాలంకారం అంటారు.

(మిగతా వచ్చేవారం)

-శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

విశాలాంధ్ర

బతుకు

The Life

సోమవారం
29 జనవరి 2018

కోటు... కమీజ్‌లు

ఏ కాలంలోనైనా సౌకర్యంగా ఉండేవి సల్వార్ కమీజ్‌లు. కాలమే కాదు ఉద్యోగం, వ్యాపారం, ఇంటిపని ఇలా పని ఏదైనా కూడా సౌకర్యంగా చేసుకోగలిగిన అవకాశం ఉన్నదీ ఈ సల్వార్ కమీజ్‌ల్లోనే. అందుకే కాలేజీ అమ్మాయిల నుంచి పెళ్ళీడు పడతులు, నడివయస్సు ముద్దుగుమ్మల వరకూ అందరూ ఇష్టపడతారు వీటిని. మరి ఇది చలికాలం కదా దీనికి ఇంకొంచెం హంగును చేకూర్చి దీనిమీద కోటు వేస్తే కొత్త లుక్ రావడమే కాదు మంచి వెచ్చదనమూ అందుతుంది. ఈ కోటులోనూ ఎన్ని రకాలో. షార్ట్, మీడియం, లాంగ్, ఫుల్‌లెంగ్త్. ఎవరికి ఇష్టమైన మోడల్ వారు ఎంచుకునే వీలూ వీటిలో ఉంది. అలాంటి కోటు మోడల్ సల్వార్ కమీజ్‌లే ఇవి. వీటిని చూస్తుంటే సీజన్‌కి తగ్గ ఫ్యాషన్ అనిపిస్తోంది కదూ!














శరీరంపై స్ట్రెచ్ మార్క్స్‌ను పోగొట్టండి ఇలా..

స్ట్రెచ్ మార్క్స్ అనేవి చర్మంపై పడి ఉండిపోయే సన్నని గీతల్లాంటి మచ్చలు, ఇవి చర్మం ఎక్కువగా సాగటం వలన ఏర్పడతాయి. ఇవి చాలా మొండివి, తొందరగా మచ్చలుగా ఉండకుండా కలసిపోవు. ఇవి సాధారణంగా పొట్ట, హిప్స్, తొడల ప్రాంతంలో వస్తుంటాయి. అధికంగా స్ట్రెచింగ్ హఠాత్తుగా బరువు తగ్గటం వంటి కారణాల వలన రావచ్చు. ఇది మీ చర్మాన్ని పాడుచేసి, త్వరగా మళ్ళీ పెరిగే గుణంపై ప్రభావం చూపించి పైన ఇలా మచ్చలు పడేలా చేస్తుంది. ఈ మచ్చలను వదిలించుకోటానికి చాలామంది స్త్రీలు ఆపరేషన్లు కూడా చేయించుకుంటారు. కానీ మీరు సహజ ప్రత్యామ్నాయం కోసం చూస్తుంటే, మీ కోసమే ఈ వ్యాసం. ఈ మొండి స్ట్రెచ్ మార్క్స్ కి సహజ సుగంధ నూనెలతో దిగువన పేర్కొన్న విధంగా ముగింపు పలకవచ్చు.

అన్ని బ్యూటీ ట్రీట్మెంట్లలో తరచుగా వాడే ఈ సుగంధ నూనెలలో కణాలను తిరిగి సృష్టించడానికి ప్రేరేపించే లక్షణాలుండి, పాడైన చర్మాన్ని తిరిగి సాధారణ రూపానికి తీసుకొస్తుంది. అవేకాక, సుగంధనూనెలలో చర్మానికి పోషణ అందించే, మచ్చలకి వ్యతిరేక లక్షణాలుండి స్ట్రెచ్ మార్క్స్‌ను ముఖ్యంగా తొలగించి, మొత్తంమీద సాగే గుణాన్ని చర్మంలో మెరుగుపరుస్తాయి. ఖరీదైన చికిత్సలు ప్రయత్నించేకన్నా, ఈ కింది సుగంధ నూనెలలో ఏవైనా ప్రయత్నించి, మొండి స్ట్రెచ్ మార్క్స్‌ను తొలగించుకోండి.



రోజ్ హిప్ సుగంధ నూనె

గులాబి మొక్కల విత్తనాల నుంచి తీసే ఈ సుగంధ నూనెలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ శక్తివంతమైన లక్షణాలు చర్మం మళ్ళీ బాగయ్యేట్లా చేసి, స్ట్రెచ్ మార్క్స్ కన్పడనీయకుండా తగ్గిస్తుంది.

ఎలా వాడాలి : కొన్ని చుక్కల రోజ్ హిప్ సుగంధ నూనెను మీరు రోజూ వాడే నూనెలో కలిపి, స్ట్రెచ్ మార్క్స్ పై రోజూ మసాజ్ చేయండి.

జొజుబా సుగంధ నూనె


విటమిన్ ఎ, ఇ లతో నిండి ఉన్న జొజొబా సుగంధ నూనె పాడైన చర్మాన్ని బాగుచేసే మరో చిట్కా. ఇది చర్మం తిరిగి తన పాత రూపం పొందటానికి సాయపడుతుంది. ఈ సుగంధ నూనెను క్రమం తప్పకుండా వాడటం వలన మీ మొండి స్ట్రెచ్ మార్క్స్ పోతాయి.

ఎలా వాడాలి : ఈ సుగంధ నూనెతో ఆలివ్ నూనెను కలపండి. ఈ మిశ్రమాన్ని మచ్చలున్న చోట మసాజ్ చేయండి.

ఫ్రాంకిన్సెన్స్ సుగంధ నూనె

సహజ చికిత్సా గుణాలకి ప్రసిద్ధమైన, ఫ్రాంకిన్సెన్స్ సుగంధ నూనె మొండి స్ట్రెచ్ మార్క్స్‌ను తొలగించే మరో అద్భుతమైన చిట్కా.

ఎలా వాడాలి : కొన్ని చుక్కల సుగంధ నూనెను మీ ప్రతి రోజు వాడే మాయిశ్చరైజర్‌లో కలిపి మచ్చలున్న చోటంతా రాయండి. క్రమం తప్పకుండా ఇలా చేసి మంచి ఫలితాలు పొందండి.



రోజ్ మేరీ సుగంధ నూనె

రోజ్ మేరీ సుగంధనూనె చర్మం రిపేరవ్వటంలో సాయపడి, సాగే గుణాన్ని తిరిగి అందిస్తుంది. క్రమం తప్పకుండా దీన్ని వాడటం వలన స్ట్రెచ్ మార్క్స్ కూడా పల్చబడతాయి.

ఎలా వాడాలి : కొన్ని చుక్కల ఈ రోజ్ మేరీ నూనెను కొబ్బరినూనెతో కలిపి, మిశ్రమాన్ని స్ట్రెచ్ మార్క్స్ ఉన్న చోటల్లా మొత్తం రాయండి. స్ట్రెచ్ మార్క్స్ తొలగించుకోటానికి వారానికి 2-3సార్లు ఈ చిట్కాను వాడండి.

లావెండర్ సుగంధ నూనె

లావెండర్ సుగంధ నూనె మరో తప్పక ప్రయత్నించాల్సిన పదార్థం. దీనిలోని మచ్చల వ్యతిరేక లక్షణాలు చర్మం తొందరగా పూడుకునేలా చేసి, చర్మంపై మచ్చల రంగును కూడా లేతగా మార్చి తొందరగా చర్మపు రంగులో కలిపేస్తుంది.

ఎలా వాడాలి : కొన్ని చుక్కల లావెండర్ నూనెను విటమిన్ ఇ నూనెతో కలిపి స్ట్రెచ్ మార్క్స్ ఉన్న అన్ని చోట్లా మెల్లగా మసాజ్ చేయండి.

నెరోలీ సుగంధ నూనె

ఈ సుగంధ నూనె చర్మాన్ని రిపేర్ చేయటానికి, జీవం తేవడానికి ప్రసిద్ధి చెందింది. దీనికితోడు అది కొల్లాజెన్ ఉత్పత్తిని కూడా పెంచి, మీ చర్మపు సాగేగుణాన్ని మెరుగుపరుస్తుంది.

ఎలా వాడాలి: కొన్ని చుక్కల సుగంధ నూనెను బాదం నూనెతో కలిపి స్ట్రెచ్ మార్క్ ఎక్కువ ఉన్న చోట మసాజ్ చేయండి.

గ్రేప్ సీడ్ సుగంధ నూనె

గ్రేప్ సీడ్ నూనెలో ఉండే అన్ సాట్యురేటడ్ కొవ్వుపదార్థాలు, విటమిన్ ఇ స్ట్రెచ్ మార్క్స్‌కి ప్రభావవంతమైన చిట్కాగా పనిచేస్తుంది.

ఎలా వాడాలి: 3-4 చుక్కల సుగంధ నూనెను ఆలోవెరా జెల్‌తో కలపండి. ఈ మిశ్రమాన్ని మచ్చలున్న చోట మొత్తం మసాజ్ చేయండి. వారానికి 3-4సార్లు ఇలా చేయటం వలన వాటి రంగు పల్చబడుతుంది.

పాచౌలీ సుగంధ నూనె

పాచౌలీ సుగంధనూనెలోని చర్మం తిరిగి జీవింపచేసే లక్షణాలు, పాడైన చర్మాన్ని బాగుచేసి, చర్మంపై చిరాగ్గా కన్పించే స్ట్రెచ్ మార్క్స్‌ను ఎక్కువ పెరగకుండా తొలగిస్తాయి.

ఎలా వాడాలి : కొన్ని చుక్కల సుగంధ నూనెను మీరు రోజూ వాడుకునే మాయిశ్చరైజర్‌తో కలిపి మచ్చలపై మసాజ్ చేయండి. వారంలో 2-3సార్లు ఈ ఇంటిచిట్కా పాటించి వేగవంతమైన ఫలితాలు పొందండి.

సౌందర్యానికి....ఉప్పు!



ఉప్పు లేనిదే వంటకు రుచి రాదు. ఉప్పు లేకపోతే రుచి కాదు అసలు నోట్లో పెట్టడమే కష్టం. ఉప్పు వాడకం ఎక్కువ, తక్కువలైనా కష్టమే. ఎక్కువైతే హైబీపీ, తక్కువైతే లో బీపీ. మెరిసే దంతాలు సొంతం కావాలంటే ఉప్పుతో రుద్దండి. నోటి దుర్వాసన పోవాలంటే ఉప్పును ఉపయోగించండి. ఇది క్లెన్సర్‌గా పనిచేస్తుంది. దంతాలు నొప్పి, నోటి పూతా అయితే గ్లాసు గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి కలిపి ఈ మిశ్రమాన్ని నిమిషం పాటు నోటిలో వేసుకుని పుక్కిలించండి. దంతాల నొప్పి, నోటి పూత పోతాయి. నీళ్ళల్లో రాళ్ళ ఉప్పు కలుపుకుని స్ప్రే బాటిల్‌లో నిల్వ చేసుకోండి. ఈ నీటిని మీకు కావాల్సినప్పుడు ముఖంపై స్ప్రే చేసుకుని పది నిముషాల తర్వాత కడిగేస్తే....చర్మం నిగారింపును సంతరించుకుంటుంది. కళ్ళ కింద నల్లటి వలయాలను పోగొట్టుకునేందుకూ ఉప్పుని ఉపయోగించుకోవచ్చు. ఇందుకోసం...గోరువెచ్చని నీటిలో ఉప్పు కలిపి ఆ నీళ్ళల్లో ముంచిన దూదిని కళ్ళ మీద పెట్టుకోండి. ఉప్పు, లవంగం నూనె, ఆలివ్ ఆయిల్ తీసుకుని బాగా కలిపి శరీరానికి రాయండి. కాసేపటి తర్వాత స్నానం చేస్తే చర్మంపై ఉండే మురికి మొత్తం పోయి శరీరం కాంతివంతంగా మారుతుంది.

శెనగలు...స్నాక్స్!



పెళ్ళిళ్ళు, పేరంటాల సమయంలో ఎక్కువగా శెనగలు పంచుతుంటారు. ఈ సంప్రదాయం ఇప్పుడు బాగా తగ్గిపోయింది గానీ పూర్వం ఈ పద్ధతిని కచ్చితంగా పాటించేవారు. కారణం బహుశా ఈ శెనగల్లో ఉన్న పోషకాలే కావచ్చు. వీటిని ఉడికించుకుని సాయంత్రం వేళ స్నాక్స్‌గా తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. రక్తంలోని గ్లూకోజ్ స్థాయిల్ని శెనగలు పెంచుతాయి. తద్వారా మధుమేహం రాకుండా చేస్తాయి, వచ్చినా అదుపులో ఉంచుతాయి. ముఖ్యంగా పిల్లలకు వీటితో మంచి పోషకాలు లభిస్తాయి. ఉడికించిన శెనగలను సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటలోపు తినడం ఆరోగ్యకరం. స్నాక్స్‌గా సాయంత్రం వేళ చాలామంది బజ్జీలు, ఇతరత్రా నూనె పదార్థాలు తింటూ ఉంటారు. వీటన్నింటికంటే శెనగలు తినడమే శ్రేయస్కరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శెనగల్లో కాల్షియం, ఇనుము, పొటాషియం, పీచు సమృద్ధిగా ఉన్నాయి. ఇందులోఉండే మాంగనీస్, మెగ్నీషియం శరీరానికి కావలసిన శక్తిని అందిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. రక్తహీనత తొలగిపోతుంది. జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. శెనగల్లో ఉండే పోషకాలు గుండెకు బలాన్ని ఇస్తాయి. బరువు తగ్గాలనుకునేవారు రోజూ కప్పు శెనగలు తింటే మంచి ప్రయోజనం ఉంటుంది. ఇందులో ఉండే ఫోలేట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి.



జరిగిన కథ

"ఈ మధ్య నువ్వు ఒక పట్టాన్ని సనాతన హిందువయి పోయావు. లక్ష దీపానికి తిరుత్తణ్ణి వెళ్ళావు. నెల్లూరు సంతాన గోపాలస్వామిగారికి బంగారు కిరీటం చేయించావు. క్లబ్బులో దొరలతో షాంపేను విందులు - ఇంటికొచ్చి వీభూది పూసుకొని తులసిమాల లేసుకుని శాయిబాబా భజన - కాషాయి బట్టలు ధరించి - దండకి బంగారు తావీజు కట్టుకుని- గౌరాంగ పూజ! ఎందుకీ పూజలూ పునస్కారాలూ? దేవుడి కీకానుకలెందుకు? కాంగ్రెసుకీ లంచం ఏల?...సర్కసులో హాస్యగాడు పరుగెడు తున్న గుర్రంమీద నిలబడి నిమిషానికోదుస్తు మారుస్తుంటాడు. నీ ప్రవర్తన అలాగే వుంది. ఎందుకీ మొగ్గలూ పల్టీలున్నూ?...

(నిన్నటి సంచిక తరువాయి)

...లక్ష్యం ఏమిటో - అందుకు నువ్వుచేసే సాధనాలు ఏమిటో ఆలోచించుకో, రెండూ సమన్వయం చేసుకోవడమే - ...నీమీద కోపం వచ్చికాని - క్రోధం పెట్టుకునికాని ...లేచి వెళ్ళిపోవడంలేదు సుమా - అని మాత్రం మువ్మాటికీ ... నిన్ను ప్రేమిస్తున్నాను కాబట్టే - నీ వడిదుడుకులు నన్ను నరనారాల బాధిస్తున్నాయి. నీ వూసరవిల్లి మార్పులు నాకు ... పెట్టినట్టు అవుతూంది...నా మనశ్శాంతి కోసం వెళ్ళి పోతున్నాను. నా వెంటపడకు. నా కోసం వెతుక్కోవద్దు. ప్రతి ఊరునుంచి నా క్షేమం నీకు తెలియజేస్తూంటాను. మనస్సు ...క నేనే నీదగ్గరకు వస్తాను - అంతవరకూ ఓపిక పట్టు..."

...శాంతం వెళ్ళిపోయి అప్పుడే రెండు రోజు ...ంది. ఎక్కడ వుందని వెతకను! ఎవరితో చెప్పను? ఎన్నాళ్ళు కనిపెట్టుకుని వుండను? నౌకర్ల ఎదుట నేను ధైర్యంగా వుండాలి.

నేనేమి తప్పుచేశాను? ఉపకారం కోసం, ఉద్యోగంకోసం ఎందరు ఎందరిని ఆశ్రయించడం లేదు? కుర్రవాడికి పరీక్షలో మార్కులకనీ - కూతురికి కాలేజీలో ప్రవేశానికనీ - తెల్లవారిలేస్తే ఎంతమంది పెద్దమనుష్యులకి నేను సాయం చెయ్యడంలేదు? అదంతా కూడా అవినీతే అంటే ఇంక బతకడం ఏలాగు? కాలానుగుణ్యంగా పోవడం తప్పా? అప్పుడు ప్రజలచే దూషింపబడినవారు ఇప్పుడు ఆ ప్రజలచేతనే భూషింపబడటం లేదా?

ఒకవిధంగా చూస్తే నాది తప్పే. శాంతాన్ని నా విషయం సిఫార్సు చేయమనడం పొరపాటే. అంత కఠినంగా ఆలోచిస్తుందని నేనెన్నడూ అనుకోలేదు. భార్యని ఆమాత్రం సాయం చెయ్యమనడం తప్పు లేదనుకున్నాను. నాకీ తాపత్రయం అంతా ఎందుకు? శాంతంకోసం - పాపాయి కోసం - రేపొద్దున్న బాచిగాడు అంటూవుంటే వాడికోసమేగదా? లేకపోతే ఎసెంబ్లీ సభ్యుడనై నేను యేం నిర్వాకం నిప్పెట్టాలి? ఆ హోదా పురస్కరించుకుని కాస్త ముందుకు రావచ్చును అనేకదా! ఒకప్పుడు ఎవరినేనా మనం దూషిస్తే ఎల్లకాలం వాళ్ళతో శత్రువుగానే వుండాలా? వాళ్ళు మంచివాళ్ళవకూడదా? వాళ్ళతో స్నేహం చెయ్యకూడదా?

ఈమధ్య ఎలాగేనా నాకు కొంత సనాతనం అబ్బింది.

ఏవిధంగానేనా దేవుడిదగ్గర నుంచి రెండు వరాలు సంపాదించాలని కోర్కె పుట్టింది. శాంతం తిట్టిందంటే తప్పులేదు. ఆవేళ టీపార్టీ నుంచి రాగానే దేవీపూజలో దిగిపోవడంలో కొంత అపభ్రంశం వుంది. ప్రొద్దున్న శృంగేరీ వారికి ఇంట్లో భిక్ష - సాయంత్రం గిండీలో గార్డెన్ పార్టీ! ఆవేళా అంతే - ఇంట్లో తద్దినం - సాయంత్రం - బ్లాక్‌స్టోన్‌తో డిన్నరు! ఇదంతా శాంతానికి కంటకంగానే వుండెను. కాని ఇంత మనసులో పెట్టుకుంటుందని నాకేమాత్రం అనుమానం తట్టినా - ఈ ఉపవాసాలూ - భజనలు వదులుకుని వుందును. వాటిమీద నాకేం అంత నమ్మకం వుండికాదు, వస్తే ఏదేనా



కలిసివస్తుంది - లేకపోతే పోయేదిలేదు అనికాని.

ఇప్పుడు ఏం చేయను? ఎంత ఏడ్చి ఏం లాభం? "గార్యంటీ పశ్చాత్తాపానికి - ఇరవై నాలుగు గంటలు చాలు" అన్నాడు గిరీశం. ఓపికపట్టి వుండాలి శాంతం రాక కోసం, ఒంటరిగాణ్ణయిపోయాను. టెలిగ్రాం వేస్తానంది. ఏదీ రాలేదు. ఎక్కడ ఏం ప్రమాదం జరిగిందో? జరిగితే తెలియకుండా వుంటుందా? ఏ ఖబురూ లేకుండా వుంటే మంచి ఖబురే అనుకోవాలి....నిజంగా నాకు మతిపోయింది. నా కేసులు గొడవేమిటో నా వకాల్తీలు గొడవేమిటో - వీటితో సరి పెట్టుకుంటే పొయ్యేది. అనవసరంగా తెచ్చి పెట్టుకున్నాను



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

ఎన్నికల గోల - తద్దినం కొనుక్కున్నట్టు. పాపాయి నవ్వు అంటూ మళ్ళీ. ఎప్పుడేనా వింటానా అనిపిస్తుంది.

75 ఆమె

కలకత్తా వచ్చి నాలుగు రోజులైంది.

ఈ మహాపట్నం చూస్తే గాబరాగా వుంది, కాని - అంతా దొరల సజ్జు. చాకిరీ చేసేవాళ్ళందరూ నల్లవాళ్ళు. చేయించుకుని అనుభవించేవాళ్ళందరూ తెల్లదొర్లూ, నల్లదొర్లూనూ! భోజనం అతికష్టంగా వుంది. వంట పేరంతా ఫ్రెంచి భాషలో, చేసినదంతా మాంసాహారం. మన హిందూదేశంలో హోటేలు - దొరలు అతిథులు - శాకాహారం దొరకదు. ఎంత అసందర్భం! నాకోసం ప్రత్యేకం ఏర్పాటు చేయించుకునేసరికి బ్రహ్మాండం బద్దలయింది! మన దేశమేనా అనిపిస్తోంది.

శాస్త్రి పేర క్షేమం టెలిగ్రాం వేశాను.

పాపాయికోసం ఆయాని పెట్టేను. - నేపాళం మనిషిని. పాపాయి, సుభ ఈమూలంగా కొంచెం ఉత్తరాది హిందీ నేర్చుకుంటారు.

మనసు నిశ్చలం చేసుకోవడానికి ఇంటినుంచి వచ్చేశాను. కాని ఏమీ తోచడం లేదు.

పాపాయిని, సుభని చిడియాఖానాకు తీసుకువెళ్ళేను. సింహాలని, కోతులని - రామచిలకలను చూచి వాళ్ళదే సంబరపడడం! ఎంత స్వల్ప విషయాలతో చిన్న పిల్లలు సంతోషడతారో!

బేలూరు మఠానికి వెళ్ళాను. కాని నాకేమీ శాంతి కలగలేదు.

ఆదివారం బ్రహ్మమందిరంలో ఉపాసనకి వెళ్ళేను. ఆది బ్రహ్మం - కేశవ బ్రహ్మం. రెండూ ఆధారంగానే కన్పించేయి నాకు. ఆ సంగీతకాని ఆ ఉపన్యాసంకాని నాకు అర్థం కాలేదు. శిల్పంకూడా పరిసరాలతో మేళవించక వికృతంగా కనిపించింది నా కంటికి.

జైనమందిరానికి వెళ్ళాం. కాశీఘట్టం చూశాం. పాపాయి కాశీబొమ్మ కావాలంది. మట్టిబొమ్మ కొనియిచ్చాను. తండోపతండాలుగా జనం వచ్చి పోతున్నారు. పుదుచ్చేరి తిరువణ్ణామలైలో ప్రేక్షకులు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళకీ వీళ్ళకీ ఎంత తారతమ్యం!

.... రోజులు గడచిపోతున్నాయి. ఈ మహాపట్నంలో నాకు స్థానం లేదనిపిస్తుంది. అయినా ఇంకా కొన్నాళ్ళు యిక్కడ వుండాలనే వుంది. ఈ వేళ నే నొక్కర్తెనే బయలుదేరాను. ట్రాము, బస్సు, కొంతదూరం నడక - జనపనార మిల్లులలో పనిచేస్తూన్న బస్తీలు చూడడానికని.

ఏమి కఠోరమైన దృశ్యాలు - ఏమీ చత్త - ఏమీ ఇళ్ళు? బస్తీకి నడి మధ్యగా పారుతుంది కుళ్ళు కాలువ. పిల్లలు చూస్తే - ఆనపతుంబలులాగా కడుపులు-కళ్ళలోంచి పైకెక్కొచ్చిన గుడ్లు - పాలిపోయిన చర్మం. స్త్రీలు కట్టుకున్నవి జీర్ణించి పోయిన చింకిపాతలు - అసలు ఇక్కడవాళ్ళు కట్టుకునేదే ఐదు మూరలు - అందుకుకూడా నోచుకోలేదే! వీళ్ళ కోరికలలాగే వీళ్ళ బ్రతుకులు కూడా అతుకుల బొంతలే! బస్తీ కంతటికి పట్టుమని పది కుళాయిలు లేవు. ఇత్తడి దుఖాణాల్లో బిందెల దొంతరలలాగు - కుళాయిల దగ్గిర తపేళా ముంతలతో కనిపెట్టుకుని కాపలా కూర్చున్నారు ఆడవాళ్ళు. సరిగ్గా ఆ సమయంలోనే మరుగుదొడ్లు వూడ్చి - వొళ్ళు కడుగుకోవడానికని వచ్చాడు ఒకతను - ఆ కుళాయిదగ్గరకే. ఆ వాసన నేను భరించలేకపోయాను.

ఈ పరిస్థితుల్లో - దైనందినం సంవత్సరాల తరబడి - జీవితం అంతా - జన్మం అంతా ఎలా గడుపుతున్నారు వీళ్ళు? నాలాంటి స్త్రీలే వీళ్ళున్నూ - మానవతులు - శీలవంతులు. కంపెనీలవారు ఇచ్చారుట ఇళ్ళు! ఇవి ఇళ్ళుకావు - కొంపలూ కావు, బొమ్మరిళ్ళు! నాలుగు రూపాయిలు అద్దె అని చెప్పింది ఒక ఆమె నాలుగేళ్ళు చూపించి. నాకు భాష తెలీదు. తెలిసిమాత్రం నేను ఏమి సానుభూతి చూపించగలను? నా సానుభూతి ఫలితం ఏమిటి? మొసలి కన్నీళ్ళని వీళ్ళు ఏవగించుకోరా? బంగాళీస్త్రీలు - గంజాంనుంచి ఓఢ్రస్త్రీలు! ఆ మూరెడు ఇంటిముందర జానెడు జాగా అలికి ముగ్గుపెట్టుకున్నారు. రంగుల ముగ్గులు, అల్పొన, గుమ్మడి పువ్వులు, గొబ్బిపువ్వులు! దరిద్రంలోకూడా కళాసక్తి!

ఇళ్ళల్లో కంచు కంచాలు తళ తళ మెరుస్తున్నాయి.

అబ్బబ్బ! బీదతనంకంటే వేరే పాపం లేదు. మైళ్ళకొద్దీ వున్నాయి యీ నరకకూపాలు - బరానగరు - కమరహట్టీ - కంకినార - ఉలుబేరియా - అగ్గరపాడా - శ్యామనగరం - టిటాఘర్ - గౌరీపూర్ - నద్దీయా!

గంగానది అవతల వద్దున వున్నాయి మిల్లు యజమానుల మహా సౌదాలు - ఏమి నరక కూపాలు?

ఈ తల్లక్రిందుదు ఎప్పుడేనా మారుతుందా? మారకపోతే మోక్షం లేదే! మార్పు తెచ్చే వాళ్ళెవరు? రేపు శాసన సభకు వెళ్ళబోయే శాస్త్రా లేకపోతే సర్వసుఖాలు అనుభవిస్తూ చోద్యం చూడడానికి వచ్చిన నేనా? ఎప్పుడో ఒకసారి నాలాగు ఆవేశం చేత రణరంగంలో దెబ్బలు తినడం వేరు. రోజుకు ఇరవై నాలుగు గంటలూ యీ పరిసరాల్లో బతుకుతూ సాహసం చూపించడం వేరు. ఈ సాహసవంతులే విజయాన్ని సాధించాలి. వాళ్ళ అసంతృప్తే వాళ్ళ ఆయుధం. వాళ్ళ సాహసమే వాళ్ళ శక్తి. వాళ్ళ ఐక్యతే వాళ్ళ ముక్తి. వాళ్ళ శక్తివల్లే రావాలి శాంతి - ప్రపంచానికీ...వాళ్ళకీ...నాకున్నూ...

- ఇంకా వుంది.

తూర్పుతీరంలో విస్తీర్ణపరంగా అతిపెద్ద ఓడరేవు ఏది?



1. కిందివాటిలో విస్తీర్ణం, వాణిజ్యపరంగా అతిపెద్ద ఓడరేవు?
ఎ) చెన్నై బి) విశాఖపట్నం
సి) ముంబై డి) కోల్‌కతా

2. దేశంలో అతి పొడవైన జాతీయ జల రహదారి ఏది?
ఎ) ఎన్.డబ్ల్యు-1 బి) ఎన్.డబ్ల్యు-1
సి) ఎన్.డబ్ల్యు-3 డి) ఎన్.డబ్ల్యు-2

3. విశాఖపట్నం ఓడరేవుకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) దేశంలో అతిపెద్ద కన్వేయర్ బెల్ట్ ఉన్న ఓడరేవు
బి) దేశంలో అతిలోతైన అంతర్జాతీయ ఓడరేవు
సి) ఇది తూర్పు తీరంలోని సహజ ఓడరేవు
డి) పైవన్నీ సరైనవే

4. 'మజగావ్ డాక్ షిప్‌యార్డ్' ఎక్కడ ఉంది?
ఎ) కొచ్చి బి) ముంబై
సి) కోల్‌కతా డి) విశాఖపట్నం

5. గంగవరం ఓడరేవు ఏ రాష్ట్రం ఉంది?
ఎ) పశ్చిమ బెంగాల్ బి) గుజరాత్
సి) తమిళనాడు డి) ఆంధ్రప్రదేశ్

6. కోల్‌కతా ఓడరేవుకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) దేశంలో పూడిక సమస్య ఎదుర్కొంటున్న ఓడరేవు
బి) ఇది హుగ్లీ నది ఒడ్డున ఉంది
సి) వాణిజ్య పరంగ తూర్పు తీరంలో అతి పెద్దది
డి) పైవన్నీ సరైనవే

7. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) గోవా షిప్‌యార్డ్ - వాస్కోడిగామా
బి) హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ - విశాఖపట్నం
సి) గార్డెన్ రిచ్ వర్క్‌షాప్- చెన్నై
డి) కొచ్చిన్ షిప్‌యార్డ్ - కొచ్చిన్

8. నేషనల్ వాటర్‌వేస్ బిల్-2015లో భాగంగా కేంద్రం కొత్తగా ఎన్ని అంతస్థలీయ జలమార్గాలను ప్రకటించింది?
ఎ) 95 బి) 106 సి) 112 డి) 115

9. సూయజ్ కాలువను తెరవడంతో దేశంలోని ఏ ఓడరేవు ప్రాముఖ్యత పెరిగింది?
ఎ) కాండ్లా బి) కోల్‌కతా
సి) ముంబై డి) విశాఖపట్నం

10. 'జవహర్‌లాల్ నెహ్రూ ఓడరేవు' అని దేనిని పిలుస్తారు?
ఎ) ముంబై బి) కాండ్లా
సి) నవసేన డి) కొచ్చిన్

11. ఇనుపఖనిజాన్ని ఎగుమతి చేయడానికి నిర్మించిన ఓడరేవు ఏది?
ఎ) మార్మగోవా బి) ట్యూటికోరిన్
సి) నవసేన డి) కొచ్చిన్

12. న్యూ మంగళూరు ఓడరేవు ఏనది ఒడ్డున ఉంది?
ఎ) జువారి బి) కావేరి
సి) గురుపూర్ డి) శరావతి

13. ముంబై ఓడరేవు రద్దీ తగ్గించడానికి ఏ ఓడరేవును అభివృద్ధి చేశారు?
ఎ) మార్మగోవా బి) న్యూమంగళూరు
సి) నవసేన డి) కాండ్లా

14. దేశంలో మొదటి కార్పొరేట్ ఓడరేవు ఏది?
ఎ) ట్యూటికోరిన్ బి) కొచ్చిన్
సి) న్యూమంగుళూరు డి) ఎన్నోర్

15. విస్తీర్ణ పరంగా భారత్‌లో రెండో అతిపెద్ద ఓడరేవు ఏది?
ఎ) విశాఖపట్నం బి) చెన్నై
సి) కోల్‌కతా డి) కాండ్లా

16. చెన్నై ఓడరేవుకు ఉత్తర, దక్షిణాలుగా ఉన్న అంతర్జాతీయ ఓడరేవులు ఏవి?
ఎ) ఎన్నోర్, కొచ్చిన్ బి) పారాదీప్, ట్యూటికోరిన్
సి) ఎన్నోర్, ట్యూటికోరిన్ డి) పారాదీప్, కొచ్చిన్

17. తూర్పుతీరంలో విస్తీర్ణ పరంగా అతిపెద్ద ఓడరేవు ఏది?
ఎ) కోల్‌కతా బి) పారాదీప్
సి) విశాఖపట్నం డి) చెన్నై

18. కిందివాటిలో ముత్యాల పరిశ్రమ ఆధారంగా నిర్మించిన ఓడరేవు ఏది?
ఎ) ఎన్నోర్ బి) ట్యూటికోరిన్
సి) మార్మగోవా డి) కొచ్చిన్

19. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన మొదటి ఓడరేవు ఏది?
ఎ) ముంబై బి) చెన్నై
సి) కాండ్లా డి) కోల్‌కతా

20. అంతర్జాతీయ ఓడరేవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏది?
ఎ) మహారాష్ట్ర బి) కర్ణాటక
సి) పశ్చిమబెంగాల్ డి) తమిళనాడు

21. 'గేట్ వే ఆఫ్ ఈస్ట్ ఇండియా' అని ఏ ఓడరేవును పేర్కొంటారు?
ఎ) పారాదీప్ బి) విశాఖపట్నం
సి) చెన్నై డి) కోల్‌కతా

22. జాతీయ జల రహదారి -2 ని ఏ నదిపై ప్రకటించారు?
ఎ) గంగా బి) గోదావరి
సి) బ్రహ్మపుత్ర డి) నర్మద

23. జాతీయ జలరహదారి-మేయే రాష్ట్రాల మీదుగా పోతుంది?
ఎ) పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్
బి) బీహార్, మధ్యప్రదేశ్, హరియాణా
సి) ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్
డి) పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్

24. 1911లో దేశంలో తొలి విమానం ఏ రెండు ప్రాంతాల మధ్య నడిపారు?
ఎ) కరాచీ- అలహాబాద్ బి) అలహాబాద్- నాయిని
సి) నాయిని- కోల్‌కతా డి) కోల్‌కతా - ముంబై

25. కచ్ సింధుశాఖలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ఓడరేవు ఏది?
ఎ) కాండ్లా బి) ఎన్నోర్
సి) పారాదీప్ డి) ట్యూటికోరిన్

26. జాతీయ జలరహదారి -3ని ఏ రాష్ట్రంలో ప్రకటించారు?
ఎ) అసోం బి) కేరళ
సి) ఆంధ్రప్రదేశ్ డి) ఒడిశా

27. జాతీయ జలరహదారి -6ని ఏ ప్రాంతాల మధ్య ప్రకటించారు?
ఎ) చార్‌ఖాటియా-ధర్మా బి) వజీరాబాద్- విజయవాడ
సి) కాకినాడ- పుదుచ్చేరి డి) లకీంపూర్ - బాంగ

28. జాతీయ జలరహదారి -4ను ఏ రాష్ట్రాల్లో ప్రకటించారు?
ఎ) ఒడిశా బి) అసోం
సి) కేరళ, కర్ణాటక డి) ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి

29. జాతీయ జలరహదారి -5ను ఏ రాష్ట్రంలో ప్రకటించారు?
ఎ) ఒడిశా బి) అసోం
సి) పశ్చిమబెంగాల్ డి) గోవా

30. జాతీయ జలరహదారి -5ను ఏ నదుల డెల్టా వ్యవస్థలో ప్రకటించారు?
ఎ) దామోదర్, హుగ్లీ బి) మహానది, గోదావరి
సి) బ్రాహ్మణీ, మహానది డి) గోదావరి, వంశధార

31. దేశంలో నదీఆధార అంతర్జాతీయ ఓడరేవు ఏది?
ఎ) నవసేన బి) కాండ్లా
సి) కొచ్చిన్ డి) కోల్‌కతా

32. ఓడరేవులు అవి ఉన్న రాష్ట్రాలకు సంబంధించి కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) ట్యూటికోరిన్- పశ్చిమ బెంగాల్ బి) కాండ్లా- గుజరాత్
సి) పారాదీప్- ఒడిశా డి) నవసేన - మహారాష్ట్ర

33. ఈ కిందివాటిలో పాక్-పశ్చిమ జల రహదారి మార్గంలో ఉన్న ఓడరేవు ఏది?
ఎ) నవసేన బి) ముంబై
సి) కొచ్చిన్ డి) కాండ్లా

34. ఎన్నోర్ ఓడరేవు ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) గుజరాత్ బి) మహారాష్ట్ర
సి) ఒడిశా డి) తమిళనాడు

35. దేశంలో అత్యంత సురక్షితమైన ఓడరేవు ఏది?
ఎ) కోల్‌కత బి) విశాఖపట్నం
సి) నోయిడా డి) చెన్నై

36. ఇండియన్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) న్యూఢిల్లీ బి) ముంబై
సి) నోయిడా డి) చెన్నై

37. దేశంలో నదుల ద్వారా అత్యధిక జల రవాణా కలిగిన రాష్ట్రం ఏది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) పశ్చిమ బెంగాల్
సి) కేరళ డి) గుజరాత్

38. దేశంలో ఎన్.డబ్ల్యు-1 (జాతీయ జల రహదారి-1) ఏయే ప్రాంతాల మధ్య ఉంది?
ఎ) సాదియా - దుబ్రి బి) కాకినాడ- పుదుచ్చేరి
సి) హాల్దియా- అలహాబాద్ డి) కొల్లం- కొత్తపురం

39. అరేబియా 'సముద్రపు రాణి' అని దేన్ని పిలుస్తారు?
ఎ) మార్మగోవా ఓడరేవు బి) న్యూ మంగళూరు ఓడరేవు
సి) కొచ్చిన్ ఓడరేవు డి) నవసేన ఓడరేవు

40. దేశంలో అతి పురాతన కృత్రిమ ఓడరేవు ఏది?
ఎ) నవసేన బి) చెన్నై
సి) ఎన్నోర్ డి) కాండ్లా

41. జాతీయ జలరహదారి -6ను ఏ నదీవ్యవస్థపై ప్రకటించారు?
ఎ) బ్రహ్మపుత్ర బి) గంగా
సి) బారకార్ డి) తపతి

42. యుద్ధనౌకలు, జలాంతర్గాములను తయారు చేసే నౌక నిర్మాణ కేంద్రం ఎక్కడ ఉంది?
ఎ) హిందుస్థాన్ షిప్‌యార్డ్ బి) మజగావ్ డాక్ షిప్‌యార్డ్
సి) గార్డెన్ రిచ్ వర్క్‌షాప్ డి) కొచ్చిన్ షిప్‌యార్డ్

43. ఏ నౌక నిర్మాణ కేంద్రంలో లాంచీలను తయారు చేస్తారు?
ఎ) కొచ్చిన్ షిప్‌యార్డ్ బి) హిందుస్థాన్ షిప్‌యార్డ్
సి) గోవా షిప్‌యార్డ్ డి) గార్డెన్ రిచ్ వర్క్‌షాప్

44. యుద్ధనౌకల రిపేరింగ్ జరిగే కేంద్రం ఏది?
ఎ) హిందుస్థాన్ షిప్‌యార్డ్ బి) మజగావ్ డాక్ షిప్‌యార్డ్
సి) కొచ్చిన్ షిప్‌యార్డ్ డి) గార్డెన్ రిచ్ వర్క్‌షాప్

45. కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) అన్నాదురై అంతర్జాతీయ విమానాశ్రయం - చెన్నై
బి) ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం - ముంబై
సి) సంగనేశ్వర్ అంతర్జాతీయ విమానాశ్రయం - మంగళూరు
డి) గురురాందాస్ అంతర్జాతీయ విమానాశ్రయం - అమృతసర్

46. 'సేతు సముద్రం కెనాల్ ప్రాజెక్ట్' కిందివాటిలో వేటిని కలుపుతుంది?
ఎ) గల్ఫ్ ఆఫ్ కచ్ పాక్ జలసంధి
బి) గల్ఫ్ ఆఫ్ మన్నార్, పాక్ జలసంధి
సి) గల్ఫ్ ఆఫ్ కచ్, గల్ఫ్ ఆఫ్ మన్నార్
డి) గల్ఫ్ ఆఫ్ మన్నార్, న్యూమూర్ దీవులు

47. ఆసియా ఖండంలోనే 'గ్రీన్ ఫీల్డ్ ఓడరేవు' ఏది?
ఎ) ఎన్నోర్ బి) ట్యూటికోరిన్
సి) కృష్ణపట్నం డి) గంగవరం

48. ప్రస్తుతం మనదేశంలో అంతర్జాతీయ స్థాయి పొందిన ఓడరేవులు ఎన్ని ఉన్నాయి?
ఎ) 13 బి) 15
సి) 17 డి) 21

49. కిందివాటిలో తూర్పుతీరంలో లేని ఓడరేవు ఏది?
ఎ) పారాదీప్ బి) ఎన్నోర్
సి) ట్యూటికోరిన్ డి) పోర్ట్‌బ్లెయిర్

50. దేశంలో ఓడరేవులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏది?
ఎ) మహారాష్ట్ర బి) తమిళనాడు
సి) ఆంధ్రప్రదేశ్ డి) కేరళ

51. జతపరచండి?

అంతర్జాతీయ విమానాశ్రయం	ప్రాంతం
i) వి.డి. సావర్కర్	a) అహ్మదాబాద్
ii) సర్దార్ వల్లభాబారు పటేల్	b) గువాహటి
iii) నేతాజీ సుభాష్ చంద్రబోస్	c) పోర్ట్‌బ్లెయిర్
iv) లోకప్రియ గోపినాథ్ బార్డొలి	d) కోల్‌కతా

ఎ) i-b, ii-d, iii-a, iv-c
బి) i-b, ii-a, iii-c, iv-d
సి) i-c, ii-a, iii-d, iv-b
డి) i-a, ii-a, iii-d, iv-b

52. తులిహాల్ అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
ఎ) గువాహటి బి) అమృతసర్
సి) ఇంఫాల్ డి) భువనేశ్వర్

సమాధానాలు :

1.సి	2.ఎ	3.డి	4.బి	5.డి	6.డి
7.సి	8.బి	9.సి	10.డి	11.ఎ	12.సి
13.సి	14.డి	15.బి	16.సి	17.డి	18.బి
19.సి	20.డి	21.డి	22.సి	23.డి	24.బి
25.ఎ	26.బి	27.డి	28.డి	29.ఎ	30.సి
31.డి	32.ఎ	33.సి	34.డి	35.బి	36.సి
37.బి	38.సి	39.సి	40.బి	41.సి	42.బి
43.సి	44.డి	45.సి	46.బి	47.సి	48.ఎ
49.డి	50.ఎ	51.సి	52.సి		

- మానస



నావికాదళంలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

భారత నావికాదళం ఎడ్యుకేషన్ బ్రాంచీలో షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), పర్మినెంట్ కమిషన్ లాజిస్టిక్ బ్రాంచీలో ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ఎంఏ ఇంగ్లిష్, ఎమ్మెస్సీ మ్యాథ్స్/ ఫిజిక్స్, బీఈ/ బీటెక్ అభ్యర్థులకు అవకాశం
- షార్ట్ సర్వీస్, పర్మినెంట్ కమిషన్ లో ఆఫీసర్ ఉద్యోగాలు
- చివరితేదీ ఫిబ్రవరి 10

వివరాలు : జనవరి 2019 కోర్సు ప్రవేశాల కోసం ఈ ప్రకటనను విడుదల చేసింది. ఈ కోర్సును కేరళలోని ఎజిమల ఇండియన్ నేవల్ అకాడమీలో నిర్వహిస్తారు.

- **వయస్సు** : బ్రాంచీల వారీగా..
- **ఎడ్యుకేషన్** : 1994, జనవరి 2 నుంచి 1998, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి. పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు.
- **లాజిస్టిక్స్** : 1994, జనవరి 2 నుంచి 1999, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి. పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

ఎస్ఎస్‌సీ (ఎడ్యుకేషన్) :

- ఖాళీల సంఖ్య - 4
- ఎమ్మెస్సీ (ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్)తోపాటు బీఎస్సీలో మ్యాథ్స్ చదివి ఉండాలి.
- ఖాళీల సంఖ్య - 5
- **అర్హతలు** : ఎమ్మెస్సీ మ్యాథ్స్/ ఆపరేషనల్ రిసెర్చ్‌తోపాటు బీఎస్సీలో ఫిజిక్స్ చదివి ఉండాలి.
- ఖాళీల సంఖ్య - 1
- **అర్హతలు** : ఎంఏ ఇంగ్లిష్ ఉత్తీర్ణత.
- ఖాళీల సంఖ్య - 5
- **అర్హతలు** : బీఈ/ బీటెక్ (ఈసీఈ/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ లేదా ఈఐ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్
- ఖాళీల సంఖ్య - 3
- **అర్హతలు** : మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/ బీటెక్
- పర్మినెంట్ కమిషన్ (లాజిస్టిక్స్) - 20 ఖాళీలు
- **అర్హతలు** : బీఈ/బీటెక్ ఏదైనా విభాగం లేదా ఎంబీఏ లేదా బీఎస్సీ/బీకాం (ఐటీ)తోపాటు పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్స్/లాజిస్టిక్స్ లేదా సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్/మెటీరియల్ మేనేజ్‌మెంట్ లేదా ఎంసీఏ/ఎమ్మెస్సీ (ఐటీ).

నోట్ : పై అర్హత పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి.

శారీరక ప్రమాణాలు :

- **ఎత్తు** : పురుషులు - 157 సెం.మీ, మహిళలు - 152 సెం.మీ. ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.

పదోన్నతులు, పేస్కేల్ :

- సబ్‌లెఫ్టినెంట్ హోదా నుంచి కమాండర్ వరకు పదోన్నతి పొందవచ్చు.
- **సబ్‌లెఫ్టినెంట్ పేస్కేల్** : రూ. 56,100 - 1,10,700.
- **షార్ట్ సర్వీస్ కమిషన్** : ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుకు మొదట 12 ఏండ్ల కాలానికి ఎంపికచేస్తారు. ఆ తర్వాత అవసరాన్నిబట్టి మరో రెండేండ్లు పొడిగిస్తారు.

ఎంపిక ప్రక్రియ :

- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అకడమిక్ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి బెంగళూరు/ భోపాల్ లేదా కోయంబత్తూరు, విశాఖపట్నం కేంద్రాల్లో మే 18 - జూన్ 18 మధ్య ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది.
- ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు ఐదురోజుల పాటు ఉంటాయి.
- స్టేజ్ - 1 ఒక్కరోజు, స్టేజ్ -2 నాలుగు రోజులు నిర్వహిస్తారు.
- స్టేజ్ - 1లో ఇంటెలిజెన్స్ టెస్ట్, పీపీ, డిస్కషన్ టెస్ట్‌లు ఉంటాయి. వీటిలో అర్హత సాధించినవారిని స్టేజ్ -2కు అనుమతిస్తారు.
- స్టేజ్ -2లో సైకలాజికల్ టెస్టింగ్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూలు ఉంటాయి. వీటిలో అర్హత సాధించినవారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.
- వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపికచేస్తారు.
- **శిక్షణ** : ఎంపికైన అభ్యర్థులకు సబ్ లెఫ్టినెంట్ హోదాలో శిక్షణనిస్తారు. ఈ శిక్షణ 2018, డిసెంబర్ చివరివారంలో ప్రారంభమవుతుంది. 22 వారాలపాటు శిక్షణనిస్తారు.
- **దరఖాస్తు** : ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ** : ఫిబ్రవరి 10
- **వెబ్‌సైట్** : www.joinindiannavy.gov.in



ఆకర్షణకు కారణం తెలుసా....



మెదడుకు చెందిన 'కిస్‌పెప్టిన్' హార్మోన్ పనితీరు సెక్సువల్ బిహేవియర్‌కి, ఆపోజిట్ సెక్స్ పట్ల ఆకర్షణకు ప్రధాన కారణమని తెలుస్తోంది. సైకోసెక్సువల్ డిజార్డర్స్ చికిత్సలో భాగంగా ఈ హార్మోన్ తోడ్పడుతుందని శాస్త్రజ్ఞుల తాజా అధ్యయనంలో వెల్లడైంది. రజస్వలకు, సంతానోత్పత్తి నియంత్రణకు కీలకమైన 'కిస్‌పెప్టిన్' మెదడులో కీలకమైన మాలిక్యూల్‌గా ఇప్పటికే గుర్తించడమైంది. ఎలుకల్లో చేసిన ప్రయోగంలో భాగంగా బ్రెయిన్‌లోని హైపోథాలమస్ న్యూరాన్ల సబ్‌సెట్ సెక్సువల్ బిహేవియర్‌కి, ఆకర్షణకు కారణంగా ఉందని జర్మనీలోని సార్‌లాండ్ యూనివర్సిటీ అధ్యాపకుడు ఉల్‌రిచ్ బోమ్ వెల్లడించారు. హైపోసెక్సువల్ డిజైర్ డిజార్డర్స్ చికిత్సకు వీరు చేసిన ప్రయోగం తోడ్పడుతుందని తెలిపారు.

ఐక్యూలో ఐన్‌స్టీయిన్, హాకింగ్ సరసన

భారతీయ సంతతి బాలుడు



యుకెలో నివసిస్తున్న 10ఏళ్ల భారతీయ సంతతి బాలుడు మెన్సా ఐక్యు పరీక్షలో ఈ దశాబ్దంలోనే అత్యధిక స్కోరు సాధించి రికార్డు సృష్టించాడు. మహిగా ముద్దుగా పిలుచుకునే మెహల్ గార్గ్ ఐక్యు పరీక్షలో ఐన్‌స్టీయిన్, హాకింగ్‌ను అధిగమించి 162 మార్కులను పొందాడు.వీరికన్నా మహి స్కోరు రెండు మార్కులు ఎక్కువగానే ఉండటంతో ప్రపంచంలోని అత్యధిక మార్కులు పొందిన ఒక శాతం మందిలో ఒకరుగా నమోదయ్యారు. 2017లో 162 మార్కులను సాధించిన తన సోదరుడు 13ఏళ్ల ధ్రువ్ గార్గ్ స్కోర్‌ను ఈ ఏడాది సాధించి సోదరునికంటే తానేమీ తక్కువకాదని నిరూపించాడు. దక్షిణ ఇంగ్లాండులోని ష్యూపిల్ ఆఫ్ రీడింగ్ బాయ్స్ గ్రామర్ స్కూలులో చదువుతున్న మహి 162 మార్కులతో ఐక్యు సొసైటీ అయిన మెన్సాలో సభ్యుడయ్యాడు. మెహల్‌లోని నిర్వచనాలు, లెక్కలు,భాషా నైపుణ్యం,సెన్స్ ఆఫ్ లాజిక్ మెహల్‌ను అత్యధిక స్కోరు సంపాదించేందుకు దోహదపడినట్లు అతని తల్లి పేర్కొన్నారు.

బడ్జెట్ అంటే...ఇలా



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ సమీపిస్తున్నది. వచ్చే నెల 1న పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ దీన్ని ప్రకటించనుండగా, రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను ఈ బడ్జెట్‌ను ప్రవేశపెడు తున్నారు. నరేంద్ర మోడీ సర్కారు ఐదేండ్ల పాలనలో ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్. త్వరలో ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలున్న క్రమంలో ఈసారి బడ్జెట్ ప్రాధాన్యతను సంతరించుకోగా, దేశ చరిత్రలోనే అతిపెద్ద సంస్కరణగా అభివర్ణిస్తున్న వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత వస్తున్న తొలి బడ్జెట్ కూడా కావడంతో సహజంగానే అందరి చూపు దీనిపైనే ఉన్నది. అలాంటి ఈ కేంద్ర బడ్జెట్‌లో ఏయే అంశాలు కీలకమో, అసలు బడ్జెట్ ప్రక్రియ ఎలా ఉంటుందో సంక్షిప్తంగా తెలుసుకుందాం..

ప్రభుత్వ ఆర్థిక సంబంధిత అంశాల సమగ్ర నివేదిక స్వరూపమే బడ్జెట్. ప్రతీ సంవత్సరం కేంద్రానికైనా, రాష్ట్రాలకైనా ఇది అత్యంత ఆవశ్యకం. నిర్ణీత ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-మార్చి)లో ఆయా శాఖల అభివృద్ధికి, ప్రజా సంక్షేమ అవసరాలకు బడ్జెట్ ద్వారా నిధులను కేటాయించే ప్రభుత్వాలు.. నిర్వహణ వ్యయం కోసం ఆదాయ వనరులపైనా ఈ బడ్జెట్ ద్వారానే దృష్టి సారిస్తాయి. ఈ క్రమంలోనే కొన్ని పన్నులను పెంచే సర్కారు.. ప్రజాహితార్థం, వివిధ వ్యాపార, పారిశ్రామిక ప్రయోజనార్థం మరికొన్ని పన్నులనూ తగ్గిస్తుంది. ఇక ఈసారి జైట్లీ ప్రసంగంలో ప్రధానాంశాల విషయానికొస్తే..

ప్రత్యక్ష, పరోక్ష పన్నులు :

వ్యక్తులపైనా, సంస్థలపైనా నేరుగా విధించే పన్నులే ప్రత్యక్ష పన్నులు. ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను, కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్)లు ఈ తరహావే. ఇక వస్తువులు, సేవలపై వసూలు చేసే పన్నులను పరోక్ష పన్నులు అంటారు. వస్తువులు, సేవలను వినియోగదారులు కొన్నప్పుడు ఆ సొమ్ము ద్వారా ఇవి సమకూరుతాయి. జీఎస్టీ, ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలు ఈ కోవలోనివే.

జీఎస్టీ: ఒకే దేశం.. ఒకే మార్కెట్..

ఒకే పన్ను లక్ష్యంతో దేశవ్యాప్తంగా గతేడాది జూలై 1 నుంచి అమల్లోకి తెచ్చినదే జీఎస్టీ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఎక్సైజ్ సుంకం, సేవా పన్ను, విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తదితర పన్నెండుకుపైగా రకాల పన్నులను ఒక్కటిగా చేస్తూ పరిచయ మైనదే ఈ పరోక్ష పన్ను. 1,200లకుపైగా వస్తువులు, 500లకుపైగా సేవలపై దీన్ని వేస్తు న్నారు. 0, 5, 12, 18, 28 శ్లాబుల్లో ఈ పన్ను వసూళ్లు జరుగుతుండగా, విద్య, వైద్యం, తాజా కూరగాయలు, ఆహార పదార్థాలు తదితర కొన్ని ఉత్పత్తులు, సేవలను దీన్నుంచి మినహాయించారు. బంగారంపై 3 శాతం, ముడి వజ్రాలపై 0.25 శాతం చొప్పున ప్రత్యేక జీఎస్టీ ఉన్నది. గతంతో పోల్చితే ఈ పన్నువల్ల కొన్ని ఉత్పత్తులు, సేవలు భారమైపోగా, మరికొన్నింటి ధరలు తగ్గాయి.

కస్టమ్స్ సుంకం :

ఏవైనా వస్తువులు దేశంలోకి దిగుమతైనా లేక ఎగుమతైనా వాటిపై కస్టమ్స్ సుంకాన్ని విధిస్తారు. దిగుమతిదారులు, ఎగుమతిదారులు ఈ సుంకాలను చెల్లిస్తారు. సహజంగానే ఈ భారం కూడా వీటిని కొన్న వినియోగదారులపైనే పడుతుంది.

ద్రవ్యలోటు :

ప్రభుత్వ ఆదాయాన్ని (రుణాల ద్వారా పొందిన సొమ్ము మినహా) మించి మొత్తం ఖర్చులు దాటిపోతే దాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. వీటిలో రెవెన్యూ లోటు, ప్రాథమిక లోటు అంతర్భాగాలుగా ఉంటాయి.

ద్రవ్య విధానం :

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుసరించే ద్రవ్యపరపతి విధానమే ఇది. మార్కెట్‌లో ద్రవ్య చలామణిని బ్యాంకుల ద్వారా ఆర్బీఐ నియంత్రిస్తుంది. రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్ల సవరణ, నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్), చట్టబద్ధ ద్రవ్యనిష్పత్తి (ఎస్ఎల్ఆర్) తదితర మార్గాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టైన నగదు లావాదేవీలను పర్యవేక్షిస్తుంది.

ఆర్థిక విధానం :

బడ్జెట్ ద్వారా అమలుపరిచేదే ఈ ఆర్థిక విధానం. ఆదాయ, వ్యయాలపై ప్రభుత్వ చర్యలను ఇది ప్రతిబింబిస్తుంది.

ద్రవ్యోల్బణం :

పెరుగుతున్న ధరలనే ద్రవ్యోల్బణం అంటారు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఆర్బీఐ తమ ద్రవ్యవిధానాన్ని ఉపయోగిస్తుంది. ధరల నియంత్రణ కోసం ప్రభుత్వం కూడా ప్రయత్నాలు చేస్తూంటుంది. బడ్జెట్‌లో ఆయా రంగాలకు చేసే నిధుల కేటాయింపులు, పన్నుల సవరణలు ద్రవ్యోల్బణాన్నీ ప్రభావితం చేస్తాయి.

క్యాపిటల్ బడ్జెట్ :

షేర్లలో పెట్టుబడులు, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు, కార్పొరే షన్లకు, ఇతరత్రా వ్యవస్థలు, అవసరాలకు గాను కేంద్ర ప్రభుత్వం చేసే చెల్లింపుల సమాహారమే ఈ క్యాపిటల్ బడ్జెట్.

రెవెన్యూ బడ్జెట్ :

ప్రభుత్వ రెవెన్యూ వసూళ్లు, వ్యయాలతో కూడినదే ఈ రెవెన్యూ బడ్జెట్. రెవెన్యూ వసూళ్లను పన్ను, పన్నేతర ఆదాయంగా విభజించారు. ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను, ఎక్సైజ్, కస్టమ్స్, సేవా ఇతరత్రా ప్రభుత్వ సుంకాలను పన్ను ఆదాయంగా భావించవచ్చు. రుణాలపై వడ్డీ, పెట్టుబడులపై డివిడెండ్లు తదితర వాటిని పన్నేతర ఆదాయంగా చెప్పుకోవచ్చు.

పెట్టుబడుల ఉపసంహరణ :

ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయమే ఈ పెట్టుబడుల ఉపసంహరణ. ఆయా సంస్థల్లో ఉన్న వాటాలను క్యాపిటల్ మార్కెట్ల ద్వారా అమ్మి, ఆ నిధులను ఖజానాకు తరలిస్తుంది ప్రభుత్వం. బడ్జెట్‌లో ఈ పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలనూ ప్రకటిస్తుంది ఆర్థిక మంత్రిత్వ శాఖ.

ఆర్థిక బిల్లు :

దీన్నే ద్రవ్యబిల్లుగానూ అభివర్ణిస్తారు. కొత్త పన్నుల లెవీ, ప్రస్తుత పన్ను విధానంలో మార్పులు లేదా పార్లమెంట్ ఆమోదించిన వ్యవధిని మించి ప్రస్తుత పన్ను నిర్మాణాన్నే కొనసాగించడం కోసం ప్రభుత్వం చేసే ప్రతిపాదనలను ఈ బిల్లు ద్వారా పార్లమెంట్‌కు సమర్పిస్తారు. కేంద్ర బడ్జెట్ ప్రకటన తర్వాత వెనువెంటనే ఆర్థిక బిల్లును ప్రవేశపెడుతారు.

బడ్జెట్ అంచనాలు:

ఏదైనా మంత్రిత్వ శాఖకు లేదా పథకానికి బడ్జెట్‌లో కేటాయించే నిధుల్నే బడ్జెట్ అంచనాలు అంటారు. అవసరాలనుబట్టి అంచనాల్లో సవరణలనూ చేస్తారు. ఆయా శాఖలకు, పథకాలకు మరిన్ని నిధులనూ కేటాయిస్తూంటుంది.

మరికొన్ని :

కేంద్ర బడ్జెట్‌లో మరికొన్ని అంశాలూ కీలకమే. వోట్ ఆన్ అకౌంట్, ఎక్సెస్ గ్రాంట్లు, రీ-అప్రాప్రియేషన్లు, కట్ మోషన్లు, గిలెటిన్, ఏకీకృత నిధి, అగంతుక నిధి, పబ్లిక్ అకౌంట్ తదితర ప్రక్రియలూ కేంద్ర బడ్జెట్‌లో అంతర్భాగాలే.

సాధారణంగా కేంద్ర బడ్జెట్ అంటే అందరి దృష్టి దాని పైనే ఉంటుంది. ఎందుకంటే దాని ప్రభావం దేశ ప్రజలందరిపై ఉంటుంది. అందుకనే అందరూ ఈ విషయంపై ఆసక్తి చూపుతారు. అసలు ఎలా రూపుదిద్దుకుంటుంది, దానిని ఎవరు కసరత్తు చేస్తారు. బడ్జెట్ రూపకల్పనలో ఎవరు కీలక పాత్ర పోషిస్తారు. అసలు దీని వెనుక ఉండే వ్యక్తులెవరనే విషయం ఆసక్తిదాయకంగా ఉంటుంది.

కసరత్తు వెనక ఉన్న కీలక వ్యక్తులు వీరే..

హస్ముఖ్ అధియా



(ఆర్థిక కార్యదర్శి, ఆదాయ విభాగ కార్య దర్శి)

ఆర్థిక శాఖలో అత్యంత అనుభవశాలి. ఈయన చాలా బడ్జెట్‌లలో పాలుపం చుకున్నారు. అయితే ఈసారి ఈ కీలక బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. 1981 బ్యాచ్ గుజరాత్ క్యాడర్ ఐఏఎస్ అధికారి ఈయన. జీఎస్‌టీ అమలులో కీలక పాత్ర కూడా పోషించారు. అదే సమయంలో పెద్ద నోట్ల రద్దు అనంతరం తీసుకోవాల్సిన చర్యలు, పన్నుల చెల్లింపులను సులభతరం చేసే అంశాలు తదితరాలన్నీ ఆయన చేతుల మీదుగానే నడిచాయి. ఇక ప్రస్తుత బడ్జెట్ విషయంలోనూ ముఖ్య భూమికను పోషించనున్నారు.

అరవింద్ సుబ్రమణియన్



(ముఖ్య ఆర్థిక సలహాదారు)

బడ్జెట్‌కు ముందు వెలువడే ఆర్థిక సర్వే (29న)పై ఈయన ముద్ర స్పష్టంగా ఉండబోతోంది. బడ్జెట్‌ను ప్రభావితం చేసే ఆలోచనలు, చర్చలు, అంచనాలు ఇందులో ఉంటాయి. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి ఈయన ఎలాంటి ఆలోచనలు అందిస్తారో చూడాలి.

సుభాష్ చంద్ర గార్గ్



(ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి)

ప్రపంచబ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఈయనకుంది. వృద్ధి ఎలా పుంజుకునేలా చేయాలి. ప్రైవేటు పెట్టుబడులకు ఎలా ఊతమివ్వాలి, ఉద్యోగాలను ఎలా సృష్టించాలి.. అన్న విషయాలపై దృష్టి సారించనున్నారు. అది కూడా ద్రవ్య లోటు విషయంలో వెనక్కి తగ్గకుండా చేయాల్సిన బాధ్యతలే.

అజయ్ నారాయణ్ ఝా



(వ్యయాల విభాగం కార్యదర్శి)

1982 బ్యాచ్ మణిపూర్ క్యాడర్ ఐఏఎస్ అధికారి ఈయన. బడ్జెట్‌లో వ్యయాలను ఎలా అదుపులో ఉంచుకోవాలన్న విషయాలపై ఈయన సమన్వయం చేస్తారు. ఆర్థిక కమిషన్‌కు కార్యదర్శిగానూ నారాయణ్ సేవలు అందిస్తున్నారు.

నీరజ్ కుమార్ గుప్తా



(పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం కార్యదర్శి)

1981 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన నీరజ్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో ప్రభుత్వం తొలిసారిగా పెట్టుబడుల లక్ష్యాన్ని అధిగమించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సైతం ఇప్పటికే పలు వ్యూహాత్మక విక్రయాలకు అనుమతులు కూడా పొందారు. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణ విషయంలో ప్రభుత్వం మరింత పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించవచ్చు. దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థల్లో మెజారిటీ వాటాను అట్టే పెట్టి ఉంచుకోవాల్సిన తరుణంలో నిధుల సమీకరణ విషయంలో వినూత్న ఆలోచనలను తీసుకువచ్చే అవకాశం ఉంది.

రాజీవ్ కుమార్



(ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి)

బడ్జెట్‌కు ముందే ఆర్థిక సేవలు అంటే బ్యాంకింగ్ రంగం కోసం భారీ స్థాయి ప్రకటన చేసింది. రూ.2.11 లక్షల కోట్ల మూలధనాన్ని బ్యాంకుల్లోకి చొప్పించనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఇందుకు అనుగుణంగా చర్యలు ఉండొచ్చు. వీటి వెనక 1984 ఐఏఎస్ బ్యాచ్ అధికారి అయిన రాజీవ్ కృషి ఉండే అవకాశం ఉంది. బీమా, పింఛను రంగాల్లోకి మరింత మందిని తీసుకువచ్చే దిశగా కూడా రాజీవ్ దృష్టి సారించే అవకాశం లేకపోలేదు.

పన్ను రేట్లు తగ్గించాలి



పర్యాటకానికి ఊతమివ్వాలి

ఇది పరిశ్రమ విన్నపం

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్లతో పోటీపడేలా దేశీయ పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు పన్ను రేట్లపై ప్రభుత్వం పునఃపరిశీలన జరుపాల్సిన అవసరం ఉందని ఆ పరిశ్రమ ప్రతినిధులు ఉద్ఘాటించారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరికొద్ది రోజుల్లో తదుపరి (2018-19 ఆర్థిక సంవత్సర) సార్వత్రిక బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్ట నున్న నేపథ్యంలో వారు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. దేశంలో ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు సమ్మిళిత వృద్ధికి దోహదం చేస్తున్న కీలక చోదకాల్లో ఒకటైన పర్యాటక రంగానికి అనువైన వాతావరణాన్ని కల్పించాలని, సార్వత్రిక బడ్జెట్‌లో నరేంద్ర మోడీ ప్రభుత్వం సానుకూల విధానాలను ప్రకటిస్తే ఈ రంగానికి ఊతం లభిస్తుందని వారంటున్నారు.

ఆసియా ఖండంలోని థాయిలాండ్, మలేషియా, సింగపూర్ లాంటి అంతర్జాతీయ మార్కెట్లతో దేశీయ పర్యాటక రంగం పోటీపడా లంటే అంతర్జాతీయ రేట్లకు అనుగుణంగా సేవలను అందజేయాలని మేక్ మై ట్రిప్ వ్యవస్థాపకుడు, ఆ గ్రూపు సీఈవో దీప్ కల్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. థాయిలాండ్, మలేషియా, సింగపూర్ లాంటి దేశాల ఆతిథ్య రంగంలో పన్ను రేట్లు చాలా తక్కువగా ఉండటం వల్లనే అవి ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా ఆవిర్భవించగలిగాయన్నారు. ఈ దేశాలతో పోలిస్తే పర్యాటకులకు తక్కువ ధరలో సేవలను అందజేయడంలో భారత్ చాలా వెనుకబడి ఉన్న దని, కనుక దీనిని దృష్టిలో ఉంచుకుని దేశంలో మౌలిక వసతులను మెరుగుపర్చడంతో పాటు పర్యాటక రంగానికి మరిన్ని ప్రోత్సాహకాలను అందజేయాల్సిన అవసరం ఉందని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

కాగా, కాక్స్ అండ్ కింగ్స్ గ్రూపు సీఈవో పీటర్ కేర్కర్ కూడా ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హోటళ్లలో రూ.2,500 నుంచి రూ.7,500 అద్దె కలిగిన గదులకు ప్రస్తుతం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేటు 18 శాతంగా ఉన్నదని, ఇతర దేశాల్లోని హోటళ్లలో వసూలు చేస్తున్న అద్దెలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువని ఆయన పేర్కొంటూ.. దేశీయ పర్యాటకరంగా నికి ఊతమిచ్చేందుకు జీఎస్టీ రేటును తగ్గించ డంతోపాటు సార్వత్రిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభు త్వం మరికొన్నిచర్యలు చేపట్టాలని సూచించారు.

హెచ్-1బీ కొత్త బిల్లుతో

భారతీయులకు ముప్పే!



బెంగళూరు : వార్షికంగా హెచ్-1బీ వీసాల కోటాను పెంచాలంటూ ఇద్దరు రిపబ్లికన్లు అమెరికా సెనేట్‌లో ప్రవేశ పెట్టిన కొత్త బిల్లు వల్ల భారతీయ ఐటీ కంపెనీలకు, భారత ఐటీ నిపుణులకు ఉపయోగకరం కాదని నిపుణులు వెల్లడి స్తున్నారు. అమెరికన్ టెక్ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ లాంటివి ఈ బిల్లుకు మద్దతిచ్చాయి కూడా. ఆరిన్ హాచ్, జెఫ్ ఫ్లాక్ ప్రవేశపెట్టిన బిల్లు "ది ఇమ్మి గ్రేషన్ ఇన్నోవేషన్ యాక్ట్-2018"లో హెచ్-1బీ వీసాల కోటాను ఏడాదికి 65వేల నుంచి 85వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో పాటు ఈ కొత్త బిల్లు హెచ్-1బీ వీసా ప్రోగ్రా మ్‌లో సంస్కర ణలు కోరుతోంది. వీసా ఫీజులను పెంచి, ఆ నిధులను సైన్స్, టెక్నాలజీ, ఇంజ నీరింగ్, మ్యాథమేటిక్స్ ఎడ్యుకేషన్ శిక్షణకు వాడాలంటూ ప్రతిపాదిస్తోంది.

ఈ బిల్లు కనుక పాస్ అయితే, దేశీయ ఐటీ సర్వీసెస్ కంపెనీలకు పెద్ద ఎదురుదెబ్బ అని నిపుణులు చెబుతు న్నారు. ఎక్కువ వేతనం, మెదడుపై పనిభా రాన్ని పెంచి, ముప్పు తెచ్చేస్తుందని పేర్కొంటున్నారు. సాధారణంగా గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ లాంటి కంపెనీలు హెచ్-1బీ వీసాలతో లబ్ధి పొందుతూ ఉంటాయని, కాబట్టి వారు మద్దతు ఇవ్వ డం సాధారణమని చెప్పారు. అదే కనీసం వేతనం లక్ష డాలర్లకు పెంచితే, ఈ కంపెనీలు ప్రతిభావంతులను ఆకర్షించు కుంటాయని బెంగళూరుకు చెందిన గ్లోబల్ టెక్నాలజీ సంస్థల రిక్రూటర్ హెడ్ హంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో క్రిష్ లక్ష్మీకాంత్ తెలిపారు. కానీ కనీస వేతనం పెంపుతో, దేశీయ ఐటీ కంపెనీలు టీసీఎస్, విప్రోల నుంచి అమెరికాకు వెళ్లే వారు తగ్గిపోతారని పేర్కొన్నారు. కంపెనీలు అక్కడే నియామ కాలు చేపడతాయని చెప్పారు. దీంతో ఈ బిల్లు భారత్‌కు ఎంతమాత్రం మంచిది కాదని తెలిపారు.

ఫిబ్రవరి 9-12 తేదీల్లో

మోడీ పశ్చిమాసియా పర్యటన

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 9 నుంచి 12వ తేదీ వరకు పశ్చిమాసియాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పాలస్తీనాలో చరిత్రాత్మక పర్యటన జరపనున్నారు. యూఏఈ, ఒమన్‌లో కూడా మోడీ పర్యటించనున్నారు. భారత ప్రధానమంత్రి పాలస్తీనాలో జరుపుతున్న మొట్టమొదటి పర్యటన ఇది. 2015 ఆగస్టు తరువాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో మోడీ పర్యటించడం ఇది రెండోసారి. "ఈ పర్యటనలో భాగంగా మోడీ ఆయా దేశాల నాయకులతో పరస్పర ప్రయోజనం కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. ఇతర కార్యక్రమాలలో పాల్గొననున్నారు" అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ ఈ నెలలో భారత్‌లో పర్యటించిన నేపథ్యంలో మోడీ పాలస్తీనాలో పర్యటిస్తున్నారు. దుబాయ్‌లో ఆరవ ప్రపంచ గవర్నమెంట్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ ప్రసంగించనున్నారు. "గౌరవ అతిథి" హోదాలో భారత్ ఈ సమావేశంలో పాల్గొంటోంది.

చల్లారని తమిళ సంఘాల ఆగ్రహం!

శంకరమఠం ముట్టడికి తమిళ విద్యార్థి సంఘాల యత్నం.. ఉద్రిక్తత

చెన్నై : కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామిపై తమిళ సంఘాల ఆగ్రహం చల్లారడం లేదు. తమిళతల్లి గీతాన్ని ఆయన అవమానించారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కంచిలోని శంకరమఠం ఒక ప్రకటన విడుదల చేసింది. తమిళతల్లి గీతం ఆలాపిస్తున్నప్పుడు విజయేంద్ర సరస్వతి ధ్యానంలో ఉండి నిలబడలేకపో యారని, అది తమిళ భాషను అవమానించినట్టుగా భావించవద్దని శంకర మఠం కోరింది. కానీ జాతీయగీతం ఆలాపన సమయంలో గౌరవంగా లేచి నిలబడిన విజయేంద్ర సరస్వతి.. తమిళతల్లి గీతాన్ని ఆలాపిస్తున్నప్పుడు లేచినిలడకపోవడం.. అవమానించడమేనని పలు సంఘాలు ఆరోపి స్తున్నాయి. ఈ క్రమంలోనే కాంచీపురంలోని శంకరమఠం ముట్టడికి తమిళ విద్యార్థి సంఘాలు ఆదివారం ప్రయత్నించాయి. ముందస్తు సమాచారం లేకుండా విద్యార్థి సంఘాలు మఠం ముందు గుమికూడటంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆందోళనకారుల నడుమ తోపులాట జరిగింది. ఆధ్యాత్మికతకు నిలయమైన శంకరమఠం ముట్టడికి ప్రయత్నించడం చర్చనీయాంశంగా మారింది.

కెన్యాలో చైనా మరిన్ని పెట్టుబడులు

నైరోబీ : కెన్యాలో వాణిజ్య వాతావరణం అనుకూలంగా ఉన్నందున మరిన్ని పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను, వాణిజ్యవేత్తలను చైనా దౌత్యాధికారి గుయిసీ కోరారు. కెన్యాలో చైనా రాయబార కార్యాలయంలో ఆర్థిక, వాణిజ్య విభాగం కౌన్సిలర్‌గా ఆయన పనిచేస్తున్నారు. దేశ అధ్యక్ష పదవికి ఎన్నికలు ముగిసినందున ఇప్పుడు పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని, అందువల్ల మరిన్ని పెట్టుబడులు పెట్టవచ్చునని ఆయన కోరారు. చైనా, కెన్యా సంబంధాలలో చైనా వాణిజ్య గ్రూప్ ప్రధానపాత్ర వహిస్తోంది. కెన్యా ఆర్థిక సంస్థలు చైనా వాణిజ్యవేత్తలకు మరింతగా సహకారం అందించాలని ఆయన కోరారు. స్టాండర్డ్ చార్టెడ్ బ్యాంకు సీఈఓ లామిన్ మంజంగ్ మాట్లాడుతూ, బెల్ట్ అండ్ రోడ్డు ఇనిషియేటీవ్ ప్రాజెక్టులో కీలక పాత్ర వహించనున్నట్టుగా తెలిపారు. కెన్యా అభివృద్ధిలో చైనా ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నదని తాము గుర్తించినట్టు ఆయన చెప్పారు.

రైతుల ఆదాయం

రెట్టింపు సాధ్యమేనా?

న్యూఢిల్లీ : 2018 బడ్జెట్ విషయమై అన్ని వర్గాల్లోనూ చర్చలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా, రైతుల ఆదాయం రెట్టింపు చేయడమెలా అనే అంశంపై భిన్న పార్శ్వాల్లో, కోణాల్లో చర్చలు జరుగుతున్నాయి. దేశీయ ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాల ఆదాయం పెరుగుదలకు దోహదపడిన తరహాలో వ్యవసాయ రంగంలో సంస్థాగత సంస్కరణలు అమలుకు నోచుకోలేదు ఉత్పాదకతకు అనుగుణంగానూ మార్కెటింగ్ విధానాలూ అమలు కాలేదు. అధిక మద్దతు ధర ప్రకటన కారణంగా వాణిజ్య ప్రక్రియలో సంభవించిన మార్పులు సాధారణ ద్రవ్యోల్బణానికి దోహదపడ్డాయి. ప్రముఖ ఆర్థికవేత్తగా గుర్తింపు పొందిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రెండు సార్లు అధికారంలో ఉన్న సమయంలో ఇదే సంభవించింది ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం డైలమాలో పడిన స్థితిలో ఉంది మార్కెట్లో ఆహార ధరల పతనం ప్రభావం రైతు ఆదాయాలు పతనం చెందడానికి కారణమైనాయి. గడచిన ఐదు సంవత్సరాల్లో రైతు వార్షిక నిజ ఆదాయం 1.36 శాతం వంతున పతనం చెందినట్లు నీతి అయోగ్‌కు చెందిన రమేష్ చంద్ అంచనా. స్థూల ఆర్థిక స్థిరత్వానికి ముప్పుగా ధరల పెరుగుదల నిలిచినందునే ఉత్పత్తి మీద నుంచి సంస్కరణల దిశగా చర్యలు వేసేందుకు పాలకులు ప్రయత్నించడానికి కారణగా చెప్పాలి.

రైతుల ఆదాయం రెట్టింపు విషయమై అశోక్ దళవాయి కమిటీ చేసిన సిఫారసులు పరిశీలనకు నిలుస్తున్నాయి. పరిష్కార అవకాశాలను ఆయన నాలుగు విభాగాలుగా వర్గీకరించారు. అవి భూమి, మార్కెట్‌కు చేరువకావడం, ఉత్పాదకత పెరుగుదల, అత్యధిక దిగుబడులు లభించే పంటలు, వ్యవసాయేతర కార్యకలాపాలకు మరలడం. భూమితో పరిశీలన మొదలు పెడితే 86శాతం రైతుల అధీనంలో కేవలం రెండు హెక్టార్ల భూమి మాత్రమే ఉంది. మరో మాటలో చిన్న కమతాలు ఎక్కువగా ఉన్నాయి. ఆధునిక సాంకేతిక సదుపాయాలను ఉపయోగించుకోలేనంతటి తక్కువ స్థాయిలో కమతాల విస్తీర్ణం ఉంది. దీంతో సంప్రదాయేతర వనరుల వినియోగం మీద రైతుల దృష్టి పడింది. సహజంగానే చిన్న రైతులు పేదలుగా ఉన్నారు. ఈపరిస్థితి వారిని అదనపు రిస్కు తీసుకునే సాహసం చేయనీయడం లేదు. లీజు లేదా కౌలు విధానాల్లో లోపాల కారణంగా కనీసంగా ఐదు నుంచి పది శాతం సాగు భూమి నిరుపయోగంగా ఉండిపోతోంది. మౌఖిక కౌలుదారుకు ఏ ప్రభుత్వ రంగ బ్యాంకరూ ఆసక్తి చూపడం లేదు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల మీదనే ఆధారపడాల్సి వస్తోంది. రైతుల్లో రాన్రాను పంటల సాగు,ధరల నిర్ణయంలో నైపుణ్యం తగ్గుతున్న పరిస్థితి కానవస్తోంది.

వ్యవసాయం మీద ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఆసక్తి చూపడం లేదు. గ్రామీణ యువత కేవలం 1.2శాతం మాత్రమే వ్యవసాయం మీద ఆసక్తి చూపుతున్నారని ప్రధాన్ రూపొందించిన 2017 వార్షిక విద్యానివేదిక సర్వే (ఏఎస్ఈఆర్) వెల్లడిస్తోంది. మార్కెట్ అందుబాటును పరిశీలిస్తే వ్యవసాయ మార్కెట్ కమిటీలు గుత్తాధిపత్య మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి. మార్కెట్ ధరలో రైతుల వాటా తక్కువగా ఉంటోందని దళవాయి కమిటీ ప్రస్తావించింది. ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన ఈనామ్ విధానం భారీ కొనుగోలుదారులకు మేలు కలిగించేదిగా ఉంది దీని వల్ల చిన్న రైతులకు అంతగా మేలు జరిగే పరిస్థితి లేదు. అంతర్జాతీయంగా పోల్చిచూసినపుడు దేశీయ పంటల దిగుబడులు తక్కువగా ఉంటున్నాయి. వర్షాధారిత సాగు ఏరియాల్లో హెక్టారు ఉత్పాదకత రూ.35,342గా ఉండగా సాగునీటి వసతి ఉన్న ఏరియాల్లో అది రూ.56,510గా ఉంది. ఇలాంటి స్థితిలో రైతుల ఆదాయం రెట్టింపు చేయాలంటే ఉత్పాదకను పెంచడం ఒక దగ్గర పరిష్కారంగా ఉంది. ఇది సాకారం కావాలంటే రైతులకు అవసరమైన పెట్టుబడులు ప్రభుత్వమే సమకూర్చాలి. గ్రామీణ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెంచడానికి బదులుగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ రైతులకు రాయితీలిచ్చేం దుకే మొగ్గు చూపుతూ వచ్చాయి. పంటలసాగులో వైవిధ్యత ఉండాలి. అధిక విలువను రాబట్టగల పంటలసాగును రైతుకు చేరువ చేయాలి.

విటమిన్- బి3 ని నియాసిన్ అని కూడా పిలుస్తారు, ఈ విటమిన్ ముఖ్యంగా నీటిలో కరిగిపోతుంది. చాలా సాధారణమైన ఆహారపదార్థాలు, కొన్నిరకాల మాంసాలు, అలానే ట్యునా చేపలు, గింజలు ఇతర ఆహార పదార్థాలలోనూ ఇది లభిస్తుంది. నియాసిన్ అనేది విటమిన్-బి కాంప్లెక్స్ , ఇతర విటమిన్-బి లు అయిన విటమిన్ బి1 (థయామిన్), విటమిన్ బి2 (రిబోఫ్లావిన్), ఇతర పదార్థాలలో కూడా ఉన్నాయి. ఆరోగ్యకరమైన హృదయనాళ వ్యవస్థను, జీవక్రియను నిర్వహించడానికి 'నియాసిన్'ను ఒక ముఖ్యమైన విటమిన్‌గా పరిగణిస్తారు. ఇది మెదడు పనితీరును మెరుగుపరచడానికి, మధుమేహ చికిత్సకు కూడా బాగా సహాయపడుతుంది. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలలో "నియాసిన్" లోపం చాలా అరుదుగా ఉంటుంది. కొన్ని దేశాల్లో పోషకాహార లోపం సాధారణంగా ఉంటుంది. అందువల్ల అక్కడ ప్రజలు విటమిన్-బి 3 లోపంతో బాధపడుతున్నారు. విటమిన్-బి3 లోపానికి లక్షణాలు అజీర్ణం, అలసట, వాంతులు, నిరాశ, తలనొప్పి, జ్ఞాపకశక్తిని కోల్పోవడం వంటివి మొదలైనవి. నియాసిన్ లోపాన్ని నివారించాలంటే, విటమిన్-బి3 అధికంగా ఉన్న కొన్ని ఆహారపదార్థాల జాబితా ఉంది. ఈ ఆహార పదార్థాలు మొత్తం ఆరోగ్యాన్ని వెలుగజేసే ప్రయోజనాలను కూడా కలిగి ఉన్నాయి.

విటమిన్-బి3 లభించే మూల పదార్థాలు, వాటి ప్రయోజనాలు



విటమిన్ బి3 లభించే ఆహార వనరులు :-

చికెన్, టర్కీ కోళ్లు :

చికెన్‌తోపాటు టర్కీ కోళ్లను ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వినియోగిస్తారు. ఈ మాంసాలు నియాసిన్‌కి చాలా మంచి మూలం పదార్థం. 100 గ్రాముల వండిన చికెన్‌లో మనకు రోజువారీ కావలసిన విటమిన్-బి3 విలువ 74 శాతం వరకూ అందిస్తుంది. టర్కీ కోడి రొమ్ములో విటమిన్-బి3 ని 50 శాతం వరకూ ఉంది.

[illegible] :

విటమిన్-బి3ని మూల పదార్థంగా అందించే వాటిలో చేపలు కూడా ఒకటి. అన్ని చేపలలో కన్నా ట్యూనా చేపలో విటమిన్-బి3 అసాధారణ రీతిలో కలిగి ఉంటుంది. ఇది మనకు రోజువారీ అవసరమయ్యే విలువలో 110 శాతం వరకూ అందిస్తుంది. మేకరెల్, సాల్మోన్‌లో కూడా నియాసిన్‌ను కలిగి ఉన్న ఇతర రకాల చేపలు. వాటిలో కూడా ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్లు చాలా గొప్ప స్థాయిలో ఉన్నాయి.

పంది మాంసం :

చికెన్, గొడ్డు మాంసం తర్వాత పంది మాంసం చాలా ఎక్కువగా వినియోగించే మాంసాలలో ఒకటి. ఇందులో విటమిన్-బి3 అధికంగా ఉంటుంది. 100 గ్రాముల వండిన లేత పంది మాంసంలో రోజువారీ సిఫారసు చేసిన విలువలో 54 శాతం వరకూ మనకు లభిస్తుంది. వారంలో ఒకసారి పంది మాంసాన్ని కొంచెంగా తినవచ్చు, కాని కొవ్వు పదార్థం తక్కువగా కలిగి ఉన్న లేత పంది మాంసాన్ని మాత్రమే వినియోగించండి.

ఆకుపచ్చ బఠాణీలు :

శాకాహారులు రోజువారీ అవసరమయ్యే విటమిన్-బి3 ని పొందాలంటే ఏమాత్రం ఆందోళన చెందవలసిన పనిలేదు. నియాసిన్‌ను కలిగి ఉండే కూరగాయలన్నింటితో పాటు ఆకుపచ్చ బఠానీలో కూడా విటమిన్-బి3 పుష్కలంగా ఉన్నది. 100 గ్రాముల ఆకుపచ్చ బఠానీలలో విటమిన్- బి3 రోజువారీ అవసరమైన విలువలో 10 శాతం వరకూ మనకు అందిస్తుంది.

పుట్టగొడుగులు :

అన్ని రకాల పుట్టగొడుగులు కూడా విటమిన్-బి3 కి మంచి మూల పదార్థంగా ఉంటుందని చెప్పవచ్చు. పుట్టగొడుగులలో 71 శాతం నియాసిన్, క్యాన్సర్-వ్యతిరేక లక్షణాలు కూడా కలిగి ఉన్నాయి. తెల్లని పుట్టగొడుగులలో రోజువారీ అవసరమయ్యే 35 శాతం వరకూ నియాసిన్‌ను గణనీయంగా కలిగి ఉంది.

బ్రోకలీ :

విటమిన్-బి3 ని కలిగి ఉన్న సహజ వనరులలో బ్రోకలీ చాలా ఉత్తమమైన వాటిలో ఒకటి. వండిన (లేదా) ఉడికించిన బ్రోకలీలో నియాసిన్ 1-మిల్లీగ్రాము మోతాదు వరకూ కలిగి ఉండి, మీ శరీరానికి అందిస్తుంది. ఇది శరీరానికి అవసరమైనంత మోతాదులో నియాసిన్‌ను అందించడమే కాకుండా ఫైబర్, అనామ్లజనకాలు, ఇతర ముఖ్యమైన పోషకాలన్ని కూడా బ్రోకలీలో ఉన్నాయి.

ఆస్పరాగస్ :

ఆస్పరాగస్ చాలా పోషకాలను కలిగి ఉన్న గొప్ప ఆహార పదార్థం. నియాసిన్‌ను బాగా అందించే మూల పదార్థాలలో ఇది ఒకటి. ఆస్పరాగస్ మీకు 1 మిల్లీగ్రాముల నియాసిన్‌ను అందిస్తుంది. ఎక్కువ పోషక విలువలను కలిగి ఉంటుంది. విందులలో ఆస్పరాగస్‌ను ప్రధాన ఆహార పదార్థంగా తయారు చేయవచ్చు. లేదా కోడి / గొడ్డు మాంసం గల కూరలలో కూడా దీనిని చేర్చవచ్చు.



వేరుశెనగలు :

మీ శరీరానికి రోజువారీ అవసరమయ్యే విటమిన్ బి3 ని, మీరు నమిలే వేరుశనగలు పుష్కలంగా అందిస్తాయి. 100 గ్రాముల వేరుశెనగలను మీరు తినటం వల్ల 69 శాతం వరకూ మీకు విటమిన్-బి3 ను అందిస్తుంది. సహజసిద్ధమైన పద్ధతిలో వేరుశనగల ద్వారా తీసిన వెన్న కూడా విటమిన్-బి3 కి సమానంగా ఉండే ప్రయోజనాలను కలిగి ఉంటుంది.

కిడ్నీ బీన్స్ :

కిడ్నీ బీన్స్ కొద్ది మొత్తంలో నియాసిన్‌ను కలిగి ఉంటుంది. 100 గ్రాముల కిడ్నీ బీన్స్‌లో 2 మిల్లీగ్రాముల నియాసిన్ ఉంటుంది. ఈ బీన్స్ చాలా రకాల ప్రయోజనాలను కలుగజేసేవిగా ఉన్నాయి. సూప్‌లో ఈ బీన్స్‌ను చేర్చవచ్చు (లేదా) వాటినే ప్రధాన వంటకంగా వండి తినవచ్చు.

కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది :

విటమిన్ బి3 కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో చాలా ముఖ్యమైన పాత్రను పోషించేదిగా పరిగణిస్తారు. ఈ విటమిన్ హృద్రోగాల ప్రమాదాన్ని తగ్గించగలదని పరిశోధనల్లో తేలింది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడం ద్వారా గుండెపోటు (స్ట్రోక్) ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

డయాబెటిస్‌ను నివారించడంలో :

రక్తంలో చక్కెర స్థాయిలను, సమతుల్యంగా ఉంచడంలో ప్రధాన పాత్రను పోషిస్తున్న కారణంగా మధుమేహ చికిత్సలో విటమిన్ బి3 బాగా సహాయపడుతుంది. చాలామంది డయాబెటిక్ రోగులు విటమిన్-బి3 (లేదా) నియాసిన్ సహాయంతో రక్తంలో ఉన్న గ్లూకోజ్ స్థాయిని నియంత్రించగలుగుతున్నారు.

మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది :

విటమిన్-బి3 అల్జీమర్స్ వ్యాధిని, వయస్సు కారణంగా వచ్చే మెదడు రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడటంలో సహాయపడుతుందని చాలా అధ్యయనాలు నిరూపించాయి. నియాసిన్ తగ్గుదల వల్ల మెదడు పనితీరు చురుకుగా లేకపోవడం, ఆలోచనలు మందగించడం, పార్శ్వపు నొప్పి, తలనొప్పి, ప్రయాణాలలో కలిగే అనారోగ్యం మొదలైన వాటికి దారితీస్తుంది. అలా కాకుండా విటమిన్- బి3 సమృద్ధిగా ఉంటే మీ మెదడు పనితీరును బాగా మెరుగుపరుస్తుంది.

కీళ్ళనొప్పులను తగ్గిస్తుంది :

కీళ్ళనొప్పిని తగ్గించడంలో విటమిన్-బి3 చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. కీళ్ళ వాపును తగ్గించవచ్చు. కండరాలకు బలాన్ని చేకూరుస్తుంది. నియాసిన్‌ను అధిక మొత్తంలో తీసుకోవడం వలన వంగే గుణాన్ని మెరుగుపరుస్తుంది. ఆర్థరైటిస్ రోగులలో కీళ్ళవాపును తగ్గిస్తుంది.

ఆకలిని తీర్చే అక్రోటు



బాదం, జీడిపప్పు, కిస్‌మిస్ వంటి ఎండు ఫలాలు, గింజపప్పులు (నట్స్) ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి తక్కువ పరిమాణంలోనే ఎక్కువ శక్తిని, పోషకాలను అందజేస్తాయి. ఇవి కడుపు నిండిన భావన కలిగించి, ఆకలి తగ్గటానికీ తోడ్పడతాయి. ముఖ్యంగా అక్రోట్లు (వాల్‌నట్స్) మంచి ప్రభావం చూపుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. మనం భోజనం చేస్తున్నప్పుడు కడుపు నిండిందనే భావన కలగటం, ఆకలిని తగ్గించటంలో మెదడులోని ఇన్సులా అనే భాగం పాలు పంచుకుంటుంది. రోజూ అక్రోట్లు తినేవారిలో ఇది మరింత చురుకుగా స్పందిస్తున్నట్టు తేలటం విశేషం. అక్రోట్లు తిన్నప్పుడు కడుపు నిండిన భావన కలుగుతుందని చాలామంది చెబుతూనే ఉంటారు, అయితే దీని వెనకగల కారణమేంటో బయట పడటం ఆసక్తి కలిగిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. ఆకలి ప్రక్రియను మరింత బాగా అర్థం చేసుకోవటానికిది తోడ్పడుతుందని.. మున్ముందు దీని ఆధారంగా కొత్త మందులు పుట్టుకొచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదని వివరిస్తున్నారు.

క్యాన్సర్‌ను నివారించే మసాలా దినుసులు



మాంసాన్ని కొందరు పెద్ద మంట మీద, నిప్పుల మీద కాల్చి, వేయించి తింటుంటారు. ఇలా అత్యధిక ఉష్ణోగ్రతలో మాంసాన్ని వండితే హెటిరోసైక్లిక్ అమైన్లు (హెచ్‌సీఏలు) అనే క్యాన్సర్ కారకాలు ఉత్పత్తి అవుతాయి. ఇవి క్యాన్సర్‌కు దారితీయొచ్చు. అయితే కొన్ని మసాలా దినుసులతో దీన్ని నివారించుకోవచ్చని కన్సాస్ స్టేట్ విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొంటోంది. సుమారు 100 గ్రాముల కీమాలో ఒక గ్రాము మిరియాల పొడి కలిపి వండినపుడు హెచ్‌సీఏల ఉత్పత్తి చాలావరకు తగ్గినట్టు తేలటమే దీనికి నిదర్శనం. మిరియాల పొడిలోని సహజ యాంటీఆక్సిడెంట్లు విశృంఖల కణాలకు అంటుకోవటమే దీనికి కారణం. అందువల్ల యాంటీఆక్సిడెంటు గుణాలు గల మిరియాలు, లవంగాల వంటి మసాలా దినుసులతో పాటు పుదీనా వంటివి వండుకోవటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

'U కథే హీరో' మోషన్ పోస్టర్ విడుదల



కావెరా క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన దర్శకుడు కొవెర దర్శకత్వం వహిస్తున్న 'U కథే హీరో' చిత్ర మోషన్ పోస్టర్‌ను క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ 'ఈ సినిమా లైన్ వినగానే చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. మోషన్ పోస్టర్ ని కూడా కథానుగుణంగా చాలా వినూత్నంగా డిజైన్ చేశారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు.

దర్శకుడు కొవెరా మాట్లాడుతూ "U మోషన్ పోస్టర్ సుకుమార్ గారి చేతులమీదుగా లాంచ్ చెయ్యడం చాలా ఆనందంగా ఉంది. నేను విజయేంద్ర ప్రసాద్ గారి దగ్గర వర్క్ చేసాను. కొన్ని సినిమాలకి రైటర్‌గా కూడా చేసి, మొదటి ప్రయత్నంగా U మూవీని డైరెక్షన్ చేస్తున్నాను" అన్నారు.

స్క్రీన్‌ప్లే రచయిత మధు మాట్లాడుతూ "ఈ సినిమాకి వర్క్ చెయ్యడం చాలా ఆనందంగా అనిపించింది. అందరూ చెప్పే మాటే అయినా ఈ కథ చాలా కొత్తగా ఉంటుంది. అందుకే "కథే హీరో" అని క్యాప్షన్‌గా పెట్టాం. మా సినిమా మోషన్ పోస్టర్‌ని లాంచ్ చేసిన సుకుమార్ గారికి ధన్యవాదాలు.

త్వరలో విడుదల కానున్న ఈ సినిమాలో కొత్త హీరో, హీరోయిన్‌లతో బాటు తనికెళ్ళ భరణి గారు, శుభలేఖ సుధాకర్ గారు కీలక పాత్రలు పోషిస్తునారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది.

నటీనటులు:

హీరో - కొవెర, హీరోయిన్ - హిమాన్షి కాంట్రగడ్డ, సహాయ నటీనటులు: తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, రాఘవ(జబర్దస్త్), నాగి(జబర్దస్త్) రోహిణి, సంధ్య, స్వప్న రావ్, లహరి(మళ్ళీ రావా ఫేం), దొరబాబు, కోయ కిషోర్.

టెక్నికల్ టీం :

సినిమాటోగ్రఫీ - రాకేశ్ గౌడ్, మ్యూజిక్ - సత్య మహావీర్, ఎడిటింగ్ - ప్రవీణ్ పూడి, స్క్రీన్ ప్లే - మధు విప్పర్తి, కొవెర, డైలాగ్స్ - మహి ఇల్లింద్ర, కరుణ్ వెంకట్, ఆర్ట్ - జయదేవ్, మేకప్ - లక్ష్మణ్, కాస్ట్యూమ్స్ - ఆనంద్, ఫ్యాషన్ డిజైనర్ - నాగానికి చాగంరెడ్డి, శ్వేతా రెడ్డి, ఏక్షన్ - షావోలిన్ మల్లేష్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ - ప్రవీణ్, ప్రొడక్షన్ కంట్రోలర్ - కరణ్ , అసోసియేట్ డైరెక్టర్స్ - వంశీ పోస, పిల్లలమర్రి శ్రీనివాస్, గంధం బాబీ, సమర్పణ : నాగానిక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ - శివ నాగ శివ గణపర్తి, మూర్తి నాయుడు పాదం, నిర్మాత- జయలక్ష్మి కొండా, రచన, దర్శకత్వం -కొవెర

'చెన్నై చిన్నోడు' టీజర్, ఫస్ట్ లుక్ ఆవిష్కరణ



జి.వి ప్రకాష్ కుమార్, నిక్కీ గల్రానీ జంటగా నటించిన ఓ తమిళ చిత్రాన్ని తెలుగులో 'చెన్నై చిన్నోడు' 'వీడి లవ్ లో అన్నీ చిక్కులే' అనే ఉప శీర్షిక టైటిల్‌తో శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై వి.జయంత్ కుమార్ (బి.టెక్) తెలుగులో అనువదిస్తున్నారు. యశ్వంత్ సాయికుమార్ సమర్పకుడు. ఎం. రాజేశ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా టీజర్, ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్ లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మాత కె.వి.సత్యనారాయణ టీజర్, ఫస్ట్ లుక్‌ను ఆవిష్కరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, "తమిళంలో పెద్ద హిట్ అయిన సినిమా ఇది. తెలుగులో చక్కని క్యాచీ టైటిల్‌తో జయంత్ అనువదిస్తున్నాడు. నిర్మాతగా ఆయనకు తొలి సినిమా ఇది. నేను కూడా డబ్బింగ్ సినిమాలతోనే నిర్మాతగా పరిశ్రమకు పరిచయమై తర్వాత పెద్ద సినిమాలు నిర్మించాను. జయంత్ కూడా భవిష్యత్‌లో మంచి సినిమాలు నిర్మించి పెద్ద నిర్మాతగా పేరు తెచ్చుకోవాలి. సినిమా చూడలేదు కానీ ప్రకాష్ రాజ్ పాత్ర చాలా బాగుందంటున్నారు. సినిమా కూడా బాగుంటుందని ఆశిస్తున్నా. ఈ చిత్రం విజయం సాధించి నిర్మాతకు మంచి లాభాలు తీసుకురావాలి" అని అన్నారు.

నిర్మాత వి.జయంత్ కుమార్ మాట్లాడుతూ, "తమిళ సినిమా బాగా నచ్చడంతో ఇలాంటి మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించాలన్న ఉద్దేశంతో చేస్తున్న ప్రయత్నమిది. ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే చక్కని కామెడీ ఎంటర్ టైనర్ ఇది. ప్రకాష్‌రాజు గారి పోలీస్ పాత్ర సినిమాకు హైలైట్ గా నిలుస్తుంది. జి.వి ప్రకాష్ నటనతో పాటు, సినిమాకు మంచి సంగీతాన్ని కూడా అందించారు. అందమైన ఫారెన్ లోకేషన్లలో పాటలు చిత్రీకరించారు. ఆ పాటల్లో కూడా వినోదం పండటం హైలైట్ అవుతుంది. నా తొలి ప్రయత్నాన్ని తెలుగు ప్రేక్షకులంతా ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నా" అని అన్నారు.

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్.కృష్ణ మాట్లాడుతూ, "లవ్, కామెడీ అంశాలతో తెరకెక్కిన సినిమా ఇది. తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. నూటికి నూరుశాతం సినిమా పెద్ద హిట్ అవుతుంది. నిర్మాత కె.వి సత్యానారాయణ గారి చేతుల మీదుగా టీజర్ , ఫస్టు లుక్ ఆవిష్కరణ జరగడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

శరవేగంగా 'నిన్నే చూస్తు'

వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై నూతన నటీనటులు శ్రీకాంత్, హేమలత (బుజ్జి) హీరో హీరోయిన్ గా నాటితరం హీరోయిన్ సుహాసిని, సుమన్, భానుచందర్ ముఖ్య పాత్రలలో వి.ఎస్. ఫణీంద్ర దర్శకత్వంలో హేమలతా రెడ్డి నిర్మాతగా నిర్మిస్తున్న చిత్రం 'నిన్నే చూస్తు'. ఇటీవలే మొదటి షెడ్యూల్‌ను పూర్తిచేసుకున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ ప్రారంభమై శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్, పరిసరప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా నిర్మాత హేమలతా రెడ్డి మాట్లాడుతూ "మా వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్‌లో 'నిన్నే చూస్తు' రెండవ చిత్రం. మంచి కుటుంబకథ చిత్రం. సీనియర్ నటులు సుహాసిని గారు, సుమన్ గారు, భాను చందర్ గారు ముఖ్య పాత్రలు చేస్తున్నారు. మా చిత్రంలో సుహాసిని గారు నటించటం మా అదృష్టం. వారు నటించిన సన్నివేశాలు చాల బాగా వచ్చాయి. మరొక ముఖ్య పాత్రలో సుమన్ గారు నటిస్తున్నారు. వారు చాల మంచి వారు. మా కుటుంబంలో ఒక భాగంగా కలిసిపోయారు. మొదటి షెడ్యూల్ అవుట్ ఫుట్ చూశాక చాలా సంతోషంగా ఉంది. త్వరలోనే విడుదల చేస్తాం" అని అన్నారు



నారా రోహిత్ హీరోగా కొత్త సినిమా

రొటీన్‌కు భిన్నంగా వైవిధ్యమైన కథ-కథనాలను ఎంచుకుంటూ కథానాయకుడిగా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకొన్న నారా రోహిత్ తాజాగా ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్ సంస్థలో సినిమాకు అంగీకరించారు. ప్రొడక్షన్ నెం. 3గా ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రం ద్వారా ఎస్.డి.చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. వైవిధ్యమైన కథతో విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి నుంచి మొదలవ్వనుంది. వడ్డేవల్లి సత్యనారాయణ సమర్పణలో రూపొందనున్న ఈ చిత్రంలో నారా రోహిత్ క్యారెక్టరైజేషన్, గెటప్ చాలా టిపికల్‌గా ఉండబోతున్నాయి.

ప్రస్తుతం తమ ప్రొడక్షన్‌లో రూపొందిన "హౌరా బ్రిడ్జ్" విడుదల పనుల్లో బిజీగా ఉన్న నిర్మాణ బృందం.. సినిమా రిలీజవ్వగానే నారా రోహిత్ సినిమాకి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడించనున్నారు.

ఈ చిత్రానికి సంగీతం : సాయికార్తీక్, సమర్పణ : వడ్డేవల్లి సత్యనారాయణ, కథ-స్క్రీన్ ప్లే-దర్శకత్వం : ఎస్.డి.చక్రవర్తి. నిర్మాణం : ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్.

'ఎన్ హెచ్ 47లో భూత్ బంగ్లా' చిత్ర గీతావిష్కరణ



ఏకే 9 స్టూడియోస్ ఫిలిమ్స్ సమర్పణలో అజయ్ కౌండిన్య, సంధ్య, అనూష హీరో, హీరోయిన్‌లుగా తెరకెక్కిన చిత్రం 'ఎన్ హెచ్ 47లో 'భూత్ బంగ్లా'. ఈ చిత్ర ఆడియో కార్యక్రమం ఫిలిం ఛాంబర్‌లో జరిగింది. రాగూర్ బాలాజీ సింగ్ (టిఆర్ఎస్ నేత), వి.ఆంజనేయులు (బీజేపీ లీడర్) అతిథులుగా విచ్చేసి సీడీని ఆవిష్కరించారు. అనంతరం రాగూర్ బాలాజీసింగ్ మాట్లాడుతూ.. "సినిమా చేయాలంటే ఎంత ఇష్టం ఉంటుందో అంత కష్టం కూడా ఉంటుంది. అజయ్ కౌండిన్య ఆ కష్టాలన్నీ పడ్డారు. ఈ టీజర్ చాలా బాగుంది. చిత్ర యూనిట్ కష్టానికి తప్పకుండా ప్రతిఫలం దక్కుతుంది అని నమ్ముతున్నాను" అన్నారు. వి ఆంజనేయులు మాట్లాడుతూ.."మనిషి కసి ఉంటే ఏదైనా చేయగడు అని అజయ్‌ని చూస్తే అనిపిస్తుంది. మా చిన్ననాటి స్నేహితుడు. అతనికి చిన్నప్పటి నుంచీ కళలంటే చాలా ఇష్టం. అదే అజయ్‌ని ఇక్కడి దాకా తీసుకువచ్చింది. ఈ సినిమాతో ఆయన పెద్ద దర్శకుడి స్థాయికి చేరాలని కోరుకుంటున్నా" అన్నారు. దర్శకుడు అజయ్ కౌండిన్య మాట్లాడుతూ. "ఇంతకముందు 'వర్మ' అనే సినిమా చేసాను. నేను పరిశ్రమకు వచ్చి 12 సంవత్సరాలవుతోంది. ఇప్పటికి 3 సినిమాను నిర్మించాను. పరిశ్రమకు చెందిన పవన్ కళ్యాణ్, రోజా వంటి వారు రాజకీయంగా కీలక స్థానాల్లో ఉన్నందున వారు సినీ ఇండస్ట్రీ సమస్యపై దృష్టిపెట్టాలి. సంగీత దర్శకుడు చైతన్యరాజ మంచి పాటలు ఇచ్చారు" అన్నారు. నిర్మాత అరుణాచం మాట్లాడుతూ.. "అజయ్ పట్టుదలే ఈ సినిమాను ఇక్కడ దాకా తీసుకువచ్చింది. ఓ మంచి సినిమాకు కావాల్సిన అన్నీ సమకూర్చాం. తప్పకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది" అన్నారు. సంగీత దర్శకుడు చైతన్యరాజు మాట్లాడుతూ... ఈ చిత్రంలో 4 పాటలు ఉన్నాయి, మెలోడీ, మాస్‌ను తలపిస్తాయి. కామెడీ హారర్ జోనర్ కావడంతో నాకు మంచి సంగీతం ఇవ్వడానికి స్కోప్ ఎక్కువగా దొరికింది. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా" అన్నారు.

అరుణాచం, సంధ్య, అనూష, శ్రీధర్ వర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అభినందనలు తెలియజేశారు..

నటీనటులు : బేబీ లక్కీ, సంధ్య, అనూష, ఐశ్వర్య, రుద్ర, విజయ్ కుడిపూడి, అరుణాచం, అజయ్ కౌండిన్య, బాలు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు : ఆంజనేయులు కొమ్మగోని, రాసంబట్టి అరుణాచలం గౌడ్, సహ నిర్మాతలు: మారం రాజేష్ కుమార్, బుగ్గారపు రమేష్ బాబు, రచన, దర్శకత్వం: అజయ్ కౌండిన్య, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్: కబీర్ రఫీ, ఎడిటర్: సంధ్య, నిర్వాహకుడు: మాగ్నెట్ బాలు, రచన సహకారం: టిఆర్‌వీ, కీబోర్డ్: చైతన్యరాజ, సౌండ్ ఇంజనీర్: మహేందర్‌వర్మ, డి.ఐ: శ్రీశైలం.

'దీర్ఘాయుష్మాన్ భవ' మోషన్ పోస్టర్ విడుదల



వింగ్స్ మూవీ మేకర్స్ బేనర్‌పై కార్తీక్‌రాజు, మిస్తి చక్రవర్తి జంటగా జి.ప్రతిమ "దీర్ఘాయుష్మాన్ భవ" చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోషియో ఫాంటసీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి పూర్ణానంద్.ఎం దర్శకుడు. మోషన్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకులు పూరీ జగన్నాథ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పూరీ జగన్నాథ్ మాట్లాడుతూ.. "కార్తీక్ రాజ్ నాకు చాలాకాలంగా తెలుసు. ఒక డిఫరెంట్ ఫిలిమ్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. టైటిల్, పోస్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఈ సినిమాతో కార్తీక్ రాజ్‌కు హీరోగా మంచి గుర్తింపు లభించాలని ఆశిస్తున్నాను" అన్నారు. చిత్ర కథానాయకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ.. "హీరోగా నా గత చిత్రాల కంటే వైవిధ్యంగా ఉండే సినిమా "దీర ఆయుష్మాన్ భవ" డైరెక్టర్ పూర్ణానంద్ ఓ గమ్మత్తైన ప్రేమకథగా రూపొందిస్తున్నారు. పూరీ జగన్నాథ్ గారు మా సినిమా మోషన్ పోస్టర్ ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. ఆయన బ్లెస్సింగ్స్ మా సినిమాకి తప్పకుండా ఫలిస్తాయి" అన్నారు. దర్శకుడు ఎం.పూర్ణానంద్ మాట్లాడుతూ.. "ఇప్పటివరకు వచ్చిన ప్రేమకథా చిత్రాలకు భిన్నంగా తీస్తున్న సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్ "దీర్ఘాయుష్మాన్ భవ". సినిమా ఆద్యంతం ఫ్రెష్ లుక్‌తో ఉంటుంది. సీనియర్ నటులు కైకాల సత్యనారాయణగారు చాలాకాలం తర్వాత యముడిగా కనిపించనున్నారు. ఆయన పాత్ర సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవ నుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగు తోంది. గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోంది. మార్చిలో సినిమాను విడుదల చెయనున్నాం. "దీర్ఘాయుష్మాన్ భవ" అని టైటిల్ మా సినిమాకు పర్ఫెక్ట్ అని సినిమా చూసినవాళ్లే అంటారు" అన్నారు. కార్తీక్‌రాజు, మిస్తి చక్రవర్తి, నొయల్, కైకాల సత్యనారాయణ, ఆమని, పృథ్వీరాజ్, కాశీ విశ్వనాథ్, సత్యం రాజేష్, తాగుబోతు రమేష్, గెటప్ శీను, రాంప్రసాద్, కేదార్ శంకర్, జెమిని సురేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సిద్ధార్థ్, కెమెరా: మల్హర్‌భట్ జోషి, మాటలు: ప్రదీప్ ఆచార్య, పూర్ణానంద్.ఎం, ఆర్ట్: రామకృష్ణ, నిర్మాత: ప్రతిమ.జి,కథ-కథనం-దర్శకత్వం: పూర్ణానంద్.ఎం.

లేజర్ స్క్రీన్‌గా మారనున్న ఇడుక్కీ డ్యామ్

తిరువనంతపురం : ఆసియాలోనే అతిపురాతనమైన ఆర్చ్ (వలయాకారంలోని) డ్యామ్ లేజర్ స్క్రీన్‌గా మారబోతోంది. 555 అడుగుల ఎత్తు, 650 అడుగల వెడల్పు ఉండే కేరళలోని ఇడుక్కీ డ్యామ్ కురవన్, కురతిగిరుల గుండా ప్రవహించే పెరియార్ నదిపై ఉంది. ఇది ప్రపంచంలోనే రెండవ ఆర్చ్‌డ్యామ్ కావడం విశేషం. ఇడుక్కీ డ్యామ్ సాంకితక అద్భుతంగా ప్రసిద్ధి. దీని పవర్‌హౌస్ వాణిజ్య కార్యకలాపాలను 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారు. కేరళ రాష్ట్ర విద్యుత్ బోర్డు ఆధ్వర్యంలోని హైడల్ టూరిజం డిపార్ట్‌మెంట్ లేజర్ షో ఏర్పాటుతో పాటు డ్యామ్ ప్రాంత సమగ్రాభివృద్ధిపై రాష్ట్ర పర్యాటక శాఖకు వివరణాత్మక నివేదిక ఇచ్చింది. రూ.26కోట్ల ఈ ప్రాజెక్టుపై నివేదికను త్వరలోనే కేంద్రానికి సమర్పించి, నిధులు కోరనున్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. డ్యామ్ గోడపై లేజర్ షోను ప్లాన్ చేసినట్టు వెల్లడించారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీన్లలో ఒకటిగా నిలవనున్నదని కేరళ జలవిద్యుత్ పర్యాటక శాఖ డైరెక్టర్ కేజే జోసె అన్నారు. రాష్ట్ర చరిత్రతో పాటు జలవిద్యుత్ ప్రాజెక్టులు, కేరళవిద్యుత్‌బోర్డు గురించీ షోలో ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ప్రతిరోజూ 30 నిమిషాల నిడివిగల మూడు షోలు ఉంటాయని, 200 నుంచి 300 మంది వరకు లేజర్ షోను ఏకకాలంలో వీక్షించవచ్చునని, డ్యామ్‌కు 26కి.మీల దూరంలో నుంచి కూడా షోను తిలకించే వీలువుందని చెప్పారు. ఆర్చ్ డ్యామ్ ఎదుటున్న రెండెకరాల స్థలంలో రంగస్థలం, షాపింగ్ కాంప్లెక్స్, అక్వేరియాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు నడుస్తూ.. జలచరులను వీక్షించే విధంగా గాజుతో అక్వేరియంను ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు.



కబళించిన 'ఎంఆర్ఐ'

సిలిండర్ మీదపడి వ్యక్తి మృతి
- ముంబై ఆసుపత్రిలో ఘోరం



ముంబై : ముంబై ఆసుపత్రిలో ఘోరం జరిగింది. స్కానింగ్ కోసం రోగితో పాటు వెళ్లిన వ్యక్తిని ఎంఆర్ఐ మెషిన్ రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన శనివారం నాయర్ హాస్పిటల్‌లో చోటుచేసుకుంది. మృతుడు రాజేష్ మారుతీ మారు ఓ బట్టల వ్యాపారి. అతను తన బంధువైన వయోవృద్ధిరాలితో పాటు ఆసుపత్రికి వెళ్లాడు. ఈ క్రమంలో ఎంఆర్ఐ స్కాన్ కోసం స్కానింగ్ గదిలోకి వెళ్లగా ప్రవేశించినప్పుడు రోగి మంచానికి ఆక్సిజన్ సిలిండర్ అమర్చిఉంది. ఎంఆర్ఐ మెషిన్‌లోని శక్తిమంతమైన అయస్కాంతం ఒక్కసారిగా ఆ సిలిండర్‌ను ఆకర్షించడంతో దానికి అమర్చిన ట్యూబ్లు ఊడిపోయి..గ్యాస్ లీకైంది. ఆ సమయంలో ఆ బరువైన సిలిండర్ అక్కడున్న రాజేష్‌పై పడడం, అతను దానికింద నలిగిపోవడం రెప్పపాటులో జరిగిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన 32ఏళ్ల రాజేష్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. రాజేశ్ మృతిచెందడంతో అతని కుటుంబీకులు, బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఎలా వ్యవహరిస్తున్నారని ఆసుపత్రి సిబ్బందిని నిలదీశారు. సిబ్బంది నిర్లక్ష్యమే తమ బిడ్డ ప్రాణాలు తీసిందని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సెక్షన్ 304(ఎ) కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న ఎంఆర్ఐ విభాగపు సిబ్బంది వాంగ్మూలాన్ని రికార్డు చేశారు.

'మహా' సంక్షోభం



- ఒంటరి పోరే: శివసేన ప్రకటన
- బీజేపీకి ముచ్చెమటలు
- చీలనున్న కాషాయ ఓట్లు?
- కాంగ్రెస్, ఎన్‌సీపీకి లబ్ధి ?
- మహా రాజకీయాలపై విశ్లేషకుల అభిప్రాయాలు



ముంబై : మహారాష్ట్రలో కోల్పోయిన తన ప్రాభవాన్ని తిరిగి సాధించుకోవడానికి శివసేన నానాతంటాలు పడుతోంది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీతో కలిసి అధికారం పంచుకుంటూనే మిత్రపక్షం, ప్రధాని మోడీపై నిత్యం నిప్పులు చెరుగుతోంది. తాజాగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని శివసేన నిర్ణయం తీసుకున్నది. దీనితో మహారాష్ట్రలో కాషాయ కూటమి ప్రభుత్వం సంక్షోభంలో పడబోతోంది. ఇప్పటికే మహారాష్ట్రలో శివసేన, బీజేపీ పరస్పరం బహిరంగంగా విమర్శలు గుప్పించుకుంటున్నాయి. ఈ రెండు పార్టీల మధ్య సఖ్యత కుదిరే అవకాశాలు కనిపించడం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వం సంక్షోభంలో పడినట్టేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. తన మిత్రపక్షం బీజేపీకి దేశంలో ప్రజామద్దతు కొరవడిందని శివసేన గట్టిగా విశ్వసిస్తున్నది. మోడీ సర్కారు తీసుకున్న అనేక ప్రజావ్యతిరేక విధానాలే అందుకు ప్రధాన కారణంగా చెబుతోంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ వైఫల్యాలను తనకు అనుకూలంగా మలచుకోవడానికి శివసేన ఒంటరిగా పోటీ చేయాలని భావిస్తున్నట్టు పరిశీలకులు చెబుతున్నారు. ఫడ్నవిస్ ప్రభుత్వ వైఫల్యాలే తమకు లబ్ధి చేకూరుస్తాయని ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన గట్టిగా నమ్ముతోంది. శివసేన ఒంటరిగా పోటీ చేస్తే కాషాయపార్టీల ఓట్లు భారీగానే చీలతాయి.

శివసేన నిర్ణయం ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్‌సీపీకి వరంగా మారుతుం దని, బీజేపీ తీవ్రమైన సవాల్ ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒంటరిగా ఎదుర్కోవాలన్న తీర్మానాన్ని గతవారం సమావేశమైన శివసేన జాతీయ కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. 2019 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉండదని స్పష్టంచేసింది. ఇప్పుడు ఫడ్నవిస్ ప్రభుత్వంలో శివసేన జూనియర్ భాగస్వామిగా ఉన్నది. దేశవ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని కూడా శివసేన ప్రకటించింది. రాష్ట్ర రాజకీయాలు భవిష్యత్‌లో అస్థిరంగా, అనిశ్చితిగా, సిద్ధాంతరహితంగా మారబోతున్నాయని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ సుధీంద్ర కులకర్ణి జోస్యం చెప్పారు. మహారాష్ట్రలోనూ, దేశవ్యాప్తంగానూ బీజేపీ ప్రజామద్దతు కోల్పోయిందన్న భావనతోనే శివసేన ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నది. కులకర్ణి ఆదివారం పీటీఐకి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. బీజేపీపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లడం, సంకీర్ణ ప్రభుత్వంలో జూనియర్ భాగస్వామిగా ఉండాలని శివసేన కోరుకోవడం లేదు. ఈ కారణాలతో వచ్చే ఎన్నికల్లో ఎందుకు ఒంటరిగా పోటీచేయకూడదన్న ఆలోచన శివసేనలో వ్యక్తమవుతుందని కులకర్ణి వివరించారు. సుదీర్ఘకాలంగా కలిసి ఉన్న కాషాయ పార్టీల మధ్య చీలిక వస్తే...మహారాష్ట్ర రాజకీయాలు కుంటివైపో తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

మహా రాష్ట్రలో నాలుగు పార్టీలు ప్రధానంగా ఉన్నాయి. అవి కాంగ్రెస్, బీజేపీ, శివసేన, ఎన్‌సీపీ. ఈ విధంగా నాలుగు పార్టీలుగా ఉండటం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోంది. బీజేపీ-శివసేన, కాంగ్రెస్-ఎన్‌సీపీ రెండు ప్రత్యర్థి కూటములు ఏనాడు మనస్ఫూర్తిగా ఐక్యంగా లేవు. సమీప భవిష్యత్‌లో ఏ ఒక్క పార్టీ సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని కులకర్ణి తేల్చిచెప్పారు. బీజేపీ ప్రభావం పెరిగిపోవడంతో శివసేన అభద్రతా భావానికి గురవుతోందని రాజకీయ పరిశీలకుడు ప్రకాష్ బాల్ జోషి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రజాదరణపైనే బీజేపీ ఆధారపడి ఉండటాన్ని శివసేన జీర్ణించుకోలేక పోతోంది. అందులో భాగంగానే తమ సంబంధాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. భవిష్యత్‌లో ఈ దూరం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని ప్రకాష్ చెప్పారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ డిమాండ్లను పట్టించుకోపోవడంపై శివసేన రగిలిపోతోంది. శివసేన డిమాండ్లను అటు కేంద్రంలోనూ...ఇటు రాష్ట్రంలోనూ మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే కసి ఆ పార్టీలో ఉందని ప్రకాష్ చెప్పారు. ఈ అవకాశాన్ని కాంగ్రెస్, ఎన్‌సీపీ తన్నుకుపోయే అవకాశం ఉందని ప్రకాష్ చెప్పారు. 2019లోనూ మోడీ మ్యాజిక్ పనిచేస్తే అది బీజేపీకి లబ్ధి చేకూరుతుంది.

లేకపోతే అది కాంగ్రెస్, ఎన్‌సీపీకి కలిసి వస్తుందని ఆయన వివరించారు.

ఎంపీలో పెరుగుతున్న పులుల మరణాలు

- వన్యప్రాణుల సంరక్షణపై కార్యకర్తల ఆందోళన
- చింత అక్కర్లేదన్న ప్రభుత్వం



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో పులుల మరణాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని వన్యప్రాణాలు సంరక్షణ సంస్థల కార్యకర్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పులలను అక్రమంగా వేటాడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, వాటి సంఖ్య పెరుగుతోందని , దీనిపై ఆందోళన అక్కర్లేదని రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. అన్ని రాష్ట్రాలతో పోల్చితే మధ్యప్రదేశ్‌లో పులులు ఎక్కువగా మరణిస్తున్నట్టు కార్యకర్తలు వెల్లడించారు. పులుల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యంలేదని అటవీ శాఖ అధికారులు అన్నారు. అయితే, ఈ వ్యవహారంలో కార్యకర్తల్లో ఒక్కరైన అజయ్ దూబె మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు. రెండేళ్లలో సంభవించిన పులుల మరణాలపై విచారణకు ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరనున్నారు. అక్రమ వేట, తదితర కారణాలతో 2018, జనవరిలో చనిపోయిన ఆరు పులులతో కలిపి 13 నెలల్లో మొత్తం 32 పులులు మరణించినట్టు తెలుస్తోంది. జాతీయ పులుల సంరక్షణ యంత్రాంగం (ఎన్‌టీసీఏ) డేటా ప్రకారం 2017లో దేశవ్యాప్తంగా 98 పులులు మరణించగా, ఒక్క మధ్యప్రదేశ్‌లో 26 మరణాలు సంభవించినట్టు వెల్లడైంది. 2016లో 33 పులులు మరణించినట్టు రాష్ట్ర అటవీశాఖ డేటా పేర్కొంది. ఈనెల 18న సత్‌పుర టైగర్ రిజర్వ్‌లో ఓ పులి వేటకు గురైన విషయాన్ని అటవీ సిబ్బంది మూడ్రోజుల తర్వాత గుర్తించారని, వారు ఈ విధంగానేనా వన్యప్రాణులను ముఖ్యంగా మృగరాజులను సంరక్షించేదని దూబె ప్రశ్నించారు. రాష్ట్రంలో పెరుగుతున్న పులుల మరణాలకు అధికారుల 'క్రిమినల్ నిర్లక్ష్యమే' కారణమని, ఈ వ్యవహారంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు.

అవినీతిపై పోరులో యువత సహకరించాలి

ప్రధాని మోడీ విజ్ఞప్తి



న్యూఢిల్లీ : అవినీతికి వ్యతిరేకంగా తాను జరిపే పోరులో యువత సహకరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం అన్నారు. అవినీతి వ్యతిరేక కార్యక్రమం నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు జైలులో మగ్గుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎన్‌సీసీ ర్యాలీని ఉద్దేశించి మోడీ ప్రసంగిస్తూ, ఆధార్ వినియోగాన్ని బలంగా నొక్కి చెప్పారు. ప్రభుత్వ ధనం ప్రయోజనదారులకు చేరుకోవడంలో సహాయపడేందుకు, లోపాలను అరికట్టడం ద్వారా భారతదేశ అభివృద్ధికి గొప్ప బలం చేకూరుస్తుందని తెలిపారు. అవినీతి వ్యతిరేక చర్యల్లో ధనవంతులు, శక్తి మంత్రులను ఎన్నడూ తాకరని ప్రజలు నమ్మేవారని, అయితే ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు ఇపుడు జైలులో ఉన్నారని తెలిపారు. అవినీతి 'చెదలు'ను వదిలించుకోవడం పేద ప్రజలకు మేలు చేస్తుందని అన్నారు.దాణా కుంభకోణంలో మాజీ ముఖ్య మంత్రులు లాలూ ప్రసాద్, జగన్నాథ మిశ్రాలు ఇటీవల దోషులుగా తేలడంతో శిక్షకు గుర య్యారు. ఇక మాజీ ముఖ్యమంత్రి ఓ.పి.చౌతులా కూడా ఒక అవినీతి కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ప్రధాని మాట్లాడుతూ 'భారతదేశ యువత అవినీతిని తిరస్కరించాలి. అవినీతి, నల్లధనం వ్యతిరేక పోరాటం ఆగదు. యువత భవిష్యత్తు కోసమే ఈ పోరు' అని అన్నారు. అవినీతిని నిరోధించే డిజిటల్ లావాదేవీల వ్యాప్తికి ఎన్‌సీసీ క్యాడెట్లు, ఇతర యువత కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ధనం అక్రమార్కుల పాలుకాకుండా కొన్ని ప్రభుత్వ పథకాల్లో రూ. 60 వేల కోట్లు నగదు ఆదా అయ్యేందుకు ఆధార్ ప్రక్రియ దోహదపడిందని చెప్పారు.

'పద్మ' అవార్డుల ఎంపికలో పారదర్శకత

'పద్మ' అవార్డుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ప్రధాని మోడీ తెలిపారు. పేరుకన్నా నామినీ పనితనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ ఏడాది తొలి 'మన్ కీ బాత్' నెలవారీ రేడియో కార్యక్రమంలో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని 'పద్మ' అవార్డులకు ప్రకటించిన విజేతల విశేష కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. టీవీలు, వార్తా పత్రికలు చూడని పెద్ద నగరాల్లో నివాసం ఉంటున్న సామాన్య ప్రజలు అవార్డులను స్వీకరించారన్నారు. గత మూడేళ్లుగా ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. ఆ గౌరవాన్ని పొందేందుకు ఇప్పుడు ఎవరైనా ఆ ప్రజలను నామినేట్ చేయవచ్చన్నారు. ఇతరులకు స్ఫూర్తినిచ్చే, ప్రోత్సహించే విజేతల కథలను వినాలని సమాజానికి ఆయన పిలుపునిచ్చారు. మహిళా సాధికారత అంశాలపై కూడా మోడీ ప్రసంగించారు. మహిళలు ఇప్పుడు అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నారని అన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా బీఎస్ఎఫ్ మహిళా బృందం ప్రదర్శన అతిథులను ఆశ్చర్యపరిచిందని ప్రధాని చెప్పారు. బాల్య వివాహం, వరకట్నం వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా బీహార్‌లో 'మానవహారం' ఏర్పాటు చేయడాన్ని కూడా ఆయన ప్రశంసించారు. స్వీయ దిద్దుబాటుకు నిరంతర ప్రయత్నాలు, ఒదుగుబాటు సమాజ ముఖ్య లక్షణమని ఆయన పేర్కొన్నారు. జనవరి 30న మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని, గాంధీ మార్గాన్ని అనుసరించడంకన్నా గొప్ప నివాళి ఏదీ ఉండదన్నారు.

బక్కచిక్కుతున్న గిరిజన సంక్షేమం



- తగ్గిపోతున్న నిధులు
- బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు

న్యూఢిల్లీ: సమాజంలో ఆర్థికంగా అణగారిన గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్నామంటూ ప్రకటనలు గుప్పించడం పాలకులకు ఆనావాయితీ అయింది. సంక్షేమ పథకాలను ఆర్భాటంగా ప్రకటించడంలో కనబరిచిన ఉత్సాహం ఆయా పథకాలకు అవసరమైన నిధుల కేటాయింపులో ప్రదర్శించడం లేదు. గిరిజన సంక్షేమం పట్ల బీజేపీ పాలకులకులు ప్రకటనల్లో ఒకరకంగానూ, నిధుల కేటాయింపుల్లో మరో రకంగానూ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారనడానికి ఇది ఒక ఉదాహరణ.

2016 డిసెంబరు 12న లోక్‌సభలో ప్రసంగిస్తూ గిరిజనుల సంక్షేమం కోసం మూడేళ్ల క్రితం ప్రారంభించిన వనబంధు కళ్యాణ్ యోజన పథకానికి ఈఏడు కేవలం కోటి రూపాయల నిధులను మాత్రమే కేటాయిస్తున్నట్లు గిరిజన వ్యవహారాల మంత్రి జస్వంత్ సిన్హా సుమన్‌భాయ్ భభోర్ ప్రకటించారు. గత మూడేళ్లలో ఏఏటికాయేడు నిధుల కేటాయింపులు తగ్గించుకుంటూ వస్తున్నారనే విమర్శ ఉంది. తొలుత 2014లో పది రాష్ట్రాల్లో పథకాన్ని అమలు జరిపేందుకుగాను ప్రతి రాష్ట్రానికీ రూ.100కోట్లను కేటాయించారు. 2015-16లో పథకం అమలును 21 రాష్ట్రాలకు విస్తరించారు. ఒక్కో రాష్ట్రానికీ రూ.200ల కోట్లను కేటాయించారు 2016-17లో ఈపథకం అమలుకు కేవలం కోటి రూపాయల నామమాత్రపు మొత్తాన్ని కేటాయించారు. ఇదే పథకం కాదు. గిరిజన ఉప ప్రణాళిక (టీఎస్‌పీ) కింద కేటాయించే నిధులకూ కోత పెడుతూ వచ్చారు. 2013 నుంచి 2017 వరకు టీఎస్‌పీ కింద కేంద్ర కేటాయించే నిధులు 10శాతానికి పరిమితమైనాయి. గ్రామీణ గిరిజనుల్లో 45శాతం మంది , పట్టణ ప్రాంతాల్లో 24శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. గత నాలుగు బడ్జెట్లుగా గిరిజనుల వృత్తినైపుణ్యాన్ని పెంచేందుకు నైపుణ్యాభి వృద్ధికి కేటాయించే నిధులు 50శాతానికిపైగా తగ్గిపోయాయి. 2014-15లో మూలధన వ్యయం కింద రూ.70కోట్లను కేటాయించగా తాజాగా ఈకేటాయింపుల్లో ఎదుగూ బొదుగూ లేకుండా రూ.60కోట్ల దగ్గరే నిలిచిపోయాయి. గిరిజనుల విద్యకు కేటాయింపులు నిరాశగొలిపేవిగా ఉన్నాయి. ఎస్టీల విద్యార్థుల వసతిగృహాలకు నిధుల కేటాయింపులు 94శాతం తగ్గిపోయాయి. తొమ్మిది, పది తరగతి చదివే గిరిజన విద్యార్థులకు చెల్లించే ఉపకార వేతనాలు ఏకంగా 75శాతం తగ్గిపోయాయి. గిరిజన సంక్షేమం ఎలా సాధ్యమన్న ప్రశ్నకు నిధుల కేటాయింపులు తగ్గించుకుంటూ పోతున్న బీజేపీ పాలకులు బదులివ్వాలి.



పద్మావత్‌కు కలెక్షన్ల సునామీ

100 కోట్ల క్లబ్ చేరువలో

న్యూఢిల్లీ : సంజయ్ లీలా భన్సాలీ చారిత్రక దృశ్య కావ్యం పద్మావత్ వివాదాల నడుమ విడుదలైనా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబడుతోంది. దీపికా పదుకోన్ టైటిల్ పాత్ర పోషించిన ఈ మూవీ త్వరలోనే 100 కోట్ల క్లబ్‌లో చేరనుంది. బుధవారం ప్రీమియర్ షోల ద్వారానే రూ 5 కోట్లు రాబట్టిన పద్మావత్ గురువారం రూ 19 కోట్లు, శుక్రవారం రూ 32 కోట్లు, శనివారం రూ 27 కోట్లు కొల్లగొట్టి మొత్తం రూ 83 కోట్లు వసూలు చేసిందని ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ట్వీట్ చేశారు. ఆదివారం వసూళ్లు కలుపుకుంటే మూవీ 100 కోట్ల క్లబ్‌లో చేరుతుందని స్పష్టం చేశారు. చరిత్రను వక్రీకరించారంటూ పద్మావత్ మూవీని రాజపుత్రులు, హిందూ సంస్థలు నిరసిస్తూ తీవ్ర ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. పలు రాష్ట్రాలు సైతం చిత్ర విడుదలను నిషేధిస్తున్నట్టు ప్రకటించినా సుప్రీం గ్రీన్‌సిగ్నల్‌తో వివాదాల నడుమ విడుదలైన పద్మావత్ వసూళ్లలో దూసుకుపోతుండటం పట్ల చిత్ర యూనిట్ ఊపిరిపీల్చుకుంది.

కర్నాటక ఎన్నికల బరిలో హిందూ మహాసభ

మంగుళూరు : ఈ ఏడాది కర్నాటకలో జరుగనున్న ఎన్నికల్లో 150 సీట్లలో పోటీ చేస్తామని హిందూమహాసభ వెల్లడించింది. ఫిబ్రవరి చివరి నాటికి అభ్యర్థులను ప్రకటిస్తామని, ఆరాష్ట్ర అధ్యక్షుడు ఎన్ సుబ్రమణ్యరాజు విలేకరులకు తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య హిందూ వ్యతిరేక ధోరణితో మైనార్టీలను అధికా రంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దక్షిణ కర్ణాటకలోని 8 అసెంబ్లీ స్థానాలకు తాము పోటీచేస్తామని, మెజారిటీ సంఖ్యలోని హిందువులు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు.

పాక్ కాల్పుల్లో 14కు పెరిగిన మృతులు

జమ్ము : పాక్‌స్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత్ సరిహద్దు గ్రామాలపై జరిపిన కాల్పుల్లో గాయపడిన బిమ్లా దేవి ఆదివారం మరణించిందని పోలీసులు తెలిపారు. దీంతో జమ్ము మృతుల సంఖ్య 14 కు పెరిగింది. పాక్ సైన్యం ఈనెల 18 నుంచి 22 వరకు కాల్పులు జరుపుతూనే ఉంది. దేవి 22న తీవ్రగాయాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిందన్నారు.పాక్ జరిపిన కాల్పుల్లో ఆరుగురు భద్రతాదళాలు, ఏడుగురు పౌరులు మృతిచెందారు. భారత ప్రభుత్వం సరిహద్దు నియంత్రణారేఖ గ్రామాల నుంచి వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఇద్దరు పోలీసులు సహా ఆరుగురు మృతి

అలీఘర్ : దట్టమైన పొగమంచుతో రోడ్డు కనిపించక ఒక జీపు చెరువులో పడి ఇద్దరు పోలీసులతోసహా ఏడుగురు మృతి చెందారు. తనిఖీల నుంచి తిరిగి వస్తుండగా రోడ్డు చివర లోతైన చెరువు మంచులో కనిపించకపోవడంతో ఈ దుర్ఘటన జరిగిందని మృతి చెందిన వారిని సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ శర్మ (48) కానిస్టేబుల్ దేవేందర్ యాదవ్(28)గా గుర్తించామని పోలీసుల తెలిపారు. ఒక మధ్యవయస్సు మహిళ ఆమె కుమార్తె, బాలిక, బాలుడు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. జీపు డ్రైవర్ తప్పించుకున్నాడని పోలీసులు వెల్లడించారు.

కాశ్మీర్‌లో జనజీవనం అస్తవ్యస్తం

శ్రీనగర్ : వేర్పాటు వాదులు బంద్‌కు పిలుపు నివ్వడంతో జనజీవనం అస్త వ్యస్తం అయింది. షోపియాన్ జిల్లాలో భద్రతాదళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు యువకులు మృతి చెందడంతో వారు బంద్ చేపట్టారు. శ్రీనగర్, మరో నాలుగు జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. కాశ్మీర్‌లోని రోడ్డురవాణా సౌకర్యం నిలిచిపోగా, షాపులు, వ్యాపార కూడళ్లు మూసిఉంచారు. కాల్పుల్లో అనేకమందికి గాయాలయ్యాయి. అయితే దుండగులు విసిరిన రాళ్లతో అనేకమంది పోలీసులు గాయపడ్డారన్నారు.

జమ్ము పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని భద్రతాదళాలు వెల్లడించారు. షోపియాన్ జిల్లాలో శనివారం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మృతిచెందగా మరో 9 మంది గాయాలపాలైయ్యారని అధికారులు తెలిపారు. పోలీసులను లక్ష్యంగా చేసుకొని దుండగులు రాళ్లు విసరడంతో పోలీసులు కాల్పులు జరిపామంటున్నారు. ఈఘటనపై మెహబూబా ముఫ్తీ ప్రభుత్వం మెజిస్టీరియల్ దర్యాప్తుకు ఆదేశించింది. ఆత్మరక్షణకోసమే పోలీసులు కాల్పులు జరిపారని రక్షణ అధికార ప్రతినిధి వెల్లడించారు.

ఈవ్ టీజింగ్ ఘర్షణ

ముజఫర్‌నగర్ : ఈవ్ టీజింగ్ కారణంగా ఆదివారం రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తడంతో 8 మందికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు.శనివారం ఘర్షణ జరగడంతో ఆరుగురుపై కేసులు నమోదు చేసి ఇద్దర్ని అరెస్టు చేశామని పోలీసు అధికారి ప్రతాప్‌సింగ్ వెల్లడించారు. 17 ఏళ్ల యువతిని మరో కులానికి చెందిన వ్యక్తి వేధించాడని అతడిపై దాడి చేశారు. ఒకవర్గంపై మరొక వర్గం రాళ్లురువ్వుకోవడంతో గాయాలపాలైయ్యారు.

తమిళ జాలర్లను అరెస్టుచేసిన శ్రీలంక

రామేశ్వరం : శ్రీలంక నావికాదళం 12 మంది తమిళజాలర్లను ఆదివారం అరెస్టు చేసిందని తమిళ మత్స్యకారుల సంఘం వెల్లడించింది. ఆదేశం ఆధీనంలోని సముద్రజలాల్లో విదేశీ జాలర్ల వేటను నిషేధించి ఈ ఘటనకు పాల్పడింది. నావికాదళం 50 బోట్లను,వలలను స్వాధీనం చేసుకుందని పుదు చ్చేరి జాలర్ల అసోసియేషన్ ఎన్‌జేబోస్ తెలిపారు. దాదాపు 2000 మంది తమి ళ జాలర్లను లంక నావికాదళం వెంబడించి 50 బోట్లు, వలలు స్వాధీనం చేసుకుందన్నారు.

మేఘాలయలో ప్రాంతీయపార్టీలదే హవా

షిల్లాంగ్ : రాష్ట్రంలో ప్రాంతీయపార్టీలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని యునైటెడ్ డెమాక్రటిక్ పార్టీ (యూడీపీ) తేల్చి చెప్పింది. బీజేపీ,కాంగ్రెస్‌తో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని యూడీపీ సీనియర్ నాయకుడు తెలిపారు. ఫిబ్రవరి 27న ఆరాష్ట్రంలో ఎన్నికలు జరగనుండగా, ఫలితాలను మార్చి 3న ప్రకటిస్తారని యూడీపీ అధ్యక్షుడు లింగ్డో వెల్లడించారు. 15 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పాలనలో ఉన్న మేఘాలయ, అధికార వ్యతిరేకత ఎదుర్కొంటుందని, బీజేపీ అక్కడ పాగా వేయడం కోసం సర్వశక్తులూ ఒడ్డుతుందని లింగ్డో వివరించారు.

కర్నాటక బీజేపీ ఎమ్మెల్యే రాజీనామా

బెంగళూరు : బీజేపీలోని అంతర్గత కుమ్ములాట, వాగ్వివాదాలతో విసిగిపోయి ఎమ్మెల్యేపదవికి రాజీనామా చేస్తున్నానని విజయనగర బీజేపీ ఎమ్మెల్యే ఆనంద్ సింగ్ వెల్లడించారు. అసెంబ్లీ స్పీకర్ కేబీ కొలివాడ్‌కు ఆయన అధికార నివాసంలో రాజీనామాను అందచేశారు. ఆయనతోపాటే కార్యకర్తలు కూడా పార్టీని వీడారు. రెండు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు ఉండగా ఆయన రాజీనామా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆశాభోంస్లేకు యాష్‌చోప్రా అవార్డు

ముంబై : ప్రసిద్ధ నేపథ్య గాయని ఆశాభోస్లే(84)కు ప్రముఖ నిర్మాత యాష్‌చోప్రా మెమోరియల్ అవార్డును అందచేయనున్నారు. ఇప్పటివరకు ఆమె 11 వేల సినీగీతాలను పాడారు. ఆమె చూపిన ప్రతిభకు ఈ అవార్డును ప్రకటించారు. చోప్రా భార్య పామెల్లా చోప్రా, నిర్మాత బోనీకపూర్, మధుర్ బండార్కర్, గాయని అల్కాయోగ్నిక్ తదితరులు ఈ సెలక్షన్ కమిటీలో ఉన్నారు. ఫిబ్రవరి 16న మహారాష్ట్ర గవర్నర్ సి. విద్యాసాగర్ రావు ఆమెకు ఈ అవార్డు అందిస్తారు.

మార్చి1 నాటికి స్మార్ట్‌కార్డులు

తిరువారూర్ : తమిళనాడులోని అన్ని రేషన్ కార్డుల దారులకు మార్చి 1 నాటికి స్మార్ట్‌కార్డులు అందిస్తామని ఆ రాష్ట్ర మంత్రి కె.కామరాజ్ వెల్లడించారు. స్మార్ట్‌కార్డు ద్వారానే ఇకపై రేషన్‌ను సరఫరా చేస్తామన్నారు. ఈ ఏడాది 20 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ప్రధాన పూజారి కాల్చివేత

హజిపూర్ (బీహార్): రామ్‌జానకీ ముత్ దేవాలయ ప్రధాన పూజారిని ఆదివారం ఆలయంలోనే దుండగులు కాల్చిచంపారు. ఈ ఘటనలో ఆయన అనుచరుడు తీవ్రంగా గాయపడ్డారు. నిర్మానుష్య ప్రాంతంలో నెలకొన్న ఈ ఆలయంలో మౌనిబాబా (65), ఆయన అనుచరుడు రక్తపు మడుగులో పడి ఉండగా, ఆదివారం ఉదయం మరొక అనుచరుడు చూసి సమాచారం అందించాడని పోలీసులు తెలిపారు. మోనిబాబా 25 ఏళ్ల క్రిందట ఈ ఆలయాన్ని కట్టించి, అప్పటి నుంచి ఆయన మహంత్‌గా అక్కడ చెలామణి అవుతున్నారు.

ఎన్ఐఏకు ఉగ్రసంస్థకు ఆర్థిక సాయం కేసు

న్యూఢిల్లీ : నిషేధిత ఉగ్రవాద గ్రూపు హిజ్‌బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాది నసీర్ సఫీ మిర్ ,హురియత్ నాయకులకు ఆర్థిక సాయం అందిస్తున్నాడని నమోదైన కేసు విచారణను ఢిల్లీ పోలీసుల నుంచి జాతీయ నిఘాసంస్థకు బదిలీ చేశారు. మిర్ అలియాస్ బాబుల్ నేపాల్ మీదుగా యూరప్ పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. కార్పెట్ వ్యాపారంతో అధికలాభాలు గడించిన ఆయన హవాలా ద్వారా కాశ్మీర్ వేర్పాటు వాదులకు ఆర్థిక సాయం అందించేవాడని అభియోగాలున్నాయి.

గూడ్సు రైలు బోగీలో మంటలు



విశాలాంధ్ర- మంగళగిరి : గుంటూరు జిల్లా తాడేపల్లి కృష్ణాకెనాల్ సమీపంలో ఆదివారం గూడ్సు రైలు బోగీలో మంటలు చెలరేగాయి. మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఒరిస్సా నుంచి మద్రాస్‌కు బొగ్గు తరలిస్తున్న గూడ్సు రైలు కృష్ణాకెనాల్ జంక్షన్ వద్దకు చేరుకుంది. బోగీలో మంటలు వ్యాపించడంతో గమనించిన గూడ్సు గార్డు సమీపంలోని పెదవడ్లపూడి స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం అందించారు. మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది పెదవడ్లపూడి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. బోగీలో మంటతోనే గూడ్సు రైలు అక్కడకు చేరుకుంది. మంటలను అదుపు చేశారు. బోగీ మంటలను అదుపుచేసే క్రమంలో గంటపాటు ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భక్తులతో పోటెత్తిన శ్రీశైలం



విశాలాంధ్ర - శ్రీశైలం : ద్వాదశి రోజు శ్రీశైలానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున 3.30 గంటలకు మంగళ వాయిద్యాలు, 4 గంటలకు సుప్రభాతసేవ, 5 గంటలకు మహామంగళ హారతి కార్యక్రమాలను అర్చకులు ప్రారంభించారు. సాయంత్రానికి శ్రీశైలం క్షేత్రం పురవీధులు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం ఉదయానికి భక్తుల రద్దీ మరింత పెరగవచ్చని ఆలయ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే లక్ష మందికి పైగా భక్తులు స్వామివార్లను దర్శించుకున్నట్టు అంచనా. వేకువజామున 2.30 గంటల నుండే శీఘ్రదర్శన క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వసతి గదులు ఖాళీ లేకపోవడంతో భక్తులు ధ్యానవనాల్లో సేదతీరారు.



వడ్డెర్లను ఎస్టీల్లో చేర్చేవరకు విశ్రమించం

విశాలాంధ్ర - అనంతపురం టౌన్ : రాష్ట్రంలోని వడ్డెర్లను ఎస్టీ జాబితాలోకి తీసుకొచ్చేవరకు విశ్రమించబోమని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ప్రకటించారు. అనంతపురం జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగర వీధుల్లో వడ్డెర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం లలితా కళాపరిషత్ ప్రాంగణంలో వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లెల జయరాముడు అధ్యక్షతన జరిగిన సభలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తన్నీరు ఆంజనేయులు, సి. ఏడుకొండలు, వడ్డెర ఉద్యోగుల సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు కుంచాల కోటేశ్వరమ్మ, గౌరవాధ్యక్షులు వీరభద్రయ్య ప్రసంగించారు. సమాజంలో నేటికీ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. 2014 ఎన్నికల ముందు టీడీపీ మ్యానిఫెస్టోలో వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ప్రకటించిన చంద్రబాబునాయుడు గద్దెనెక్కి నాలుగేళ్లు గడుస్తున్నా హామీని నిలబెట్టుకోకుండా మోసం చేస్తున్నారన్నారు. రాజకీయ పార్టీలు కేవలం ఓట్ల కోసం వడ్డెర్లను ఉపయోగించుకుంటూ వారి సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులాల మధ్య చిచ్చుపెడుతోందని మండిపడ్డారు. బోయలను ఎస్టీల్లో, కాపులను బీసీ జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నదో వెల్లడించాలన్నారు. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో వడ్డెర విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చడం ద్వారా చట్టప్రకారం సంక్షేమ ఫలాలు దక్కితే రాజకీయంగా అవకాశాలు లభిస్తాయని, అన్నిరంగాల్లో వడ్డెర్లు రాణించే అవకాశం ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల హామీ నిలబెట్టుకోలేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో వడ్డెర్లు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పల్లకప్పం శేఖర్, మునిస్వామి, నందనరావు, కేవీ రమణ, బాలకొండయ్య, రామచంద్ర, జిల్లా నాయకులు చియ్యేడు రామకృష్ణ, బంగారప్ప, లక్ష్మినారాయణ, గోపాలకృష్ణ, రామచంద్ర, కేశన్న, వెంకటేసు, నారాయణస్వామి పాల్గొన్నారు.



దేశంలో తొలిసారిగా
అత్యంత అరుదైన మైక్రో సర్జరీ

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : స్థానిక సూర్యారావుపేట, డోర్నకల్ రోడ్‌లోని లైఫ్‌లైన్ త్రిమూర్తి హాస్పిటల్‌లో అత్యంత అరుదైన క్లిష్టమైన మైక్రో సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. 10 సంవత్సరాల బాలుడికి కుడి మణికట్టు, కుడి మోచేయి పైభాగం తీవ్రంగా నలిగిన చేతికి 12 గంటలు శ్రమించి శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స విజయవంతమై ఆ బాలుడు కోలుకుంటున్న సందర్భంగా వివరాలను లైఫ్‌లైన్ త్రిమూర్తి హాస్పిటల్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రముఖ ఆర్థోపెడిక్, హ్యాండ్ మైక్రోవాస్కులర్ సర్జన్ డాక్టర్ యిర్రింకి సురేష్ వెల్లడించారు. ఇటీవల ఏలూరు సమీపంలోని కొక్కిరాల గ్రామంలో ఈ నెల 6న జరిగిన ఘటనలో దావీదు (10) చేయి మోటార్‌లో పడి పూర్తిగా నుజ్జు, నుజ్జు అయి ఎముకలు విరిగిపోయాయి. మోచేయి, మణికట్టు వద్ద చర్మం, ఎముకలు, నరాలు, రక్తనాళాలు పూర్తిగా తెగి కొద్దిపాటి కండతో వేలాడుతున్న అత్యంత ప్రమాదకరమైన స్థితిలో ఉదయం గం. 7.30 ని.లకు తీసుకురాగా, గంట వ్యవధిలో శస్త్ర చికిత్స జరిగింది. విరిగిన ఎముకలను, నరాలను, రక్తనాళాలను ఒక క్రమ పద్ధతిలో కలుపుతూ శస్త్ర చికిత్స నిర్వహించారు. ఒకేచోట అతికించుట కష్టంకాగా అదే శస్త్ర చికిత్సను మోచేతి పై భాగం, మణికట్టు వద్ద రెండు చోట్ల నిర్వహించి ఘన విజయం సాధించారు. దేశంలోనే అత్యంత అరుదైన శస్త్ర చికిత్స అందించగలిగిన ఆసుపత్రిగా లైఫ్‌లైన్ త్రిమూర్తి హాస్పిటల్ గుర్తింపు స్వంతం చేసుకుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రముఖ జనరల్ సర్జన్ డా॥ త్రిమూర్తి రావు, ఆర్థోపెడిక్ సర్జన్ డా॥ బి.రవితేజ, ఎనస్తీషియన్ డా॥ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : మిత్రులతో కలిసి విహార యాత్రలకు వెళ్లిన ఇద్దరు యువకులు బుట్టాయిగూడెం మండ లం దండిపూడి గ్రామంలోని బైనేరు వాగులో మునిగి చనిపోయారు. పశ్చిమగోదావరిజిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన ఏడుగురు యువకులు ఆదివారం బుట్టాయిగూడెం మండలంలోని మారుమూల గ్రామమైన దండిపూడి విహారయాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనాలు చేసిన తరువాత స్నానానికి నిమ్మగడ్డ లక్ష్మినారాయణ వాగులోకి దిగి జారిపడిపోయాడు. అతన్ని రక్షించేందుకు అడపా గణపతి ప్రయత్నించడంతో అతనూ వాగులో పడిపోయాడు. ఒడ్డునున్న ఐదుగురు గ్రామస్తులను గ్రామస్తులకు సమాచారం ఇచ్చి వచ్చేలోగా లక్ష్మీనారాయణ, గణపతి మృతి చెందారు. పోలీసులు గ్రామస్తుల సహాయంతో మృతదేహాలను బయటకు తీసి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ అల్లు దుర్గారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలాస ఆప్కోలో అగ్నిప్రమాదం



విశాలాంధ్ర - పలాస : శ్రీకాకుళం జిల్లా పలాసలోని కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదురుగా ఉన్న ఆప్కో వస్త్రాలయంలో ఆదివారం వేకువజామున అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ. 25 లక్షల విలువైన వస్త్రాలు కాలి బూడిదయ్యాయి. ఉదయం ఆరు గంటలకు షాపు నుంచి దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఆప్కో మేనేజర్ లక్ష్మణరావు నరసన్నపేట వాసి. ఆదివారం సెలవు రోజు ఆయన స్వగ్రామానికి వెళ్లడంతో షాపు తాళాలు అందుబాటులో లేక తలుపులు తెరిచేందుకు వీలుకాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బంది షాపు తాళాలు బద్దలుగొట్టి మంటలను అదుపులోకి తెచ్చారు. కొద్దిసేపటికి పలాస చేరుకున్న లక్ష్మణరావు అగ్నిప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాశీబుగ్గ సీఐ కె.అశోక్‌కుమార్ ఘటనా స్థలిలో వివరాలు సేకరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఆ సమయంలో షాపులో రూ. 60 లక్షల విలువైన వస్త్రాలు ఉన్నట్లు మేనేజర్ లక్ష్మణరావు వివరించారు.

రైతు ఆత్మహత్యలకు కారణాలెన్నో..

- చుట్టుముడుతున్న తెగుళ్లు
- నకిలీ విత్తనాలు, పురుగుమందులు
- కానరాని మద్దతు ధర
- కౌలు రైతులకు బ్యాంకు రుణాల చిక్కులు
- ప్రైవేటు వడ్డీలతో రుణభారం
- ఆత్మహత్యల నియంత్రణకు కార్యాచరణ ఏదీ



గుంటూరు జిల్లాపరిషత్ కార్యాలయంలో ఈనెల 22వ తేదీన మీకోసం కార్యక్రమంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు శివప్రసన్నబాబు(ఫైల్‌ఫొటో)

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : రాష్ట్ర వ్యవసాయంలో రెండంకెల అభివృద్ధి సాధిస్తున్నామని అధికారులు చెబుతున్నా రైతుల ఆర్థిక స్థితిగతుల్లో కనీస మార్పులు కానరావడంలేదు. పంటను పీల్చిపిప్పి చేస్తున్న తెగుళ్లు, పుట్టిముంచుతున్న నకిలీ విత్తనాలు, పురుగుమందులతో నష్టాలు సర్వసాధారణమయ్యాయి. బ్యాంకుల నుంచి రుణాలు దక్కకపోవడంతో కౌలు రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. ఇలా రకరకాల కారణాలు చుట్టుముట్టడంతో మరో దారి లేక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత మూడేళ్లలో ఒక్క గుంటూరు జిల్లాలో 54మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మిర్చి, అపరాలను ఏటా లక్షలాది హెక్టార్లలో సాగు చేస్తుంటారు. మూడేళ్లుగా లాభాలు రాకపోగా పెట్టుబడులు చేజారడంతో రైతుల కుటుంబాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఎకరం భూమిలో మిర్చి సాగుకు కనీసం లక్ష రూపాయలు పెట్టుబడి అవుతుంది. కౌలు రైతులకు మరో రూ.30 వేలు అదనం. ఈ నేపథ్యంలో ఎకరానికి కనీసం 30 క్వింటాళ్ల దిగుబడులు వచ్చి, క్వింటా రూ.6 వేల పైబడి ధర ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ధర ఏమాత్రం తగ్గినా నష్టాల్లో చిక్కుకోవాల్సిందే. గత ఏడాది కనీస ధర లేకపోవడంతో మిర్చి రైతు నిండా మునిగి నష్టపోయారు. దీంతో కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఏడాది జిల్లాలో సాగు చేసిన మిర్చి పంటకు బొబ్బర తెగుళ్లు, ముజాయిక్ వైరస్ తెగులు, ఎర్ర తెగులు చుట్టుముట్టడంతో ఎండిపోతున్నాయి. దిగుబడులు సగానికి పడిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. గత ఏడాది మద్దతు ధరలు లేక నష్టపోతే, ఈ ఏడాది తెగుళ్లు కొంపముంచాయని రైతులు కుమిలిపోతున్నారు.

గులాబీ రంగు పురుగుతో పత్తి రైతు విలవిల

పత్తి పంటకు గులాబీ రంగు పురుగు సోకడంతో రైతు తల్లడిల్లిపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.84 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేశారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. కౌలు రైతు అయితే అదనంగా మరో రూ.15వేలు. పంటను గులాబీరంగు పురుగు చుట్టుముట్టడంతో దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. ఆరంభంలో ధర లేకపోవడంతో క్వింటా రూ.3,500 చొప్పున అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎకరానికి ఏడు నుంచి పది క్వింటాళ్లు మాత్రమే దిగుబడులు రావడంతో నష్టాలపాలయ్యారు. కౌలు రైతులు పూర్తిగా అప్పుల్లో మునిగిపోయారు.

నిండా ముంచుతున్న నకిలీలు

నకిలీ ఉత్పత్తులకు కేంద్రంగా మారిన గుంటూరు జిల్లా రైతు కుటుంబాల్లోనూ కల్లోలం సృష్టిస్తోం ది. నకిలీ పురుగుమందులు, విత్తనా లు, బయో ఉత్పత్తులు రైతుల జీవితా లతో చెలగాటమాడుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన వ్యవసాయశాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ రైతుల ఆత్మహత్యలకు పరోక్షంగా కారణమవుతున్నారనే విమర్శలు లేకపోలేదు. నకిలీ వ్యాపారులు ఏటా కోట్లాది రూపాయిల నకిలీ ఉత్పత్తులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వీటిని నియంత్రించకపోతే రైతుల ఆత్మహత్యల పరంపర మరింత వేగంగా కొనసాగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కౌలు రైతులకు కన్నీరే

జిల్లాలో 1.60 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. ఈ ఏడాది వీరిలో 36,478 మందికి సుమారు రూ.137 కోట్లు రుణాలు ఇచ్చాయి. మిగిలిన వారికి బ్యాంకులు మొండిచేయి చూపడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. సాగులో నష్టాలు, అధిక వడ్డీలు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దీంతో అనేక రైతు కుటుంబాలు ఆధారం లేక రోడ్డున పడుతున్నాయి.

ఆత్మహత్యల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అవసరం

అన్నదాతల ఆత్మహత్యల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాగులో నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం సకాలంలో ఆదుకునేలా పథకాలు ప్రవేశపెట్టాలని కోరుతున్నారు.



జేఎన్‌టీయూకేలో విద్యార్థుల నిరసన జ్వాల

- కీచక ప్రొఫెసర్ వికృత చేష్టలపై తిరుగుబాటు
- మూడుగంటలపాటు నిరసనతో గందరగోళం
- వీసీ హామీతో ఆందోళన విరమణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జేఎన్‌టీ యూకే విద్యార్థులు ఆదివారం ఒక్కసారిగా ఆందోళన కు పూనుకోవడంతో వర్సిటీ ప్రాంగణంలో గందంగోళం నెలకొంది. ఓ ప్రొఫెసర్ వికృత చేష్టలపై విద్యార్థునుల తిరుగుబాటుకు సహచర విద్యార్థులు అండగా నిలిచారు. మూడు గంటల పాటు మిన్నంటి న నినాదాలతో వర్సిటీ ప్రాంగణం మార్మోగింది. జేఎన్‌టీయుకేలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్, ప్రొఫెసర్ కె.బాబు తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నందున తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఎంటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినులు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన ప్రవర్తన జుగుప్సాకరంగా ఉందని, అలాంటి ప్యాకల్టి తమ కొద్దంటూ పేర్కొన్నారు. దీంతో స్పందించిన వైస్‌ఛాన్సలర్ కుమార్ వెంటనే రెక్టార్ పూర్ణానందం చైర్మన్‌గా ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీతో విచారణకు ఆదేశించారు. తమకు న్యాయం జరిగే పరిస్థితులు కానరావడం లేదంటూ ఆదివారం సాయంత్రం యూనివర్సిటీ ఆవరణలో విద్యార్థులు ఆందోళనకు పూనుకున్నారు. మూడు గంటల పాటు నిరసనలతో ఉద్రిక్త వాతావర్ణం నెలకొంది. పోలీసులు చర్చించినప్పటికీ ఫలితం కానరాలేదు. తక్షణ పరిష్కారం చూపకపోతే తరగతులను బహిష్కరించి ఆందోళనను తీవ్రతరం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కుమార్ విద్యార్థులతో చర్చించారు. ఎట్టకేలకు అసభ్యంగా ప్రవర్తించిన ప్రొఫెసర్ కె.బాబును డైరెక్టర్,పీజీ విభాగం ప్రొఫెసర్ బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్టు వీసీ ప్రకటించారు. ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

ఆ దవాఖానాకెళ్తే ప్రాణాలు గాలిలోకే !

- నెల్లూరు పెద్దాస్పత్రిలో ప్రాణాలతో చెలగాటం
- పరాకాష్టకు చేరిన వైద్యుల నిర్లక్ష్యం
- సర్వత్రా ఆగ్రహావేశాలు

మొన్న రోగి కడుపులో కత్తెర... తాజాగా గాజుగుడ్డ



విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : రాష్ట్రంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు అందుతున్నట్టు ప్రభుత్వ పెద్దలు పదేపదే ప్రకటనలు చేస్తున్నా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం రోగులను భయాందోళనకు గురిచేస్తోంది. ఆపరేషన్ల సమయంలోనూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తీరు కలకలం రేపుతోంది. నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రెండు నెలల క్రితం ఓ రోగి కడుపులో కత్తెర వదిలేసి కుట్లు వేసిన ఘటన మరువకముందే ఓ మహిళ శరీరంలో గాజుగుడ్డ పెట్టి కుట్లు వేసిన దారుణం తాజాగా వెలుగు చూసింది. కోవూరు మండలం వావిళ్లకు చెందిన మల్లెపు నిర్మల అనారోగ్యంతో మూడు సంవత్సరాల కిందట నెల్లూరు పెద్దాసుపత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు 24 గంటల కడుపునొప్పిగా నిర్ధారించి వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించారు. అక్కడే వైద్యులు ఆపరేషన్ చేసి ఇంటికి పంపించారు. ఆ తర్వాత తరచూ కడుపులో నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో నిర్మల ఇతర ఆస్పత్రుల చుట్టూ తిరుగుతోంది. వైద్యులు ఇచ్చిన మందులకు తాత్కాలిక ఉపశమనం కలుగుతున్నా నొప్పి కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆమెకు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించడంతో కడుపులో గాజుగుడ్డ ఉన్నట్లు బయటపడింది. ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేకపోవడంతో ఆదివారం ఆమె మళ్లీ కోవూరు ప్రభుత్వాస్పత్రిలో ఆపరేషన్ చేయించు కుంది. డాక్టర్లు కడుపులో నుంచి సుమారు 250 గ్రాముల గాజుగుడ్డను బయటకు తీశారు. మూడు సంవత్సరాల క్రితం పెద్దాస్పత్రిలోని వైద్యుల నిర్వాకం బయటపడడంతో రోగి బంధువులు మండిపడుతున్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై తరచూ రోగులు ఆగ్రహం వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది.

పెళ్లిచూపులకొస్తూ మృత్యుఒడిలోకి..

- లారీ ఢీకొని ముగ్గురు దుర్మరణం
- ఆగ్రహించిన గ్రామస్తులు విధ్వంసం
- చిత్తూరు జిల్లాలో ఘటన

విశాలాంధ్ర - శాంతిపురం : పెళ్లిచూపులకు వస్తున్న ఓ బృందం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా శాంతిపురం మండల పరిధిలోని సి బండపల్లి గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని క్వారీ లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. గుడుపల్లి మండలం ఎ.కొత్తపల్లికి చెందిన మనోహర్ భార్య మమత(22), అత్త నారాయణమ్మ(50), కూతురు యశ్వంతిక (1.5), బావ మరిది రాజప్ప(25) శాంతిపురం మండలంలో పెళ్ళి చూపులకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. క్వారీ లారీ ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, రాజప్ప గాయాలతో బయట పడ్డాడు. నిత్యం ఈ దారిలో రత్న మినరల్స్ క్వారీ నుంచి భారీ వాహనాలతో రాళ్ళు తరలిస్తుం టారు. సింగిల్ మార్గం కావడంతో అతివేగంతో వాహనాల రాకపోకలపై గతం నుంచి స్థానికులు హెచ్చరిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనతో ఆగ్రహించిన గ్రామస్తులు ఒక్కసారిగా క్వారీపై రాళ్ళతో దాడి చేసి నిప్పంటించారు. అడ్డుకున్న రాళ్ళబుడుగూరు ఏఎస్సైతోపాటు పోలీసులపైనా దాడికి పాల్పడ్డారు. సీఐ రాజశేఖర్, ఎస్సై వెంకటశివకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు తప్పే!



విశాలాంధ్ర - విశాఖపట్నం : పార్టీలు ఫిరాయించిన శాసనసభ్యులకు మంత్రి పదవులివ్వడం తప్పేనని తాను గతంలో చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని విశాఖ ఉత్తర శాసనసభ్యులు పి.విష్ణుకుమార్‌రాజు పునరుద్ఘాటించారు. విశాఖలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను వైసీపీలో చేరుతున్నట్టు వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడడంపై వివాదం రేగిందని, వాస్తవంగా అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడే అవకాశం లేకపోవడంతో పక్కనున్న అక్కడ మాట్లాడాల్సి వచ్చిందన్నారు. తన వ్యాఖ్యలను రాజకీయకోణంలో చూడకూడదన్నారు. విశాఖకు రైల్వేజోన్ సాధన కోసం ఎవరు పోరాటం చేసినా తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



కల్లూరులో ఉద్రిక్తత

విశాలాంధ్ర - కల్లూరు : చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో ముస్లింల మధ్య అంతర్గత వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. కల్లూరు బీసీ కాలనీ సమీపంలోని మసీదు, మదరసా నిర్మాణాలను ఆదివారం ముస్లింలలోని అలెసున్నితల్ వర్గానికి చెందిన సుమారు 300 మంది ధ్వంసం చేశారు. మసీదు, మదరసా ప్రహరీగోడ, పిల్లర్స్‌ను రాడ్లు, సుత్తులు, గడ్డపారలతో నేలమట్టం చేశారు. ఇప్పటి వరకు కల్లూరులోని 5 మసీదులు తాజాగా బీసీ కాలనీలో నిర్మిస్తున్న మసీదు, మదరసా అహలే హదీష్ వర్గానికి చెందినది కావడంతో వారు ఆలెసున్నితల్ మతాన్ని వ్యతిరేకించేవారు. దీనిపై 10 రోజులుగా వివాదాలు, చర్చలు కొనసాగుతున్నాయి. కల్లూరు పోలీసులు ఆదివారం ఇరువర్గాలతో చర్చించారు. అయితే సకాలంలో పోలీసులు రాకపోవడంతో ఓపిక పట్టలేని ఆలెసున్నితల్ వర్గీయులు బీసీ కాలనీకి చేరుకుని గంట పాటు విధ్వంసాన్ని కొనసాగించారు. దీనితో ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం నెలకొంది. మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే సాహసం చేయలేక పోయారు. సమాచారం అందుకున్న సీఐ రామలింగయ్య, ఎస్సైలు విశ్వనాధనాయుడు, మురళీమోహన్, వెంకటేశ్వర్లు, చాన్‌బాషాలు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అనంతరం మత పెద్దలతో సీఐ చర్చించారు. తమ ఊరులో అటువంటి మసీదులు, మదరసాలు నిర్మిస్తే మత కలహాలు చెలరేగే అవకాశం ఉందని మత పెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు.

దాడులకు తెగబడుతున్న దొంగలు

- ప్రత్యేక వ్యానుల్లో పశువుల చోరీ
- పోలీసులపైనే అనంత దొంగల దాడులు
- కళ్యాణదుర్గం, గుంతకల్లు ప్రాంతాల్లో భయాందోళనలు

విశాలాంధ్ర ప్రతినిధి - అనంతపురం : జిల్లాలో పందులు, పశువుల దొంగల ముఠాలు పేట్రేగిపోవడం పశుపోషకుల్లో అలజడి రేపుతోంది. ఏకంగా పోలీసులపైనే దాడులకు తెగబడటం చర్చనీయాంశమైంది. తాజాగా ఈ ముఠాలను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులపై రాళ్లతో దాడులు చేయడం, పోలీసు వాహనాన్నే గుద్దించే ఎక్కించే ప్రయత్నం చేయడం ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలోని కళ్యాణదుర్గం, గుంతకల్లు పోలీసు సబ్‌డివిజన్ ప్రాంతాల్లో అనుమానిత వాహనాలను వెంబడించాలన్నా పోలీసులు సైతం ఆలోచిస్తున్నట్టు సమాచారం. తాజాగా శనివారం అర్ధరాత్రి అనంతపురం పట్టణంలో పశువుల దొంగలు చేసిన వీరంగం, పోలీసులు వెంబడించడం, పోలీసు వాహనంపై దొంగలు దాడులకు తెగబడి తీరు సినీ ఫక్కీలోలా కొనసాగింది. జిల్లాకేంద్రంలో దొంగలను వెంబడించిన పోలీసు వాహనాన్ని ధ్వంసం చేయడంతోపాటు కంకర రాళ్లతో దాడి చేస్తూ తప్పించుకు పోవడం చూస్తుంటే ఎంతకు తెగిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు ఉన్నప్పటికీ దర్జాగా వెళ్లిపోవడంపై చర్చ సాగుతోంది. జిల్లా కేంద్రంలోనే దొంగలను పట్టుకోలేకపోతే మారుమూల ప్రాంతాల్లోని సిబ్బంది ఏమి చేయగలరనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో గతంలో ఆత్మకూరు పోలీసుస్టేషన్ పరిధిలో పందుల దొంగలు పోలీసులను ముప్పతిప్పలు పెట్టారు. గుత్తి ప్రాంతంలో గాడిదల దొంగలు ఇలానే పోలీసులపై దాడులు చేశారు. గడచిన సంవత్సర కాలంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో దొంగల ఆగడాలు తీవ్రతరమైనట్టు తెలుస్తోంది. జిల్లా సరిహద్దు ప్రాంతాలు, కర్ణాటక సరిహద్దుల్లో ఈ రకమైన చోరీలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. గుంతకల్లు, కళ్యాణదుర్గం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఒక ఎస్సై, సీఐ టీమ్‌లపై సైతం దొంగలు దాడులకు తెగబడినట్లు సమాచారం. ఆరు నెలల క్రితం ఎంహెచ్ 49, ఏపీ 3949 వాహనంలో పోలీసులపై దాడికి యత్నించినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు తెలిస్తే పోలీసుల పరువు పోతుందన్న భయంతో మిన్నకుండిపోయినట్లు వినికిడి. దొంగల వాహనంలో చోరీలకు బయలుదేరే వారిలో 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన ఎనిమిది నుంచి పది మంది ముఠా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటారని తెలుస్తోంది. వీరికి ఆయా ప్రాంతాల్లోని కొందరు పోలీసుల సహకారం కూడా ఉండడంతోనే యథేచ్ఛగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్టు పోలీసు వర్గాల్లోనే చర్చ జరగడం గమనార్హం. కొంత మంది ద్వారా ముందస్తు సమాచారంతో దొంగల ముఠా పేట్రేగిపోతున్నట్లు తెలిసింది. కళ్యాణదుర్గం, గుంతకల్లు పోలీసు సబ్‌డివిజన్‌కు పరిమితమైన దొంగల ముఠా కార్యకలాపాలు జిల్లా కేంద్రానికి పాకడం, పోలీసులపైనే దాడులకు పూనుకోవడం పోలీసుల్లో కలకలం రేపుతోంది.

పఠాన్ ఖాశీంఖాన్ విగ్రహావిష్కరణ నేడు



విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : పేదలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం కడవరకు శ్రమించిన ఆదర్శ కమ్యూనిస్టు పఠాన్ ఖాశీంఖాన్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం జరగనున్నదని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పులుపుల వెంకట శివయ్య స్థూపం సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఖాశీంఖాన్ విగ్రహాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ఆయనతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ సంద్రపాటి సైదా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఖాజీపూర్ జానిబి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వరప్రసాద్ కోరారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడిన ఖాశీంఖాన్ తుదిశ్వాసవిడిచే వరకు ప్రజాసమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేశారు. వినుకొండ పంచాయతీ కార్యాలయంలో రెండు దశాబ్దాలపాటు ఎర్రజెండాను రెపరెపలాడించారు. మచ్చలేని నాయకుడు, నీతిగల ప్రజాప్రతినిధిగా ఆయన పేరుగడించారు. ఆదర్శ ప్రజాప్రతినిధిగా గుర్తింపు పొందారు. వినుకొండ మున్సిపాలిటీగా మారిన తరువాత కూడా కమ్యూనిస్టుల ఆధీనంలోనే ఉండటానికి ఆయన వేసిన పునాదులే కారణం. ఖాశీంఖాన్ కృషి నేటితరానికి స్ఫూర్తిదాయకం.

భూ వివాదాల్లో తెలుగు తమ్ముళ్లు...!

- భూ దందాలు, సెటిల్‌మెంట్‌ల జోరు
- నకిలీ పత్రాలతో దొంగ రిజిస్ట్రేషన్‌లు
- అనుచరులతో దాడులు, బెదిరింపులు
- వివాదాస్పదమవుతున్న కొందరి నేతల తీరు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెలుగు తమ్ముళ్లు పేట్రేగిపోతున్నారు. అడ్డగోలుగా భూ కబ్జాలు, ఆక్రమణలతోపాటు నకిలీ పత్రాలు సృష్టించి ఏకంగా స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన స్థలాలనే కొట్టేసేస్థాయికి ఎదిగారు. రాష్ట్ర విభజన తర్వాత భూముల ధరలు అమాంతంగా పెరగటంతో స్థానిక ప్రజా ప్రతినిధులు మొదలు ఎమ్మెల్యేలు, మంత్రులుసైతం భూ కుంభకోణాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జోక్యం చేసుకుంటున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఉద్దేశంతో తెలుగు తమ్ముళ్లు ఉన్నట్లుగా కనిపిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు, అమాత్యులు సెటిల్‌మెంట్‌లు చేయటంతోపాటు వివాదస్పద భూముల్లో జోక్యం చేసుకుంటూ అక్రమార్జనకు పాల్పడుతన్నారు. అమాయకుల ఆస్తులను అప్పనంగా కొట్టేస్తున్నారు. తాజాగా విజయవాడకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులు స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన కోట్ల రూపాయిల ఆస్తిని నకిలీ పత్రాలతో అన్యాయంగా రిజిష్టర్ చేయించుకున్నారు. దీనిపై సదరు ఎమ్మెల్యే సతీమణిపై సీఐడీ కేసు నమోదు చేయడం చూస్తేనే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. గుంటూరు జిల్లాకు చెందిన మరో మంత్రి భార్య కూడా నకిలీ విత్తనాల కుంభకోణంలో ప్రముఖ పాత్ర పోషించినట్లు ఆరోపణలున్నాయి. కొందరు అమాత్యులూ తమ అనుయాయుల సహాయంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భూ దందాలు, సెటిల్‌మెంట్లు చేస్తూ అవసరమైతే దాడులకు తెగబడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా గెలిపించిన ప్రజలకే శఠగోపం పెడుతున్నారు. మాట వినని ప్రభుత్వాధికారులపై దాడులు, కాల్‌మనీ కుంభకోణాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అమాత్యుల కుమారులే మహిళలపై వేధింపులు...ఇలా ఒక్కటేమిటి అధికార నేతల ఆగడాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ప్రజా ప్రతినిధులపై వచ్చిన ఆరోపణలు...

♦ విజయవాడలో కీలక నేతగా ఉన్న టిడిపి ఎమ్మెల్యే బొండా ఉమ మరోసారి భూ వివాదంలో చిక్కుకున్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు కేసిరెడ్డి సూర్యనారాయణకు కేటాయించిన భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేయడానికి ప్రయత్నించిన ముఠాలో బొండా ఉమ సతీమణి సుజాత ఉండటం సంచలనం రేకెత్తింది. బాధితుడు కేసిరెడ్డి సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన సిఐడి, ఎమ్మెల్యే సతీమణి బొండా సుజాతపై కేసు నమోదు చేశారు. గతంలో విజయవాడ దుర్గాపురం ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్ ఆక్రమణ విషయంలోనూ బొండా అనుచరులు ఉన్నట్లు విమర్శలున్నాయి. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కుమార్తె ఉంటున్న ఒక మహిళను బలవంతంగా భవనం ఖాళీ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

♦ జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుపైనా భూదందా ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం హైదరాబాద్ యూసఫ్‌గూడాలో నివసిస్తున్న ప్రవీణ, సురేష్ దంపతులు మంత్రి దేవినేని తమను భూమి కోసం బెదిరిస్తున్నారని హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంత్రి దేవినేని ఉమతో పాటు అతని సోదరుడు చంద్రశేఖర్, అనుచరులు నాని, రాజేందర్‌లు అమరావతి లోని తమ భూమిని ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారని కొద్ది రోజుల క్రితం డీజీపీ మాలకొండయ్యనూ ఆశ్రయించారు.

♦ కృష్ణాజిల్లా పెడన మున్సిపాలిటీలో అధికారపార్టీకి చెందిన పెడన మున్సిపాల్టీ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాల్ ఏకంగా ప్రభుత్వ భూమినే కబ్జా చేశారు. సుమారు రూ.50 లక్షలు విలువైన భూమిని కొట్టేయడంతో కొందరు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ విచారణలో అక్రమాలు నిజమని తేలడంతో బాధ్యులైన ఇద్దరు మున్సిపల్ కమిషనర్లను, ముగ్గురు టౌన్ ప్లానింగ్ అధికారులను, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశారు. వేణుగోపాల్ అక్రమ లేఅవుట్లు వేసి ప్రభుత్వానికి ఎటువంటి పన్నులు కట్టకుండా రూ.2.50 కోట్లు ఎగవేసినట్లు అధికారులు కనుగొన్నారు. వేణుగోపాల్‌పై విచారణ జరుగుతోంది.

♦ పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి మండలం, జానంపూడిలో దళితులకు చెందిన విలువైన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు అతని అనుచరులపైనా పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎమ్మెల్యేపై ఫిర్యాదు అందిన వెంటనే కౌంటర్ ఫిర్యాదు దాఖలైంది. ఎమ్మెల్యేను మినహాయించి ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేసిన పోలీసులు రాజీ చేసుకొమ్మంటూ బాధితులకు సలహా ఇచ్చినట్లు విమర్శలున్నాయి.

♦ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశాఖ భూ కుంభకోణం వ్యవహారంలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. గ్రేహౌండ్స్ డీఐజీ వినీత్‌బ్రిజాల్ ఆధ్వర్యంలోని సిట్ 30 మందిపై కేసు నమోదు చేసింది. విశాఖపట్నానికి చెందిన తెలుగుదేశం మాజీ కార్పొరేటర్ మన్యాల సోమేశ్వరరావును భూదందా కేసులో అరెస్ట్ కూడా చేశారు. బాధితుల నుంచి 183 ఫిర్యాదులు సిట్‌కు అందాయి. కుంభకోణంలో తారుమారైన మొత్తం 349 ఎకరాల విలువ బహిరంగమార్కెట్లో సుమారు రూ.10 వేల కోట్లుకు పైగానే ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

అగ్రిగోల్డ్ ఏజెంట్లపై దాడి

- గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏజెంట్లు
- దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు



దాడిలో గాయపడిన ఏజెంట్లను పరామర్శిస్తున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తదితరులు

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు/ త్రిపురాంతకం(ప్రకాశంజిల్లా) : ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో ఆదివారం అగ్రిగోల్డ్ ఏజెంట్లు గ్రంధిశిల సునీల్, సోమశేఖర్‌లపై ముగ్గురు బాధితులు దాడి చేశారు. దాడిచేసినవారిని అదేప్రాంతానికి చెందిన రంగారెడ్డి, మహేష్‌రెడ్డి, రమణారెడ్డిలుగా గుర్తించారు. వీరు ముగ్గురూ గతంలో అగ్రిగోల్డ్ సంస్థ ఏజెంట్లు సునీల్, సోమశేఖర్ల ద్వారా రూ.5 లక్షలు సంస్థలో జమచేశారు. అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో జమ చేసిన సొమ్ములు తిరిగిరాలేదు. ఈనేపథ్యంలో వీరు పలుమార్లు అనేక పర్యాయాలు ఒత్తిడిచేయగా ఇద్దరు ఏజెంట్లు రూ.2.50లక్షలు తిరిగి వారికి చెల్లించారు. ఇంకా రూ.2లక్షల బాధితులకు చెల్లించాల్సిఉంది. అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులు వేలం వేసిన తర్వాత ప్రభుత్వం చెల్లిస్తుందని ఎన్నిసార్లు బాధితులకు ఏజెంట్లు చెప్పినప్పటికీ వారు మాట వినలేదు. ఈనేపథ్యంలో ఆదివారం ఇరువురికి మధ్య వివాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన రంగారెడ్డి, మహేష్‌రెడ్డి, రమణారెడ్డిలు కలిసి ఇద్దరు ఏజెంట్లపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. గాయపడిన ఇద్దరిని తొలుత ఎర్రగొండపాలెం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈనేపథ్యంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నాయకులు మీసాల శ్రీనివాస్‌లు వారిని పరామర్శించి, తాము అండగా ఉన్నామని గాయపడిన ఏజెంట్లకు భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడేళ్లగా ఎంతో పట్టుదలతో అగ్రికంపెనీ మోసాన్ని ఎండగట్టి జమచేసిన డబ్బును తిరిగి ఇప్పించడానికి నిజాయితీగా శ్రమిస్తున్న అగ్రిగోల్డ్ ఏజెంట్లపై దాడిచేయడం దుర్మార్గమన్నారు. కాల్‌మనీ వ్యాపారులు రంగారెడ్డి, మహేష్‌రెడ్డి, రమణారెడ్డిలపై హత్యాయత్నం కేసులను నమోదు చేసి అరెస్ట్ చేయాలని వారు డిమాండు చేశారు. త్రిపురాంతకం ఎస్ఐ త్యాగరాజు మాట్లాడుతూ దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

పంజాగుట్ట స్టేషన్‌కు గజల్ శ్రీనివాస్

విశాలాంధ్రబ్యూరో- హైదరాబాద్: లైంగిక వేధింపుల కేసులో నిందితుడైన గజల్ శ్రీనివాస్ ఆదివారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయన ప్రతి ఆదివారం, బుధవారం వ్యక్తిగతంగా పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాల్సి ఉంది. నాంపల్లి కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

రాజకీయ వ్యవస్థ మార్పుకే సంకల్పయాత్ర



సంకల్పయాత్రలో జగన్

విశాలాంధ్ర - గూడూరు : భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థ సమూల మార్పునకు ప్రజా సహకారం అవసరమని వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. సంకల్పయాత్ర ఆదివారం గూడూరు పట్టణానికి చేరుకున్నది. ఈ సందర్భంగా కోర్టు సెంటర్ వెంకటగిరి రోడ్డులో బస్సుపై నుండే జగన్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. చెడిపోయిన రాజకీయ వ్యవస్థను బాగుపరిచేందుకు సంకల్పయాత్ర పేరుతో బయల్దేరిన మీ బిడ్డను ఆశీర్వదించాలని ప్రజలనుద్దేశించి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పాలన నాలుగేళ్లు పూర్తి కావచ్చిందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈ ప్రభుత్వంలో అవినీతి అధికమై పోయిందన్నారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని సైతం మిగుల్చుకునేందుకు వెనుకాడడం లేదన్నారు. ముఖ్యమంత్రి స్థాయి నుండి జన్మభూమి కమిటీల వరకూ అందరూ దోచుకుంటున్నా రన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గెలిచిన తర్వాత నెరవేర్చకపోతే ఆ పదవి నుండి స్వచ్ఛందంగా తప్పుకునే రాజకీయాలు రావాలన్నారు. అటువంటి రాజకీయాల కోసమే తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యారంగా నికి, నిరుపేదల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. దుగ్గరాజుపట్నం పోర్టు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా ముఖ్యమంత్రి మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా పై పెదవి విప్పడం లేదన్నారు. గూడూరు ప్రాంతంలో 40వేల ఎకరాల్లో నిమ్మసాగవుతోం దన్నారు. బస్తా ధర కేవలం 500రూపాయలు మాత్రమే ఉండడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నా రన్నారు. ఆరుగాలం శ్రమించే రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలత, కోడూరు మీరారెడ్డి దంపతులు జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్యనాయుడు, గౌతమ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నేదురుమిల్లి పద్మనాభరెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయ కర్త మేరిగ మురళి, మెట్టా రాధా కృష్ణారెడ్డి, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, మఖ్దూం మొహిద్దీన్, చోళవరం గిరిబాబు పాల్గొన్నారు.

టీడీపీతో దోస్తానా ?

- పవన్ పయనమెటు ?
- అధికార నేతలతో మంతనాలు దేనికి సంకేతం?
- బీజేపీపై మౌనమేమిటి?
- ప్రభుత్వాలకు పాజిటివ్ విన్నపాలా ?
- గందరగోళంలో జనసైనికులు, ఆశావహులు



విశాలాంధ్ర-అమరావతి : జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అనంతపురం జిల్లా పర్యటనలో వ్యవహరిస్తున్న తీరు, చేస్తున్న ప్రసంగాలు ఆ పార్టీ కార్యకర్తలు, ఆ పార్టీలో చేరాలనుకుంటున్న నేతలను గందరగోళానికి గురి చేస్తోంది. చలోరే.. చలోరే... చల్ పేరిట ఆయన శనివారం నుండి అనంతపురం జిల్లాలో పర్యటన ప్రారంభించారు. అనంతపురంను దత్తత తీసుకున్నానన్నారు. అనంతపురం అభివృద్ధి కోసం ప్రధాని మోడీని కలుస్తానన్నారు. అంతవరకు బాగానే ఉంది. 2019 ఎన్నికలు తన టార్గెట్ కాదని, 25 ఏళ్ల ప్రస్థానం తన లక్ష్యమని ప్రసంగాల్లో చెబుతున్నారు. బలమున్న స్థానాల్లోనే పోటీ చేస్తానంటున్నారు. సమస్యలు తెలుసుకునేందుకే అంటూ ఆదివారం ఉదయం మంత్రి పరిటాల సునీత ఇంటికి వెళ్లారు. మంత్రి, ఆమె తనయుడు శ్రీరామ్‌తో భేటీ అయ్యారు. అనంతపురం సమస్యలు పరిష్కారం గురించే మంత్రిని కలిశానని చెబుతున్నారు. 2014లో టీడీపీకి మద్దతు పలికారు కదా... 2019లో కూడా మద్దతు పలకుతారా అని మీడియా ప్రశ్నించగా ప్రజాభీష్టం మేరకు పొత్తులపై నిర్ణయం తీసుకుంటానన్నారు. వైసీపీ నుండి టీడీపీలో చేరిన కదిరి ఎమ్మెల్యే చాంద్‌బాషా ఇంటికి వెళ్లి మాట్లాడారు. శని వారం సాయంత్రం అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే ప్రభా కర్ చౌదరితో సమావేశమయ్యారు. సమస్యలపై త్వరలోనే ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని కలుస్తానన్నారు. ఇలా అధికార తెలుగుదేశం పార్టీ నేతలతో పవన్ కల్యాణ్ సమావేశం కావటం, ప్రసంగాల్లో అనంతపురం అభివృద్ధి గురించి ప్రభుత్వానికి విన్నవిస్తాననటం, టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలపై ఎలాంటి విమర్శలు సంధించకపోవటం పార్టీ క్యాడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. పవన్ టీడీపీ నేతలతో దోస్తీగా ఉండటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించకపోవటంతో... 2019 ఎన్నికల్లో టీడీపీతో పవన్ పొత్తు పెట్టుకుంటారన్న అనుమానాలు బలంగా ఆ పార్టీ క్యాడర్‌లో నాటుకుంటున్నాయి. దీనికితోడు టీడీపీ, బీజేపీ మధ్య రెండు మూడు రోజులుగా జరుగుతున్న మాటలయుద్ధాన్ని గమనించిన పలు పార్టీల నాయకులు, జనసేన కార్యకర్తలు 2019 ఎన్నికల్లో బీజేపీతో టీడీపీ పొత్తు విరమించుకుంటే...జనసేన, టీడీపీలు స్నేహహస్తం అందించుకుంటాయని భావిస్తున్నారు. అంతేకాకుండా బలమున్న చోటే పోటీ చేస్తాననటం, 2019 ఎన్నికలు తన టార్గెట్ కాదనటం వల్ల జనసేన టికెట్లతో పోటీ చేయాలని ఆశపడుతున్న వారు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటి నుండే తాము ఆ పార్టీలో చేరి ఖర్చు పెట్టుకుంటే మరొక రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకొని పరిమిత సీట్లలోనే పోటీ చేస్తే తమ రాజకీయ భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళనలో ఔత్సాహికులున్నారు. దీనికి తోడు ఇప్పటి వరకు జనసేనకు కార్యవర్గాలు ఏర్పాటు కాలేదు. పార్టీ నిర్మాణమే జరగలేదు. పొత్తుల గురించి అప్పుడే వ్యాఖ్య లేమిటని ఆ పార్టీ క్యాడర్‌లో చర్చసాగుతోంది. తన అన్న చిరంజీవిని మోసం చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టనంటూ గతంలోనే పవన్ హెచ్చరించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకపోవటంతో ఇంతకుముందు బీజేపీని తూర్పారబట్టిన పవన్.. ఈ పర్యటనలో ఆ ఊసు ఎత్తటం లేదు. దీంతో జనసేన స్థాపకుడు అంతిమ రాజకీయ లక్ష్యం ఏమిటన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఏ రాజకీయ పార్టీ ప్రజాభిమానం చూరగొనాలన్నా ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిలను ఎండగట్టడం రాజకీయాల్లో రివాజు. అయితే పవన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాజిటివ్ లైన్‌లో సాగాలనుకుంటున్నట్లు ఆయన ప్రసంగాల ద్వారా అర్థమవుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే జనసేన రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న దానిపై రాజకీయ పండితులకే లెక్కలు అర్థం కావటం లేదు. తనకు కులం, మతం లేవని పవన్ కల్యాణ్ చెబు తున్నా..కాపు సమాజాన్ని ఆయన ప్రభావితం చేస్తారన్నది వాస్తవం. ఆయనను అభిమానించే సామాజి కవర్గాలు, అభిమానులకు పవన్ రాజకీయ అడుగులపై సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వా లకు విన్నవించేందుకు రాజకీయపార్టీ పెట్టాల్సిన అవసర మేలేదని, సేవా సంస్థ స్థాపించి దాని ద్వారా ప్రజాసమ స్యల సాధనకు కృషి చేయవచ్చని కొందరు వ్యాఖ్యానిస్తు న్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నానంటూ ప్రకటించి రాజకీయాలలో నిరుద్యోగులుగా ఉన్నవారికి ఆశాకిరణం గా కనిపించిన పవన్ వ్యవహరిస్తున్న తీరు ఆయా వర్గాల్లో నిరాశ కలిగిస్తోంది. మొత్తం మీద పవన్ చలోరే... చలోరే... చల్ ప్రారంభంలోనే ఆ పార్టీలో గందరగోళాన్ని సృష్టిస్తోందన్నది వాస్తవం.

మోడీ మరో హిట్లర్!

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్



విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : పాసిస్టు పాలనను తలపిస్తూ ప్రధాని నరేంద్రమోడీ మరో హిట్లర్‌లా తయారయ్యారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ప్రస్తుతం మోడీ హయాంలో సంఘ్‌పరివార్ శక్తులు పెట్రేగిపోతున్నాయని, వ్యక్తులను కొట్టిచంపే సంస్కృతి మొదలయిందని ధ్వజమెత్తారు. ముఖ్యంగా మైనారిటీలు, దళితులపై దేశవ్యాప్తంగా దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో జరుగుతున్న సీపీఐ 12 మహాసభల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ప్రతినిధుల సభలో జేవీ ఎస్ఎన్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు మోడీని కార్పొరేట్ మీడియా ఆకాశానికెత్తేసిందని, నిజంగా అంత గొప్ప పాలన గుజరాత్‌లో ఉంటే, ఆ రాష్ట్రంలోని అత్యధికశాతం మహిళలు, పిల్లలు ఇప్పటికీ రక్తహీనతతో ఎందుకు బాధపడుతున్నారని ప్రశ్నించారు. సీబీఐకేంద్ర సంస్థలను వాడుకొని రాష్ట్రాలను కేంద్రప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. బీజేపీ వైఖరి రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా, సమగ్రతను, సమైక్యతను దెబ్బతీసేవిధంగా ఉందన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, కానీ హిందూ కోడ్‌బిల్లును ఎందుకు తేవటం లేదని నిలదీశారు. .వామపక్ష, ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులను ఏకం చేసి సిపిఎంతో కలిసి త్వరలో రాష్ట్రంలో మరో ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు, పవన్‌కల్యాణ్ విధానాలను బట్టి ఆయనతో పొత్తుపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ హిందూ మతోన్మాద పార్టీగా తన పేరును బీజేపీ మరోసారి సార్థకం చేసుకుందన్నారు. ప్రజలకిచ్చిన వాగ్దానాల్లో ఒక్క దాన్ని కూడా అమలు చేయని ఘనత మోడీకి దక్కిందన్నారు. దేశవ్యాప్తంగా 163 రైతు సంఘాలు గగ్గోలు పెడుతున్నాయని, అన్ని వర్గాలు ఇబ్బందుల్లో ఉన్నాయని అన్నారు. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే ధరలను తగ్గిస్తామన్న మోడీ, ఎక్కడ తగ్గించారో చూపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు, ఆహ్వానసంఘం అధ్యక్షులు వి.కృష్ణంరాజు మాట్లాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఒమ్మి రమణ, బుగత అశోక్, ఆహ్వాన సంఘం కార్యదర్శి అల్తి అప్పలనాయుడుతోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యవర్గ సభ్యులు, పెద్దసంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు.

2న మోటారు కార్మికుల ధర్నాలు, ప్రదర్శనలు

జయప్రదానికి చలసాని రామారావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న చలసాని రామారావు

విశాలాంధ్ర - విజయవాడ : ఆటో, మోటారు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 2న చేపట్టిన ధర్నాలు, ప్రదర్శనలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, ఆటో సంఘం ఇన్‌చార్జి చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర సమితి సమావేశం ఆదివారం విజయవాడ, గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చలసాని రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల పొట్టలు కొట్టే విధంగా పెనాల్టీలు, జరిమానాలు పెంచుతూ కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. డీజిల్, పెట్రోల్ ధరలను భారీగా పెంచి వాహనదారులపై పెద్ద ఎత్తున ఆర్థికభారాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన డీజిల్, పెట్రోల్, థర్డ్‌పార్టీ ఇన్స్యూరెన్స్ ఉప సంహరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 2న కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జరగబోయే ధర్నాలు, ప్రదర్శనల్లో ఆటో, మోటారు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల కళ్ళు తెరిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఎఫ్.సి.,డిఎల్ చలానా, జరిమానాలను భారీగా పెంచి విడుదల చేసిన 894 గెజిటెడ్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. డీజిల్, పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని, లేదంటే డీజిల్ ధరలపై అమలు చేస్తున్న ఎక్సైజ్ , వాట్ ట్యాక్సులను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేదల సంక్షేమాన్ని హరించి కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీలు పరుస్తున్న పాలకులను నిలదీయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రహిమాన్, పి ప్రభాకర్, జి జనార్ధన్, జి ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమన్నాపై బూటు విసిరిన యువకుడు


విశాలంధ్రబ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ప్రముఖ సినీతార తమన్నాకు చేదు అనుభవం ఎదురైంది. హిమాయత్‌నగర్‌లో మలబార్ నగల దుకాణం ప్రారంభోత్సవానికి తమన్నా ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున అక్కడకు చేరుకొన్నారు. బౌన్సర్ల అత్యుత్సాహం వల్ల కొంతమంది అభిమానులు అసహనానికి గురయ్యారు. దీంతో కరీముల్లా అనే యువకుడు కోపంతో తమన్నాపైకి బూటు విసిరాడు. అది ఆమెకు కొంతదూరంలో పడిపోయింది. దీన్ని గుర్తించిన బౌన్సర్లు అతనిపై చేయిచేసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కరీముల్లాను అరెస్టుచేసి బూటు విసరడానికి గల కారణాలను ఆరాతీశారు. కరీముల్లా చెప్పిన సమాధానం వారిని విస్మయానికి గురిచేసింది. తాను తమన్నాకు అభిమానినని, ఆమె సినిమాలన్నీ చూస్తానని, ఇటీవల ఆమె తెలుగు సినిమాలు చేయడంలేదన్న కోపంతోనే అలా చేశానని కరీముల్లా చెప్పాడు.

రేపు హిందూ మతోన్మాద వ్యతిరేక దినం

వరంగల్ : ప్రజాస్వామ్యంలో ప్రజల ఆమోదం పొందడానికి, ప్రజా అవసరాలను గుర్తించడానికి ప్రజా జీవన విధానంలో మార్పులు తేవడానికి చర్చలు, సంప్రదింపులు అవసరమని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ అన్నారు. వాటి ద్వారా మాత్రమే సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం సాధ్యమవుతుందన్నారు. దేశంలో హిందూమతోన్మాద శక్తులు దీనికి వ్యతిరేకంగా...హింస, బెదిరింపులు, ప్రజాస్వామ్యవాదులను హత్య చేయడం ద్వారా...చర్చ అనే అంశమే తెరపైకి రాకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని, హిందూమతోన్మాదమే ఈ దేశంలా ఉండాలనే నిరంకుశవాదాన్ని, అరాచకత్వాన్ని అవలంబిస్తున్నారని విమర్శించారు. మూఢనమ్మకాలు నిర్మూలించాలని చెప్పడాన్ని నేరంగా పరిగణించి... బెదిరింపులకు , దాడులకు ,హత్యలకు మతోన్మాదులు పాల్పడుతున్నారని అన్నారు. దబోల్కర్, పన్సారీ, కాల్బుర్గి, గౌరీశంకర్ హత్యలు ఈ కోవకు చెందినవేనని గుర్తు చేశారు. స్వేచ్ఛ, సమానత్వంపై మాట్లాడినందుకు, హిందూమతోన్మాదాన్ని వ్యతిరేకించినందుకే వారిని హతమార్చారని విమర్శించారు. గోరక్షణ నెపంతో సామాన్యులపై పాశవికంగా దాడులు చేస్తున్న హిందూత్వవాదులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో భయోత్పాతం సృష్టిస్తున్నారని అన్నారు. మోడీ హయాంలో ఇవి మరింత ఎక్కువయ్యాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకు ప్రజాసంఘాలు, మేధావులు, రచయితలు, విద్యార్థి సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.


విశాలాంధ్ర
క్రీడలు

గర్జించిన ఫెదరర్



- ఆరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత
- గెలిచేందుకు 3గంటల 30 నిమిషాలు
- 20 గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన మొట్టమొదటి ఆటగాడు

మెల్‌బోర్న్: స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సిరీస్‌ను దక్కించుకున్న పాత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఆదివారం రాడ్‌లావర్ అరీనాలో జరిగిన పోరులో ఆరోసారి ఈ ఘనత సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఫెదరర్ 20 గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. తన ప్రత్యర్థి మారిన్ సిలిక్‌ను 6-2, 6-7, 6-3, 3-6, 6-1 తేడాతో మట్టికరిపించాడు. జరిగిన ఐదు సెట్లలో నాలుగో సెట్ మినహా ఎక్కడా వెనుకంజ వేయలేదు. మొత్తంగా తన ప్రత్యర్థిని మట్టికరిపించేందుకు మూడు గంటల ముప్పై నిమిషాలు పట్టింది. మెల్‌బోర్న్‌లు గెలుపోటములు ఉన్నాయనీ, ఈ విజయంతో అది 94-13గా మారిందని ఫెదరర్ తెలిపాడు. సిలిక్‌ను వచ్చే సర్వీసులన్నీ కష్టసాధ్యంగా ఉన్నాయి. మొదటి సెట్‌ను గెలుచుకునేం దుకు ఫెదరర్ బాగానే కష్టపడాల్సి వచ్చింది. దాదాపుగా మూడుసార్లు బ్రేక్‌పాయింట్లు వచ్చాయి. దీంతో 0-3తో వెనుకబడిన ఫెదరర్ అనూహ్యంగా 4-1 తేడాతో లీడ్‌లోకి వచ్చాడు. మొదటి టెస్టును గెలుచుకు నేందుకు దాదాపుగా 24 నిమిషాలు పట్టింది. సెకండ్ సెట్‌లో ఫెదరర్ రెండు బ్రేక్‌పాయింట్లు సాధించాడు. గ్రౌండ్ స్ట్రోక్ తప్పిదాలు చేసిన సిలిక్ మూడోసెట్‌లో కోలుకోలేకపోయాడు. దీంతో లీడ్‌లోకి వచ్చిన ఫెదరర్ అనూహ్యంగా నాలుగో సెట్‌ను కోల్పోవాల్సి వచ్చింది. దెబ్బతిన్న పులిలా సిలిక్ నాలుగో సెట్‌లో ఫెదరర్‌ను కోలుకోనివ్వలేదు. దీంతో సెట్‌ను ఫెదరర్ వదులుకోవాల్సి వచ్చింది. అనంతరం ప్రారంభమైన చిట్టచివరి సెట్‌లో ఇక ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, సిలిక్‌ను కోలుకోనివ్వలేదు ఫెదరర్. అనూహ్యంగా లీడ్‌లోకి వచ్చి, అదే లీడ్‌ను కొనసాగిస్తూ సెట్‌ను చేజిక్కించుకుని చిరస్మరణీయమైన 20వ టైటిల్‌ను దక్కించుకున్నాడు.



ఫైనల్లో సైనా ఓటమి

జకార్తా: ఇండోనేషియా ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఓటమి పాలైంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో సైనా ప్రపంచ నంబర్‌వన్ తై జు యింగ్ చేతిలో 21-9, 21-13 తేడాతో ఓటమి పాలై టైటిల్‌ను చేజార్చుకుంది. తొలి గేమ్ నుంచి ఆధిక్యం ప్రదర్శించిన తై జు చివరి వరకూ అదే జోరును కొనసాగించింది. తై జు ఇండోనేషియా మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ టైటిల్‌ను గెలుచుకున్న తొలి చైనీస్ తైపే క్రీడాకారిణిగా తై జు నిలిచింది.



టీ20 'నంబర్ వన్'

పాకిస్థాన్ క్రికెటర్ల ఆనందం

హామిల్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను పాకిస్థాన్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో 18 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను చేజిక్కించుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లకు 181 పరుగులు చేసింది. ఫకార్ జమాన్(46) రాణించగా, సర్ఫరాజ్ అహ్మద్(29), ఉమర్ అమిన్(21), హారిస్ సోహైల్(20 నాటౌట్), అహ్మద్ షెహజాద్(19), బాబర్ అజమ్(18)లు పర్వాలేదనిపించారు. ఆపై లక్ష్య ఛేదనలో కివీస్ 163 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. మార్టిన్ గప్టిల్(59) హాఫ్ సెంచరీ సాధించగా, రాస్ టేలర్(25), శాంత్నార్(24 నాటౌట్)లు మోస్తరుగా ఆడారు. అంతకుముందు జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో పాకిస్థాన్ వైట్‌వాష్ అయిన సంగతి తెలిసిందే. దాంతో టీ20 సిరీస్‌ను కూడా కివీస్ సునాయాసంగా గెలుస్తుందని భావించారు. కాగా, అంచనాలు తారుమారు చేస్తూ పాకిస్తాన్ వరుస రెండు విజయాలతో సిరీస్‌ను 2-1తో సాధించింది. ఫలితంగా వన్డేల్లో ఎదురైన ఘోర పరాభవానికి పాకిస్థాన్ ప్రతీకారం తీర్చుకుంది. ఈ తాజా సిరీస్ విజయంతో ట్వంటీ 20ల్లో పాకిస్థాన్ నంబర్‌వన్ ర్యాంకును సొంతం చేసుకుంది. అదే క్రమంలో న్యూజిలాండ్ రెండో ర్యాంకు పడిపోయింది.

టీ20కి జట్టు ఎంపిక

ముంబై: దక్షిణాఫ్రికాతో జరగనున్న మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌కు భారత జట్టు ఎంపికైంది. చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలో సమావేశమైన సెలక్షన్ కమిటీ ఈ మేరకు జట్టును ప్రకటించింది. ఫిబ్రవరి 18, 21, 24 తేదీల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫిబ్రవర్ 1 నుంచి ఇరు జట్ల మధ్య ఆరు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఇందుకోసం వన్డే జట్టు ఇప్పటికే దక్షిణాఫ్రికా చేరుకుంది. మూడు టెస్టుల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2-1 తేడాతో గెలుపొందిన సంగతి తెలిసిందే. తొలి రెండు టెస్టుల్లోనూ పరాజయం పాలైన టీమిండియా.. మూడో టెస్టులో అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చి 63 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టుపై గెలుపొందింది. వన్డే సిరీస్ ముందు ఈ విజయం టీమిండియాకు ఉత్సాహాన్నిచ్చేదే.

భారత జట్టు: విరాట్ కోహ్లి(కెప్టెన్), రోహిత్‌శర్మ(వైస్ కెప్టెన్), శిఖర్ ధావన్, ధోని, కేఎల్ రాహుల్, సురేశ్ రైనా, దినేశ్ కార్తీక్, హార్దిక్ పాండ్యా, మనీష్ పాండే, అక్షర్ పటేల్, చాహల్, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, జయదేవ్ ఉనద్కత్, శార్దుల్ ఠాకూర్

ఐపీఎల్ వేలం రెండోరోజు

మెరిసిన ఉనద్కట్



రికార్డుస్థాయిలో రూ.11.50కోట్లు

- షబాజ్ నదీమ్‌కు 3.2కోట్లు
- గేల్‌కు రూ.2 కోట్లు

బెంగళూరు: రెండో రోజు ఆదివారం ఐపీఎల్ వేలంలో జయదేవ్ ఉనద్కట్ ఇప్పటి వరకూ వేలంలో అత్యధిక ధర పలికిన భారత ఆటగాడిగా నిలిచాడు. ఉనద్కట్‌ను కొనుగోలు చేసేందుకు పంజాబ్, చెన్నై సూపర్ కింగ్స్ పోటీపడ్డాయి. కానీ చివరికి అతడిని రాజస్థాన్ రాయల్స్ రూ.11.50కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. ఉనద్కట్ ప్రారంభ ధర రూ.1.50కోట్లు. ఇప్పటి వరకూ అత్యంత ధర పలికిన ఆటగాళ్లలో ఉనద్కట్ రెండో స్థానంలో నిలిచాడు. తొలి రోజు జరిగిన వేలంలో బెన్ స్టోక్స్ రూ.12.50కోట్లు పలికాడు. 16ఏళ్ల అఫ్గాన్ స్పిన్నర్ ముజీబ్ జర్దాన్‌ను రూ.4కోట్లు పెట్టి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సొంతం చేసుకుంది. అతడి ప్రారంభ ధర రూ.50లక్షలు. ఇక హైదరాబాద్ కుర్రాడు మహమ్మద్ సిరాజ్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ రూ.2.60కోట్లకు కొనుగోలు చేసుకుంది. అతడి బేస్ ప్రైజ్ రూ.కోటి. సిరాజ్‌ను సొంతం చేసుకునేందుకు కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్‌కింగ్స్ పోటీ పడినప్పటికీ.. చివరికి ఆర్‌సీబీ సొంతం చేసుకుంది. ప్రజ్ఞాన్ ఓజాను కొనుగోలు చేసేందుకు ఏ ఫ్రాంచైజీ ముందుకు రాలేదు. ఐపీఎల్ 11వ సీజన్ కోసం నిర్వహించిన వేలం రెండో రోజు ఉత్కంఠగా ప్రారంభమైంది. మొత్తం 578 మంది క్రికెటర్లలో తొలిరోజు 110 మందిని వేలం వేయగా.. 78 మంది అమ్ముడుపోయారు. ఇందులో 49 మంది భారత క్రికెటర్లున్నారు. రెండో రోజు వేలం రాహుల్ చాహర్‌తో ప్రారంభమైంది. రాజస్థాన్‌కు చెందిన ఈ స్పిన్ మాంత్రికుడిని ముంబై ఇండియన్స్ రూ.1.90కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. అతడి ప్రారంభ ధర రూ.20లక్షలు కాగా.. అధిక ధరకు అమ్ముడుపోయాడు. గత సీజన్‌లో రాహుల్ రైజింగ్ పూణె సూపర్‌జెయింట్(ఆర్‌పీఎస్) తరపున ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 2 వికెట్లు తీశాడు. గతేడాది వేలంలో రాహుల్ రూ.10లక్షలు పలికాడు. ఇక భారత స్పిన్నర్ కేసీ కరియప్పను కొనుగోలు చేసేందుకు ఏ ఫ్రాంచైజీ ముందుకు రాలేదు. గతేడాది కరియప్ప కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరపున ఆడాడు. ఇక గతేడాది ముంబై ఇండియన్స్ తరపున ఆడిన 29ఏళ్ల గౌతమ్ కృష్ణప్ప మంచి ధర పలికాడు. రూ.6.2కోట్లు వెచ్చించి రాజస్థాన్ రాయల్స్ అతడిని కొనుగోలు చేసింది. రైజింగ్ పూణె తరపున రవిచంద్రన్ అశ్విన్‌తో పాటు ఆడిన మురుగన్ అశ్విన్‌ను ఈ ఏడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ రూ.2.2కోట్లకు సొంతం చేసుకుంది. అతడి ఆరంభ ధర రూ.20లక్షలు. మరో ఆటగాడు ఎవిన్ లూయిస్‌ను ముంబై ఇండియన్స్ రూ.3.2కోట్లకు కొనుగోలు చేసింది. ముంబై ఓపెనర్ సౌరభ్ తివారిని రూ.80లక్షలకు ముంబై ఇండియన్స్ సొంతం చేసుకుంది.

గేల్ రేటు రూ.2 కోట్లు



టీ20 స్పెషలిస్టు, యూనివర్స్ బాస్, వెస్టిండీస్ విధ్వంసక వీరుడు క్రిస్‌గేల్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సహ యజమాని ప్రీతిజింతా కరుణించింది. మూడోసారి వేలంలోకి వచ్చిన అతడిని కనీస ధర రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. తొలిరోజు జరిగిన ఐపీఎల్ వేలంలో గేల్‌ను ఎవ్వరూ కొనుగోలు చేయలేదు. అతడి పేరు చెప్పినప్పుడు ఏ ఫ్రాంచైజీ అంతగా ఆసక్తి ప్రదర్శించలేదు. ఈ నేపథ్యంలో రెండోరోజు మొదటి సెషన్‌లో అతడిని వేలానికి ఉంచినప్పుడు సైతం ఫ్రాంచైజీలు అనాసక్తినే ప్రదర్శించాయి. ఇక క్రిస్‌గేల్ ఐపీఎల్ పదకొండో సీజన్‌లో కనిపించడం కష్టమే అనిపించింది. అతడు బ్యాటింగ్ మెరుపుల సంగతేమో కానీ ఎంటర్‌టైన్‌మెంట్ మిస్సవుతామని చాలా మంది భావించారు. చివరికి మూడోసారి క్రిస్‌గేల్ పేరును వేలందారు చెప్పినప్పుడు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సహ యజమాని ప్రీతిజింతా కనీస ధర రూ.2 కోట్లకు అతడిని కొనుగోలు చేసింది. ముసిముసి నవ్వులు కురిపిస్తూ.. లయన్స్ డెస్క్‌లోకి గేల్‌ను ఆహ్వానించింది. ఈ ఐపీఎల్ వేలంలో ప్రీతిజింతా చాలామంది ఆటగాళ్ల ధరను అమాంతం పెంచేసిన సంగతి తెలిసిందే.

నేపాల్ యువసంచలనం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ కాంట్రాక్టు దక్కించుకున్న నేపాల్ తొలి క్రికెటర్‌గా యువ ఆటగాడు సందీప్ లామిచానె రికార్డు దక్కించుకున్నాడు. బెంగళూరులో రెండో రోజు జరుగుతున్న ఆటగాళ్ల వేలంలో కనీస ధర రూ.20 లక్షలకు అతడిని ఢిల్లీ డేర్‌డెవిల్స్ దక్కించుకుంది. 17 ఏళ్ల ఈ లెగ్ స్పిన్నర్ 2016 అండర్-19 ప్రపంచకప్‌లో తన సంచలన బౌలింగ్‌తో నేపాల్‌ను ఎనిమిదో స్థానంలో నిలిపాడు. ఆరు ఇన్నింగ్సుల్లో 17 సగటుతో 4.67 ఎకానమీతో 14 వికెట్లు తీశాడు. టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. సందీప్ ప్రదర్శనకు ముగ్ధుడైన ఆసీస్ మాజీ సారథి మైకేల్ క్లార్క్ అతడిని హాంకాంగ్ టీ20 బ్లిట్జ్‌లో కౌలూన్ కాంటూన్స్ తరపున ఆడించాడు. మళ్లీ ఆస్ట్రేలియాలో జరిగిన న్యూసౌత్ వేల్స్ ప్రీమియర్ క్రికెట్ సీజన్‌లో వెస్టన్ సబర్బ్స్ జట్టులోకి ఆహ్వానించాడు.



నమ్మకమే గెలిపించింది : కోహ్లి

జొహానెస్‌బర్గ్: దక్షిణా ఫ్రికాతో జరిగిన మూడో టెస్టులో తమ జట్టు చివరి వరకు నమ్మకం కోల్పోలేదని భారత సారథి విరాట్ కోహ్లి అన్నాడు. బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారని ప్రశంసించాడు. 'బయటి వ్యక్తుల్లా మేం ఆలోచించం. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మేం అది చేస్తే బావుండేది.. మేం ఇది చేస్తే బావుండేది అని అనుకోం. అలా చెప్పడం చాలా సులువైన పని' అని విమర్శకులను ఉద్దేశించి అన్నాడు. చివరి టెస్టులో భారత్ 63 పరుగులు తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. 'అలాంటి కష్టతరమైన వికెట్‌పై ఆడుతున్నప్పుడు, ప్రత్యర్థి వద్దనున్న దుర్భేద్యమైన బౌలర్లను ఎదుర్కోవాల్సినప్పుడు తొలుత బ్యాటింగ్ ఎంచుకోవడం కత్తిమీద సామే! అయితే ఆ పిచ్‌పై నాలుగో ఇన్నింగ్స్ ఆడడం చాలా కష్టమని తెలుసు కాబట్టే మేం బ్యాటింగ్ ఎంచుకున్నాం. తొలి రెండు మ్యాచుల్లో మేం కొన్ని తప్పులు చేశాం. అయితే మా జట్టు నమ్మకం కోల్పోలేదు. ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో ప్రత్యర్థి కన్నా బాగా ఆడితే మేం గెలుస్తామని తెలుసు. చివరి టెస్టులో అదే చేశాం గెలిచాం' అని కోహ్లి తెలిపాడు. చివరి టెస్టులో విజయం చాలా ప్రత్యేకమైందని విరాట్ పేర్కొన్నాడు. 'ఈ విజయం మాకో మైలురాయి. గెలుస్తామని మాకు పూర్తి నమ్మకం ఉంది. ఇప్పుడు మీ ముందు ఫలితం కనిపిస్తోంది. మాకు అనుకూలంగా లేని పరిస్థితుల్లో కుర్రాళ్లు ఇలాగే రాణించాలని కోరుకుంటున్నా. పిచ్‌పై పచ్చిక ఎక్కువగా ఉండటంతోనే ఐదుగురు పేసర్లతో ఆడాలని నిర్ణయించుకున్నాం. పాండ్య ఉండటంతో బౌలింగ్ విభాగం కూర్పు బాగా కుదిరింది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా కన్నా మేమే బ్యాటింగ్, బౌలింగ్ బాగా చేశాం. ఆమ్లా, ఎల్గర్ కుదురుకోవడంతో వికెట్లు పడలేదు. అలాంటి పరిస్థితుల్లో నేను జట్టుపై విశ్వాసం ఉంచా. ప్రత్యర్థి జట్టు కొన్ని వికెట్లు నష్టపోతే మ్యాచ్ కచ్చితంగా మలుపు తిరుగుతుందని మాకు తెలుసు. అదే జరిగింది. మాకు చిరస్మరణీయ విజయం దక్కింది' అని కోహ్లి పేర్కొన్నాడు.

మనీ లాండరింగ్‌కు కేరాఫ్ ఐపీఎల్



కోల్‌కతా: ఐపీఎల్ వేలంలో భారీఎత్తున డబ్బు కుమ్మరించడంపై భారత మాజీ స్పిన్నర్ బిషన్‌సింగ్ బేడీ విమర్శల దాడి చేశాడు. అక్రమమార్గాల ద్వారా సొమ్ము చేతులు మారడానికి ఇది వేదికైందన్నాడు. 'ఐపీఎల్‌వల్ల బోర్డుకార్యకలాపాల్లో కోర్టులు జోక్యం చేసుకున్నాయి. ఒక వికెట్ కోటి రూపాయలా ఒక రన్‌కు 97 లక్షలా? ఇది మంజసమేనా? ఇంతడబ్బెలా వస్తోందో.. బయటకెలా వెళ్తుందో తెలియాలి. దీనిని మనీ లాండరింగ్ గాక మరేమనాలి?' అని విమర్శించాడు.

'ఫ్లాట్ పిచ్‌లతో స్వాగతం పలికారా?'



జొహానెస్‌బర్గ్: కోహ్లిసేనతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో బౌన్సీ పిచ్‌లను డిమాండ్ చేయడంలో తప్పేమీ లేదని దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్ అన్నాడు. గతంలో తాము భారత్‌లో పర్యటించినప్పుడు వారేమైనా ఫ్లాట్, బౌన్సీ పిచ్‌లతో స్వాగతం పలికారా ఏంటి? అని ఎదురు ప్రశ్నించాడు. మూడో టెస్టు జరిగిన వాండరర్స్ పిచ్ అనూహ్యంగా బౌన్స్ అవుతూ ఆటగాళ్లకు బంతులు తగలడంతో ప్రమాదకరంగా ఉందంటూ విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డుప్లెసిస్ మీడియాతో మాట్లాడాడు. 'ఒక శాతమో ఐదు శాతమో పది శాతమో ఎంతో కొంత ప్రత్యర్థి కన్నా ఆతిథ్య జట్టుకు అవకాశాలు మెరుగ్గా ఉండాలని కోరుకోవడంలో తప్పులేదు. భారత్‌లో పర్యటించినప్పుడు మేం ఫ్లాట్, బౌన్సీ పిచ్‌లపై ఏమీ ఆడలేదు. అప్పుడు సైతం అక్కడ ఇలాగే విమర్శలు వచ్చి ఉండొచ్చని అనుకుంటున్నా. నా వరకైతే టెస్టు సిరీస్‌కు అవసరమైన పరిస్థితులు ఉండేలా పిచ్‌లు రూపొందించాలనే మేం మైదానం సిబ్బంది, జట్టు మేనేజ్‌మెంట్‌తో చెప్తాం' అని డుప్లెసిస్ అన్నాడు. 'తొలి రెండు రోజులు వాండరర్స్ పిచ్ ప్రమాదకరంగా ఉన్నట్టు నాకేమీ అనిపించలేదు. అయితే డీన్ ఎల్గర్ నుదురుకు బంతి తగిలినప్పుడు మాత్రం కాస్త ఆలోచించా. అదీ ఆటగాళ్లు సురక్షితంగా ఉండాలనే కోణంలోనే ఆలోచించా. భారత ఇన్నింగ్స్‌లోనూ కొందరు ఆటగాళ్ల చేతులకు గాయాలయ్యాయి. అలాంటి సందర్భాలను లెక్కిస్తే సాధారణం కన్నా ఈ సారి ఎక్కువే ఉన్నాయి. బంతి విపరీతంగా స్పందించడం, అతిగా బౌన్స్ అవ్వడం, పక్కకు పోవడం కఠినమైందే కానీ ప్రమాదకరమేమీ కాదు. సరైన లెంగ్త్‌లో వచ్చిన బంతులు తగిలితే ప్రమాదకరం అనుకోవచ్చు. కానీ నాలుగో రోజు పిచ్ సాధారణంగానే ఉండటం ఆశ్చర్యకరం. ఇక మ్యాచ్ విషయానికి వస్తే మా కన్నా ప్రత్యర్థి జట్టు బౌలర్లు, బ్యాట్స్‌మెన్ బాగా ఆడారు. మాకు అవకాశాలున్నా నిలబెట్టుకోలేకపోయాం' అని డుప్లెసిస్ అన్నాడు.

సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్

పంజాబ్, ఆర్‌ఎస్‌బీ బెంగళూరు గెలుపు



విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మూలపాడు ఎ గ్రౌండ్‌లో రెండవ రోజు పంజాబ్-తమిళనాడు జట్టుల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు నిర్ణీత 20 ఓవర్లలో 74 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు 9.3 ఓవర్లలో 78 పరుగులు చేసి 7 వికెట్లతో విజయం సాధించింది.

పుదుచ్చేరి, ఢిల్లీ జట్ల గెలుపు

అనంతరం పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ జట్ల మధ్య మ్యాచ్ మధ్యాహ్నం జరిగింది. తొలుత టాస్ గెలిచిన పుదుచ్చేరి బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్ చేసిన ఉత్తరాఖండ్ 109 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 4 పరుగుల తేడాతో పుదుచ్చేరి విజయం సాధించింది.

బి-గ్రౌండ్‌లో..

బి గ్రౌండ్ లో జరిగిన మ్యాచ్ లో మధ్యప్రదేశ్-ఆర్‌ఎస్‌బీ బెంగళూరు జట్టుల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ జట్టు బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలలో 59 పరుగులకు చేసింది. తదుపరి బ్యాటింగ్ చేసిన ఆర్‌ఎస్‌బి బెంగళూరు జట్టు 6 ఓవర్లలలో 60 పరుగులు సాధించి విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఒడిశా-ఢిల్లీ సెక్రటేరియట్ జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచి ఒడిశా బ్యాటింగ్ ఎంచుకుని 17.3 ఓవర్లలో 57 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం ఢిల్లీ సెక్రటేరియట్ జట్టు బ్యాటింగ్ చేపట్టి 12 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి విజయానికి కావాల్సిన 58 పరుగులు చేసి విజయం సాధించింది. సిద్దార్థ మెడికల్ గ్రౌండ్స్‌లో ఆర్‌ఎస్‌బీ ముంబై-కర్నాటక జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్‌ఎస్‌బీ ముంబై జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 303 పరుగులు చేసింది. తదుపరి బ్యాటింగ్ చేసిన కర్నాటక జట్టు 20 ఓవర్లలో 99 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఆర్‌ఎస్‌బీ ముంబై జట్టు 204 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. మధ్యాహ్నం సిద్దార్థ మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో ఆర్‌ఎస్‌బీ జైపూర్-ఆర్‌ఎస్‌బీ కొచ్చిల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి ఆర్‌ఎస్‌బీ జైపూర్ 18.1 ఓవర్లలో 134 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్ చేసిన ఆర్‌ఎస్‌బీ కొచ్చి 20 ఓవర్లలో 128 పరుగులు మాత్రమే చేసింది. ఉత్కంఠగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆర్‌ఎస్‌బీ జైపూర్ 6 పరుగులు తేడాతో విజయం సాధించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.